ఆంధ్ర సచిత్ర వార
పత్రిక



22-4-66
35 పైసలు

సబ్బు మనోహరమైనది



సౌందర్య సబ్బు మరియు దుర్వాసనను పోగొట్టు పదార్థము కొరకు చాలా కాలము శ్రమపడి లేబరేటరీలో శోధన చేసిన పిమ్మట అద్వితీయమైన జి-11* (హెక్సాక్లోరోఫీన్) కల సింథాల్ వెలువడినది... దుర్వాసన వచ్చేముందే దానిని ఆపివేయును. మనోహరమైన ఈ సబ్బు మీకు సువాసనతో కూడిన సొగసుతనము, నూతన ఆరోగ్యము, సౌందర్యమును సమకూర్చును. సింథాల్ సబ్బు మరియు టాయ్‌లెట్ పౌడరు, రెండింటిలో కూడా జి-11* (హెక్సాక్లోరోఫీన్) వున్నది. యూరప్ మరియు అమెరికాలో ప్రసిద్ధికెక్కిన సబ్బు నిర్మాతలచే వాడబడుచున్న జి-11* (హెక్సాక్లోరోఫీన్) గోద్రెజ్ వారికి ప్రత్యేకమైనది.

* ఎల్. గివడుదాన్ ఎట్ సై. ఎస్ ఎ. వారి ట్రేడ్ మార్క్.



సబ్బు మరియు కొన్ని టాయ్‌లెట్ ఉత్పత్తులలో వాడేందుకు, సంవత్సరాల తరబడి లేబరేటరీలలో పూర్తిగా దుర్వాసన పోగొట్టు పదార్థము కొరకు జరిపిన ఫలితమును మీరు పొందండి. పూర్తిగా వైజ్ఞానిక వివరములకు "జి 11 అంటే ఏమిటి?" అనే ఉచితమైన, సచిత్ర పుస్తకము కొరకు గోద్రెజ్, బొంబాయి-12 కు వ్రాయండి



ఎన్నో రోజులు వస్తుంది,
పొదుపైనది
సింథాల్ అన్నిటికన్నా
ఉత్తమమైనది

CT 24-TEL.

ఉత్తరాలు



ముఖచిత్రం

ఈవారం ముఖచిత్రం అత్యంత ఆకర్షణీయంగా ఉంది. 'హిందీ నటి షర్మిలా ఠాగోర్' అని వ్రాశారు. బెంగాలీ నటి 'షర్మిలా ఠాగోర్' అని ఉండవలసింది. ఏమంటారు ?

వై. సత్యనారాయణ (వర్నిక్రాసింగ్)

ఏమీ అనలేము —సం

* * *

18—3—66 సంచిక వారపత్రిక ముఖచిత్రం నటి భారతి ఆకర్షణీయంగా, అందంగా యున్నది ఈ నటి గురించి చిన్న వ్యాసంగా తెలియజేసినందులకు నాయొక్క అభివందనములు. నటి భారతి ఇంత త్వరగా కథానాయికగా నిర్మాతలు 'బుక్' చేసుకున్నారంటే ఈ నటి తప్పకుండా నటీమణి కాగలదని రుజువగుచున్నది

ఎం. భిక్షమాచారి (నల్లగొండ)

కథలు

18—3—66 పత్రికలో విహారి, శాలివాహన గార్ల కథ 'తేనె మనసులు' బాగానే ఉంది ముగింపు యింకా బాగుంది ఒక చిన్న అనుమానం. 'క్యూ' లేకుండా 'యు' కి విలువ, ఉనికి లేవు అని వ్రాసారు. కాని 'యు' లేకుండా 'క్యూ' కి విలువ, ఉనికి లేవని వ్రాయాలనుకుంటాము ఏమాత్రైనా 'క్యూ' తో మొదలయితే వెంటనే 'యూ' ఉంటుంది కాని 'యూ' తో మొదలైతే "క్యూ' వెంట ఉండదు విహారి, శాలివాహన (శ్రీపతి—సీతాపతి గుర్తొస్తున్నారు) లకు మా ధన్యవాదాలు. ప్రచురించిన మీకు కూడ .

వివేకానంద, వెంకుబాబు (గుంటూరు)

* * *

శ్రీ కృష్ణశేషుగారి కథానిక "తిరిగిరాని తనయుడు"పై, శిలారాణి, రూర్కేలాగారి విమర్శ చూశాను

" ఒక చెంపపై కొడితే రెండవచెంప చూపించు" మన్నసూక్తి యేసు క్రీస్తు ప్రభువు బోధించిన మాట వాస్తవమే.

అయితే, అదేవిషయాన్ని ప్రపంచంలో పెక్కుమంది మహానుభావులు పునర్వ్యచించారన్న సంగతి శ్రీమతి శీలారాణిగారికి బహుశా తెలియని విషయమేమో. ఈ మాటలు మహాత్మాగాంధి నోటివెంట రావటమే కాదు. ఆయన లండన్‌విశ్వ విద్యాలయంలో చదువుకుంటున్న రోజుల్లో, ఒక పాశ్చాత్య విద్యార్థి ఆయన్ను ఏదో కారణంగా ఒక చెంపపై కొడితే, చిరునగవుతో మహాత్ముడు రెండవ చెంప చూపించారట.

ఇక కథానికలోని కామేశ్వరమ్మ హిందూ వనితగాన, యేసుక్రీస్తు ప్రభువు పేరు కంటే మహాత్ముని పేరే ఈసందర్భంలో ఉదహరించటమన్నది— సహజత్వానికి దగ్గరగా ఉన్న విషయం

గంటిమహాపాత్రుని సూర్యభాస్కరరావ్,
(శృంగవరపు కోట)

ఉత్తరాలు

'పిచ్చుకగూడు' కథ వాస్తవికతకు చాలా దగ్గరగా ఉన్నది. ఆ కథలో రాజగోపాల్ లాంటి వ్యక్తులు నిజంగా ఉన్నారంటే చివరకు అపర్ణకు తీసుకున్న నిర్ణయం నాకు చాలా నచ్చింది. తెలివి తక్కువగా గుడ్డి ఆకర్షణలోపడి పెళ్లి చేసుకుని తరువాత పూర్తిగా గోతిలో దిగబడిపోకుండా చాలా సరయిన నిర్ణయానికివచ్చిన అపర్ణ నిజంగా ప్రశంసనీయురాలు.

వి సావిత్రి (వార్ధా)

* * *

శర్మగారి 'రవుడీ అబ్బాయి' కథ కథలా లేదు. నిజంగా, ఇది జరిగిందేమో అనిపించినంత బాగా శర్మగారు వ్రాశారు.

ఎస్. వి. ఎస్. ఎన్. మూర్తి (బరంపురం)

* * *

ఈ 8—4—66 వారం పత్రికలో (44వ పేజీలో) కార్టూన్ చూసి ఎప్పుడూ సీరియస్‌గావుండే మా బామ్మగారు కూడా నవ్వకుండా ఉండలేకపోయారు!

జె. నాగమణి (హైద్రాబాద్)

సినిమా

'సామాన్యుని స్వగతం'తో ఆంధ్రలోని మూడు వంతుల ప్రేక్షకులు ఏకీభవిస్తారనుకుంటున్నాను ఎక్కడో ఒకచోట గోపీచంద్ గారన్నట్లు "వ్యక్తినిబట్టి పనికి విలువ ఏర్పడుతుందిగాని, పనినిబట్టి వ్యక్తికి విలువ ఏర్పడరాదు" అనే వాక్య బాగా సరిపోతుంది యీ ఏవార్డుల విషయంలో.

పోనీ ప్రభుత్వమువారు 'ఏ యే రూల్సు ప్రకారం ఉత్తమ చిత్రాన్ని నిర్ణయించమని వ్యాయాధిపతులకు యిచ్చారో అవి ప్రచురిస్తే ప్రేక్షకులలోవున్న దురభిప్రాయాన్ని తొలగించినవారవుతారు. ఇది 'డెమోక్రసీ' అయినా అవి బయటకు రావు. అంతా "లోగుట్టు పెరుమాళ్ల కెరుక"

'కోరా' (కాకినాడ.)

* * *

వారపత్రికలో ప్రచురించిన "సామాన్యుని స్వగతం" నిజంగా సామాన్యుడు వ్రాసినదా? ఒక నిర్మాత వ్రాసినదా? లేక హైద్రాబాద్ అంటే గిట్టనివారు వ్రాసినదా?

ఆర్ కె రామారావు (హైదరాబాదు.)

సినిమా బాలట్

1965 వ సంవత్సరపు ఉత్తమచిత్రంగా ఆంధ్రప్రభుత్వం నిర్ణయించిన "అంతస్తులు ద్వారా "ఉత్తమ నటుడు' బహుమతిని అందుకుంటున్న శ్రీ అక్కినేని నాగేశ్వరరావు, మా అభిమాన ఆంధ్ర సచిత్ర వారపత్రిక నిర్వహించిన 'సినిమా బాలట్' లో ఆ స్థానం సంపాదించలేకపోయారంటే ఆ అవమానం ఆయనకుకాదు — అందుకు కారకులైన ప్రేక్షకులకు 'నిత్య నూతన నటుడు' అనిపించుకున్న ఆయనకు ఈమారు తీరని అన్యాయం జరిగిందని నిస్సందేహంగా చెప్పవచ్చు. 1965 లో ఆయన కనిపించిన నాలుగు చిత్రాలలో ఆయన నటనసోమారు జాగ్రత్తగా పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమౌతుంది.

'సుమంగళి'లో విశ్వంగా ఆయన నటించలేదు, జీవించారు. 'ప్రేమించిచూడు'లో అల్లరి రంగడుగా తన వయసునే మరపించారు. 'అంతస్తులు'లో కనిపించింది అక్కినేనికాదు, తండ్రికిచ్చినమాట నిలబెట్టుకునేందుకు తల్లి—చెల్లి మధ్య సతమతమైపోయిన రఘు. 'మనుషులు—మమతలు' లో ఆయన నాగేశ్వరరావుకాదు ఇంజనీరవ్వాలనే ఆశయంతో బాహ్యలోకాన్ని మరచి పుస్తక ప్రపంచంలో లీనమైన వేణు ఈవిధంగా నాలుగు చిత్రాలలో ఆయన నలుగురు వ్యక్తులుగా జీవించారు.

అందువలన 1965 బాలట్ ఫలితాల కంటె 1963—64 బాలట్ ఫలితాలే న్యాయంగా ఉన్నాయని చెప్పకతప్పదు.

జి. జయప్రకాష్ (జమ్మలమడుగు)

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం: 22–4–66
పరాభవనామ సం॥ వైశాఖమాసం శుద్ధ॥ విదియ
సంపుటము: 58 సంచిక: 34
స్థాపితము:
1908

*

ముఖ్య సంపాదకుడు:
శివలెంక శంభుప్రసాద్

*

సంపాదకుడు:
శివలెంక రాధాకృష్ణ

*

ఆంధ్రపత్రిక కార్యాలయము
1, తంబుచెట్టి వీథి, మద్రాసు-1

క్రొత్త రేట్ల ననుసరించి 14–1–1966 మొదలు ఆంధ్రసచిత్రవారపత్రిక చందా వివరాలు.

భారతదేశం

	పోస్టుద్వారా రూ. పై.
సంవత్సర చందా	19.25
6 మాసముల చందా	9.62
3 మాసముల చందా	4.80

ఇతరదేశాలకు

ఓడమీద (Sea Mail)

సంవత్సర చందా	24.50
అర్ధసంవత్సర చందా	12.25

వచ్చేవారమే!

చివరకు మిగిలింది;

పెద్దకథ

రచన

యామిని

మనలో మాట

హైదరాబాదు ప్రస్తుత పరిస్థితిని తెలిపే వ్యాసాన్నొకదానిని చాలాకాలం నుంచి వేయాలనుకొంటున్నాము. ఈ వారమే ఆ పని చేయగలిగాము.

తెలుగువారందరికీ హైదరాబాదు రాజధాని అయిన తరువాత అక్కడ వచ్చిన ప్రధానమైన మార్పులను వ్యాసంలో వివరించటం జరిగింది.

* * *

ఈ రోజుల్లో పరిషత్తులు, అక్కడ జరిగే నాటక పోటీలు, కొన్ని సందర్భాలలో వివాదాంశా లవుతున్నాయి.

ఈ సంచిక 50 వ పేజీలో వేసిన వ్యాసం ఒకటి యిందుకు సంబంధించినదే. వ్యాసంలోని అభిప్రాయాలతో సంపాదకుడు ఏకీభవించ నవసరం లేదు

* *

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 'ఫిలిం అవార్డు'ల గురించి రెండువారాల క్రితం హైదరాబాదుకు చెందిన ఒక 'సామాన్యుని' 'స్వ'గతం వేశాము. దీనిమీద కొందరు పాఠకులు వెలిబుచ్చిన అభిప్రాయాలను ఉత్తరాల శీర్షికలో చూడవచ్చును.

* *

వచ్చే వారం ప్రారంభం కాబోయే పెద్ద కథకు సంబంధించిన ప్రకటన యిదే పేజీలో చూడవచ్చును.


'కరుణ' సీరియల్ ముగింపుకు వస్తోంది.

* * *

గత రెండు వారాలనుంచి, ఒక కొత్త సచిత్ర వ్యాస శీర్షిక విషయమై మేము వేస్తున్న ప్రకటన చూస్తూనే వున్నారనుకొంటాము. 'సినిమా పరిశ్రమ' లో విశేషంగా చర్చించబడే కొత్తవారి స్థితిగతులను, వాస్తవ పరిస్థితిని తెలిపే యీ శీర్షిక ''పన్నీటి వీధుల్లో కన్నీటి జల్లులు'', త్వరలోనే ప్రారంభం అవుతుంది. ఇందుకు అవసరమైన కృషి దాదాపు మూడు మాసాల క్రితమే ప్రారంభమయింది.

విషయానుక్రమణిక

ముఖచిత్రం: నవరాత్రి చిత్రంలో 'సావిత్రి'


ఇండియా మీద యుద్ధం చెయ్!
ఆహార మంత్రికి కారు ప్రమాదం!
విమర్శకులు
నేను రాజును!
ఇండొనేషియా సేనలు
సుకర్ణో
మద్రాసులో కాంగ్రెస్ వ్యతిరే
కోద్యమం— రాజాజీ కృషి!
రాజాజీ

న్యూఢిల్లీ లేఖ

నాలుగవ ప్రణాళికకు మార్పులు అవసరం

పారిస్, న్యూయార్కులలో ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధికి అనర్ఘమైన విజయమే లభించిందనిపిస్తున్నది ఆమె గొప్ప నాయకురాలిగా, భారతదేశం ఆమెను ప్రధానిగా ఎన్నుకోడంలో సరైన నిర్ణయమే తీసుకున్నదనీ వాషింగ్‌టన్ వర్గాలు అభిప్రాయపడ్డాయి

ఫ్రాన్సునుంచి లభించే ఆర్థిక సహాయం సి ఐ పి ద్వారా హాల్దియా నూనెశుద్ధి కర్మాగారానికి, ఆంగ్లో—అమెరికన్ కన్సార్షియం ద్వారా అయిదవ ఉక్కు కర్మాగారానికి, అణుశక్తి కేంద్రానికి లభిస్తుందని యింతవరకూ అందిన సమాచారాన్నిబట్టి తెలుస్తున్నది త్వరలో ఫ్రెంచి వ్యాపార బృందంకూడా ఇండియా రానున్నది


సహాయానికి అంగీకారం లభించినా, వాషింగ్‌టన్ సహాయం యింతని యిదమిద్ధంగా తేలలేదు ఆర్థికమంత్రి అమెరికా పర్యటనానంతరంకాని అది ఎంత ఉంటుందో తెలీదు

ఈ సందర్భంలో కొన్ని ముఖ్య విషయాలను గమనించాలి అలా లభించే సహాయం జాప్యం లేకుండా అవసరమైన సంస్థలకు అందజేయాలి భారతదేశం తన ప్రణాళికను అమలుపరిచే విధానాన్ని ప్రతిబింబించే విధంగా నాలుగవ ప్రణాళికను మార్పు చేయాలి.

*

గత వారం పార్లమెంటులో ఆర్థిక మంత్రి కొన్ని విషయాలను చెప్పారు ఆర్థిక మంత్రిత్వశాఖ, దానికి సంబంధించిన యితర మంత్రిత్వశాఖలు 61 56 కోట్ల రూపాయలు పొదుపు చేయగలిగాయట. అందుకు ఆర్థిక మంత్రిత్వశాఖ తీవ్రంగా కృషి చేసిందట. రవాణా మంత్రిత్వశాఖ కూడా 21 కోట్ల రూపాయలు పొదుపు చేసిందట కీర్తిశేషులైన నెహ్రూ కూడా పార్లమెంటులో యిలాంటి విషయాలనే తరచుగా చెప్తూండేవారు కానీ నిజానికి అలా పొదుపు చేయబడ్డ మొత్తాలు ఆఫీసు భవనాల నిర్మాణాలకు, ఉద్యోగస్తుల నివాసాలకు ఖర్చు అయిపోయేది. వర్క్స్ మంత్రిత్వశాఖ తన వార్షిక నివేదికలో యిచ్చిన అంకెలు ఆసక్తికరంగా ఉన్నాయి

ఢిల్లీ, బొంబాయి, నాగపూర్, సిమ్లాలలో మొత్తం కావలసిన 1,48,400 యూనిట్లకు కొరత 1,05,770 యూనిట్లు ఈ కొరత చాలా భాగం కేంద్రం



ఈ నెల 9 వ తేదీన న్యూఢిల్లీలో జరిగిన ముఖ్యమంత్రుల సమావేశంలో బెంగాల్ వ్యవసాయ మంత్రితోను, ముఖ్యమంత్రితోను చర్చిస్తున్న ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి

న్యూఢిల్లీ లేఖ

లోనే ఢిల్లీలో కొరత 60,804 యూనిట్లు.

ఢిల్లీలో దాదాపు 3,313 క్వార్టర్స్ ఈ సంవత్సరాంతానికి పూర్తి కావాల్సిఉంది. ఇందులో 3,220 (253 ఎనిమిది అంతస్తుల క్వార్టర్స్‌తో కూడా) రామకృష్ణపురంలో, మిగిలినవి షాజహాన్‌రోడ్, తిమర్‌పూర్, డిప్లొమాటిక్ ఎన్‌క్లేవ్, నేతాజీనగర్‌లలో నిర్మింపబడతాయి ఇవిగాక 1,648 వివిధ రకాల క్వార్టర్స్ నిర్మాణంలో ఉన్నాయి. విదేశ వ్యవహారాలమంత్రిత్వశాఖ ఆఫీసర్లకు కర్జన్‌రోడ్‌లో 100 వాటాలుగల హాస్టల్ ఒకటి పూర్తయింది. రఫీమార్గ్‌లో 144 వాటాలుగల యింకొక హాస్టల్ నిర్మాణం కూడా పూర్తయింది.

కేంద్రంలో ఆఫీసు భవనాలకు కావలసిన స్థలం కొరత యింతకుముందు 55 18 లక్షల చదరపు అడుగులుండేది. అది ఇప్పుడు 63.97 లక్షల చదరపు అడుగులకు పెరిగింది. ప్రస్తుతం అత్యవసరంగా ఉన్న కొరత 8.49 లక్షల చదరపు అడుగులు తాత్కాలికమైన, లీజ్‌కు తీసుకున్న భవనాలను మినహాయిస్తే శాశ్వతమైన భవనాలకు 33.94 లక్షల చదరపు అడుగులు కావాల్సి ఉంటుంది లీజుకు తీసుకున్న భవనాల మరమ్మత్తు ఖర్చులు ఎక్కువగా ఉంటాయి కనుక, అందులో కొన్ని ప్రమాదకరమైన స్థితిలో ఉన్నాయి కాబట్టి ఏనాటికైనా వీటిని వదిలిపెట్టటం తప్పనిసరే అవుతుంది

ఢిల్లీలో శాశ్వతమైన ఆఫీసు భవనాల కొరతను ఎదుర్కోడానికి రెండు సంవత్సరాలనుంచీ కృషి జరుగుతూనే ఉంది. ఇదివరకు 17 92 లక్షల చదరపు అడుగులు ఉన్న వసతి ప్రస్తుతం, 29 73 లక్షల చదరపు అడుగులకు పెరిగింది. ప్రస్తుతం నిర్మాణంలోఉన్న భవనాలు పూర్తయితే అది 40 07 లక్షల చదరపు అడుగులకు పెరుగుతుంది.

కొత్త ఉద్యోగులను తీసుకోడంపై ఉన్న నిషేధాన్ని తొలగించినట్లు దేశీయ వ్యవహారాలమంత్రి ప్రకటించారు.

అండర్ సెక్రటరీ హోదాకు క్రింది ప్రభుత్వోద్యోగులంతా పదవీ విరమణ చేసే పథకానొకదాన్ని మాజీ ఆర్థికమంత్రి సూచించారు దాన్ని దేశీయ వ్యవహారాల మంత్రిత్వశాఖ నిరాకరించింది

సచివాలయ ఉద్యోగుల సంఖ్య పెరిగిపోవడంవల్ల ఒక్క జీతాలు ఎక్కువ మొత్తంలో యివ్వవలసి రావటమే కాకుండా ఆఫీసు, గృహవసతులు, ఆసుపత్రి సౌకర్యాలు మొదలైనవన్నీ పెంచాల్సివుంటుంది

* * *

అంచనాల సంఘం తన నివేదికలో పెద్ద మొత్తాలలో సరకులను నిల్వ చేయడానికి బొంబాయి పోర్ట్‌ట్రస్ట్ కల్పించిన సౌకర్యాలను తీవ్రంగావిమర్శించింది బొంబాయి హార్బర్‌లో నూనె టాంకర్లను కాలపరిమితిని మించి ఉంచటంవల్ల సంవత్సరానికి దాదాపు 100 మిలియన్ పౌన్ల డెమరేజి చెల్లించాల్సివచ్చిందని ఈ సంఘం తెలియజేసింది నూనెటాంకర్లకు వాటివాటి పరిమాణాన్నిబట్టి రోజుకు 300 పౌన్లనుంచి 500 పౌన్లవరకూ డెమరేజి ఉంటుంది ఈ పద్ధతిన 640టాంకర్లకు 1964 సెప్టెంబరు నుంచీ ఆగస్ట్ 1965 వరకూ అయిన డెమరేజి 192,000పౌన్లనుంచి576,000 పౌన్లవరకూ ఉంటుందని లెక్క వేశారు.

ఈ కథ యిక్కడితో అయిపోలేదు టాంకర్ల పరిమాణాన్నిబట్టి ఫ్రయిట్ రేటు మారుతూ ఉంటుంది. ఉదాహరణకు 15,000 డిడబ్ల్యుటి నుంచి 25,000 వరకూ ఒక రేటు ఉంటుంది 25,000 నుంచి 45,000 వరకూ అంతకంటే తక్కువ ఉంటుంది. 45,000 డి డబ్ల్యుటి కంటే ఎక్కువ పరిమాణంగల వాటికి యింకా తక్కువ ఉంటుంది.

పాశ్చాత్య నూనె కంపెనీలు ఎస్సో, బర్మాషెల్‌లు రెండూ భారత దేశానికి తమ స్వంత నిపుణుల బృందాన్ని తెచ్చుకున్నాయి. ఆ బృందం బుచర్ దీవిలో నూనె నిలవలకుగల అవకాశాలను పరిశీలించే నిమిత్తం భారతదేశానికి తీసుకురాబడింది.

సూచించిన మార్పులను, పథకాన్ని అమలు జరిపితే సంవత్సరానికి దాదాపు 20 లక్షల పౌన్ల విదేశీ మారక ద్రవ్యం పొదుపు చేయబడుతుందని ఆ బృందం తెలిపింది. తద్వారా ముడి నూనె ఖరీదు కూడా యింకా తగ్గుతుంది కొన్ని సంవత్సరాలనుంచీ హార్బరుకు చెల్లించాల్సిన బాకీలకు వాటి వాటి ఆర్థిక వనరులనుంచే చెల్లించి విదేశీ మారక ద్రవ్యాన్ని పొదుపు చేయవలసిందిగా కూడా నూనె కంపెనీలకు సూచన యివ్వబడింది. మొట్టమొదట పోర్ట్‌ట్రస్ట్ ఒక నూనె 'టర్మినల్' ని కట్టడానికి నిశ్చయించింది. తర్వాత నిపుణుల సలహాలకు మేరకు దాని సాంకేతిక బృందం పరిశీలించిన పథకాన్ని కార్యరూపంలో పెట్టడానికి నిశ్చయించింది. దీనికి మొత్తం 75 వేల రూపాయల విదేశీ మారక ద్రవ్యం కావాలి పోర్ట్‌ట్రస్ట్ తన సాంకేతిక సంఘం సూచించిన పథకాన్ని అమలు జరపడానికి యింకా విదేశీమారకం కావాల్సి ఉంటుంది ఈమధ్యకాలంలో టాంకర్లపై విధింపబడే డెమరేజి, చాలినన్ని 'జట్టీ'లు లేనందున ఎక్కువ మొత్తంలో ఫ్రయిట్ భారత దేశం చెల్లిస్తూనే ఉండాలి పోర్ట్‌ట్రస్ట్ పథకాలలో యింకొకటి బుచర్ దీవి నుంచి ట్రాంబేకు పైప్ లైనును తీసుకుని వచ్చే హోవర్‌బ్రిడ్జ్ నిర్మాణం దాన్ని కెపెన్ష్ మాక్‌మిల్లన్ వ్యతిరేకించారు ఈయన 'బొంబాయి హార్బర్ మాస్టర్ ప్లాన్' నిమిత్తం నియమించబడిన నిపుణుడు. ఈ హోవర్‌బ్రిడ్జి నిర్మాణానికి 3 5 కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని అంచనా వేశారు ఇప్పటికే దీనికి ప్రాథమిక ఖర్చుల్ క్రింద 30 వేల రూపాయలు అయింది.

ఈ పథకంపై తుది నిర్ణయాన్ని తీసుకోకముందే పోర్ట్‌ట్రస్ట్ అధికార్లు ప్రారంభంలో జరిగే పనులకు కాంట్రాక్టు యివ్వటం జరిగిందని అంచనాలసంఘం తెలిపింది. సబ్‌మెరైన్ పైప్ లైను మరమ్మతులు త్వరగానూ, సంతృప్తికరంగానూ జరగాలని నూనె కర్మాగారాల నిపుణుల బృందం సూచించింది 3 5 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మింపబడే ఈ హోవర్‌బ్రిడ్జి నిర్మాణం ఆవశ్యకతను సాంకేతిక నిపుణులతో చర్చించి పరిశీలనను జరపాలని కూడా అంచనాల సంఘం సిఫార్సు చేసింది.

—శ్రీకృష్ణ



అసెంబ్లీ హాలు

రాచనగరు హైదరాబాదు

మార్పు చెందని మహానగరం!

బొమ్మలు: మనోహన్ దత్

హైదరాబాదు నగరానికి దాదాపు పర్యాయ పదంగా చెప్పుకొనే 'చార్మినార్' మీద పై అంతస్తు మీద నిలబడి ఒక్కసారి నగరం వైపు చూస్తే 'ఇదే నాబోలు హైదరాబాదు' అనిపిస్తుంది

విశాలమైన 'పత్తర్‌గట్టి' వీధి, యీ వీధికి రెండు వైపులా దుకాణాలు, వీధి నడుమన చిన్న మసీదు .ఒకరకంగా అప్పటి హైదరాబాదు నగరానికి ప్రాతినిధ్యం వహిస్తుంది! . ..

అలాగే మరో రెండడుగులు ముందుకు వేసి, 'నయాపూల్' చేరుకొంటే, అల్లంత దూరాన కనిపించే హైకోర్టు, చేరువ లోనేవున్న ఉస్మానియా ఆస్పత్రి అప్పటి రాజ్యానికి చిహ్నాలుగా కనిపిస్తాయి.


హైదరాబాదులో—ఒకటిరెండు పేటలు మినహాయిస్తే—ప్రతి వీధి ఒకప్పటి రాజ రికాన్ని, ఒకనాటి నగర రూపాన్ని తెలియ చేస్తాయి.

నున్నటి తారురోడ్లమీద జుర్రుమని జారిపోయే రిక్షాలు, హైదరాబాదు నగ రంలో అప్పటికీ, యిప్పటికీ అలానేఉన్నాయి. వల్లని షేర్వాణీలు, పన్నని (తెల్లని) పైజ మాలు ధరించి, "ఆదాబర్జ్" అంటూ వినమ్రులై కనిపించే మహమ్మదీయులు అప్పటికీ, యిప్పటికీ అలానే ఉన్నారు. కాని నాటికీ, నేటికీ తమ స్థానంలోను, పద వుల్లోను వచ్చిన మార్పులకు వారంతా బాధ పడినందున ప్రయోజనం శూన్యం!.... వారికంటె పెద్దవాడు, అసామాన్యుడూ అయిన నవాబ్ అసహాయుడైవున్న యీ స్థితిలో, తతిమ్మావారి ఆక్రందనాలకు అవ కాశం ఉండటం అసంభవం!

పర్వతాలు కొన్ని కదులుతాయంటారు. సముద్రాలు యింకిపోవటం, మైదానాలు జల మయం కావటం చరిత్రకు తెలియనివి కావు. కాని, యిన్ని చిత్రాలు జరిగినా, హైదరాబాదులాంటి నగరంలో పెద్ద మార్పులు రావటంలేదు


'మార్పు' అన్న తరువాత మంచీ కావచ్చు; చెడు కావచ్చు. కాలంతోపాటు కొన్ని ప్రాచీన నగరాల అంద చందాలు మాయమైతే, కొన్ని ప్రాంతాలు కొత్త దనాన్ని సంతరించుకోవటం సహజమే అవు తుంది. ఈ రెండు నియమాలు హైదరా బాదు నగరానికి వర్తించవు.

బషీర్‌బాగ్ చౌరస్తా, అక్కడి అరటిపళ్లు అమ్మేవాళ్లు ఎప్పటిలాగే ఉన్నారు అలాగే రాయల్ టాకీస్, అక్కడి కందస్వామి మార్కెట్, మార్కెట్ ఎదుట 'మిర్చీ'లమ్మే వాళ్లు అలానే ఉన్నారు 'కోటీ'లో రద్దీ పెరిగిందేగాని, పారిశుద్ధ్యం పెరగలేదు.



చార్మినార్

[illegible]



హైకోర్టు

ఇరానీహోటళ్లు...సాల్ట్ బిస్కట్లూ...గరమ్‌చాయ్!

'టాంక్‌బండ్' ఎప్పటిలాగానే అందంగానే ఉంది అలాగే, రాజభవన్‌రోడ్డు మునుపటిలాగా ప్రశాంతంగా సెలయేరులావుంది 'ఆబిడ్స్'లో ఆదివారాల్లో 'సెకండ్‌హాండ్' పుస్తకాలు అమ్మేవారు, ఆ వృత్తిని 'వదలం' అంటున్నారు టాక్సీ డ్రైవర్లు పేచీలు 'మానం' అంటున్నారు

'ఆబిడ్స్' లో' డబల్ డెకర్' బస్సులకు గేదెలు, ఆవులు మామూలుగానే అడ్డొస్తున్నాయి సినిమా హాళ్ల దగ్గర 'బ్లాక్'లో టిక్కెట్టు అమ్మేవాళ్లు, వాళ్ల పిల్లలకు కూడా యిదే నేర్పుతున్నారు తెలుగువాళ్లు, తెలుగు రానివాళ్లు కూడా ఇరానీ హొటళ్లలో సాల్ట్ బిస్కెట్లు తిని, గరమ్ చాయ్ త్రాగుతూనే ఉన్నారు

ఇక మారిందల్లా ఒకటే జి టి. ఎక్స్‌ప్రెస్‌లోనుంచీ, పూరీ పాసెంజర్‌లో నుంచీ ఆంధ్రులంతా అసంఖ్యాకంగా దిగుతున్నారు సికింద్రాబాద్ స్టేషనులో రిక్షావాళ్లు . యీ కొత్తవాళ్లకు సికింద్రాబాదు స్టేషన్‌నుంచి చిక్కడపల్లికి, నల్లకుంటకు రిక్షాలుకట్టి, రెండు రూపాయిల బదులు మూడు రూపాయిలు పుచ్చుకుంటున్నారు. చిక్కడపల్లి రోజు రోజుకు మరో బెజవాడ, గుంటూరు అవుతున్నది. హైదరాబాద్ పెరగటం అంటే చిక్కడపల్లి పెరగటం, అక్కడి ఖాళీ స్థలాలు గజం పది రూపాయల నుంచి నూట పదిరూపాయిలకు థర్మామీటర్ టెంపరేచర్‌లాగా—పెరగటం వాటంతట అవే జరిగిపోయాయి చిక్కడపల్లిలో దుకాణాలు (మళిగలు) చాలా ఎక్కువగా వెలుస్తున్నాయి.

అలాగే, వివేక్‌నగర్‌లో కూడా కొత్త కొత్త కాలనీలు తయారవుతున్నాయి కాని దురదృష్టం. సంవత్సరంలో 365 రోజులలో యీ ప్రాంతంలో రోడ్ రిపేర్లూ, డ్రెయినేజి త్రవ్వకాలు తప్పవు. కండక్టర్లు ఎంత పొగరుబోతులనుకొన్నా, చిక్కడపల్లిలో బస్సులు అవుతున్నారీమధ్య!


తెలుగువారి ప్రాంతాలంటూ కొన్ని ప్రత్యేకంగా తయారవుతున్నాయి. చిక్కడపల్లి, నల్లకుంట, నారాయణగూడలో కొంత భాగం... అసలైన సిసలైన తెలుగువారి వాడలు.

ఇటీవలి మార్పుల్లో, యిక్కడి తెలుగువారి ప్రాబల్యం పెరగటం ముఖ్యమైనది నిత్య జీవితంలో ప్రతి క్షణంలోనూ యీ 'వాస్తవం' కళ్లకు గోచరిస్తుంది. తెలుగువారికి సారస్వత సంఘాలు కొత్తవి ఏర్పడుతున్నాయి తెలుగు ఔత్సాహికులు నాటక సమాజాలను నెలకొల్పుకొంటున్నారు. మొన్న మొన్నటివరకు 'తెలుగు' జోలికే పోని కొన్ని కాన్వెంట్ స్కూళ్లల్లో, దీన్ని ఒక 'సబ్జెక్ట్'గా ప్రారంభించారు. కొన్ని పాఠశాలల్లో తెలుగే మాధ్యమిక భాష . '.అంటే 'కంపల్సరీ' అన్నమాట! బస్సుల్లో కూడా తెలుగు బాగా వినవస్తున్నది. .ఒకప్పుడు రిక్షావాళ్లతో "చల్ తే మియా" అంటూ కేవలం ఉర్దూలోనే మాట్లాడే అలవాటు యిటీవల తగ్గి, "ఏం రిక్షా, వస్తావా" అని అడుగుతున్నారు తెలుగురానివాళ్లకూడా 'తెలుగు'ను అర్థం చేసికొనక తప్పటంలేదు శాసనసభలో కూడా తెలుగు భాషకు ప్రత్యేకమైన హోదా నిచ్చారు. ('ఇత్తెహాదుల్ ముస్లిమీన్', యిటీవల మళ్లీ తోక జాడిస్తున్నా, తెలుగుకేమాత్రం ఇబ్బందిఉండదు)

అయితే నవాబుగారి స్థానం ఏమిటి? అని యిక్కడివారి ప్రశ్న.

ప్రశ్నకు అవకాశం ఏర్పడటంతోనే 'నవాబు' గారి కేదో జరగలేనిది జరిగిందనే సూచన లేకపోలేదు.

'నవాబు' ధోరణి మొదటినుంచీ చిత్రంగానే వుంది ఒకప్పుడు... సంస్థానాలను



గోల్కొండకోట

మార్పుచెందని మహానగరం

విలీనం చేసికొంటూ, ఆ యా అధిపతులకు ప్రభుత్వం ముఖ్యమైన పదవుల నివ్వటానికి నిశ్చయించింది అదే సందర్భంలో మైసూరు పాలకులు శ్రీ జయచామరాజవడయార్ 'గవర్నర్' పదవి స్వీకరించి 'తన స్థానాన్ని మరికొంతకాలమయినా నిలబెట్టుకోగలిగారు నవాబు ఆపదవులకేమీ అంగీకరించనందున, యీ దేశ పాలకులతోను, పాలితులతోను పూర్తిగా పరిచయాన్ని పోగొట్టుకొని, తన 'చిన్ని' ప్రపంచంలో మునిగిపోయారు తత్కారణంగా పాపం, ఆయన యీ వయసులో కొందరి ఆగ్రహాలకు గురి అయ్యారు


ఈనాడాయన, యీ వృద్ధాప్యంలో గడుపుతున్న జీవితం చూస్తుంటే, ఆయన స్థితికి కొందరు అభిమానులు, అనుయాయులు బాధపడకతప్పదు కాని, ఒకప్పుడు 'నవాబు' గడిపిన జీవితాన్ని గుర్తు(వుంటే) తెచ్చుకొన్న వారంతా నవాబు ప్రస్తుత పరిస్థితికి కించిత్తయినా జాలిపడరు

ఒకప్పుడు కళాకాంతులు వెలిసిన కింగ్ కోటీ, కింగ్‌కోటీరోడ్డు యీనాడు నవాబునే చూసి పరిహసిస్తున్నాయా అనిపిస్తున్నది ఆ వీధిలో (తాజమహల్ హోటల్ నుంచి వెళుతుంటే) మొదట్లో ఎడమ వైపునవున్న భవనం గోడలు మట్టిరాలి పోతున్నాయి సున్నం వేయించి, ఎంతకాలం అయిందో లెక్కలేదు. 'కోఠీ' పహరా కాచే వారంతా, కేవలం నామమాత్రులే అయారు. కోఠి వీధిలోఒక వసారాలో 'విజిటర్స్ బుక్' అనేచోట నిర్మానుష్యంగావుంది— విజిటర్స్‌లేక కాబోలు! చరిత్ర మారుతున్నదన్న సత్యానికి యివి సాక్ష్యాలు, రుజువులూ!

ఇక నగరంలో రోడ పరిస్థితి! పాత రోడ్లు—అంటే నిజాం నవాబు కాలం నుంచీ ఉన్నవి అలానేవున్నా, కొత్తరోడ్లు ఎవరికి గౌరవప్రదంగాలేవు. కొత్తగా వేసిన రోడ్లన్నీ గతుకులుపడిపోతున్నాయి రోడ్ల ప్రక్కన బిచ్చగాళ్లను, సరుకులమ్మేవాళ్లను 'పునరుద్ధరించటం' చాలాఅవసరం ఒకటే సంతోషం మదరాసు, బొంబాయిల్లోలాగా 'పేవ్‌మెంట్'లమీద పెద్దగా కాపరాలు చేయరు హైదరాబాదులో.

ఇక బస్సులు. ఈ బస్సులను చూచి గుండెలు బాదుకొనటంకంటే, జాలిపడటం ధర్మం వీటినిచూచి, గుండెలు ఎంతకాలం బాదుకొంటాం? రోజుచచ్చిపోయేవాళ్లకుఏడ్చే వాళ్లుండరట ఆమధ్య—కొన్ని సంవత్సరాల క్రితం హైదరాబాదు ఆర్. టి సి అధికారి ఒకరు మదరాసువచ్చి, కొత్త విషయాలు కొన్ని తెలిసికొని వెళ్లారట తీరా చూస్తే, ఆయన యీ కొత్త విషయాలను నేర్చుకొనకుండా వుంటేనే బాగుండేది అనిపిస్తోంది పరిస్థితి ఖాళీలున్నా బస్సులు ఆపరు కండక్టర్లు

ఎంతమందిని తీసికెళ్లాలో ఒక నియమం లేదు అంతా కండక్టర్ యిష్టారాజ్యం ప్రయాణీకులు ఒకవైపున ఎక్కుతూంటే, బస్సులు కదిలిపోతుంటాయి ఆ ప్రయాణీకులే చిన్నపిల్లలయిన సందర్భంలో పాపం, స్కూలుకు వెళ్లే ఆ పిల్లల 'లంచ్' క్రింద పడిపోవటం, ఒక్కోసారి వారే క్రింద పడిపోవటం మామూలయిపోయింది బస్సులు వేళలకు రావు ఆ వచ్చిన వేళల్లోనయినా అవి ఆగవు 'పబ్లిక్ గార్డెన్'కు వెళ్లేవారికి ఫరవాలేదు, ఆఫీసులకెళ్లేవారు ఏంచేయాలి?


కమ్మని పరిమళముగల
శ్రేష్ఠమైన టాల్క్
పాండ్స్ డ్రీంఫ్లవర్ టాల్కం పౌడర్ వాడి
రోజంతా నిలిచే చల్లదనం, తాజా హాయి
పొందండి
Pond's
Dreamflower talc
Dreamflower talc
స్నానం చేసిన తరువాత పాండ్స్ డ్రీమ్‌ఫ్లవర టాల్కం
పౌడరు ఒంటినిండా జల్లుకొని చాలాసేపు నిలిచే
తాజాతనాన్నీ, సువాసననూ పొందండి ..అతి నాజూకైన
సువాసనతో కూడిన యీ టాల్కం పౌడరు క్షణంలో
చెమటను పీల్చి, ఏ వాతావరణంలోనైనా, రోజంతా ఆహ్లాద
కరమైన చల్లదనాన్నీ, తాజాతనాన్నీ చేకూరుస్తుంది!
ఇంటిల్లిపాదికీ యీ పౌడరు ఎంతో ఆదర్శమైనది.
చీస్‌బ్రో-పాండ్స్ ఇన్ కార్పొరేటెడ్
(పరిమితమైన బాధ్యతతో యు ఎస్ ఎ లో స్థాపితము)
JWT-P-4596



"ఇవ్వాళ మా యింట్లో కాఫీ త్రాగి వెళ్లాలి మీరు..."

రేణుక వసుంధరాదేవి వైపు తిరిగి అన్నది. ఒక్కక్షణం ఆమె పెదాలపై చిరునవ్వు చిందింది. కళ్లు కాంతి వంత మయినాయి. ఆమె ముఖం మరింత నిండుగా ఆకర్షణీయంగా కన్పించింది వసుంధరాదేవికి.

"అలాగే..కాఫీ త్రాగడానికి అభ్యంతరం లేదు. కాని, తొందరగా వెళ్లాలింటికి.... చెయ్యాల్సిన పని చాలావుంది.

రేణుక తాళం తీసి ఇంట్లోకి అడుగు పెట్టింది. వసుంధరాదేవి ఆమెను అనుస రించింది.

సోఫా చూపిస్తూ

"కూర్చోండి ఇప్పుడే వచ్చేస్తా....", అన్నది రేణుక లోపలి గదిలోకి వెడుతూ.

"థాంక్స్ ." అన్నది వసుంధరాదేవి.

అది సాయంత్రపు వేళ. సమయం సుమారుగా ఆరు గంటలు. ఎండలేదు కాని వెలుగు మాత్రం తగ్గలేదు.

హాల్లో సోఫాలో కూర్చుని గది నలు మూలలా నిశితంగా చూడ సాగింది వసుం ధరాదేవి. గది మధ్యలో 'సోఫాసెట్టు' ..ఒక మూల బల్ల .. దాని మీద రేడియో ... దానికొక ప్రక్క ఫోటో ఫ్రేము... దాన్లో నవ వధూవరుల ఫోటో వధువు రేణుక. అక్కడి నుండి వసుంధరాదేవి దృష్టి ఎదురు గోడ మీదకు పోయి ఒకచోట నిలిచిపోయింది. అక్కడొక క్యాలెండరు వ్రేళ్లాడుతున్నది.. దాని మీద బొమ్మ యువదంపతులు... భర్త ప్రక్క భార్య. తల్లి చేతుల్లో పసి వాడు...తండ్రి వైపు కొంటెగా చూస్తూ, కేరింతలు కొడుతూ బోసినవ్వులు చింది స్తున్న పసివాడు. ఆ బొమ్మ వాస్తవానికి చాలాదూరంలో ఉన్నట్లు అన్పించింది, వసుంధరాదేవికి! ఆవిడకు ఆగది అంతగా నచ్చలేదు! తలుపు దగ్గరగా వేసి లోపలి గదిలోకి వచ్చి నిలబడింది రేణుక కాఫీ తయ్యారు చెయ్యడంలో నిమగ్నురాల య్యింది.

వసుంధరాదేవి రేణుక వైపు చూస్తూనే ఉంది. రేణుక ముఖంలో లక్ష్మికళ ఉంది నవ్వినప్పుడు మరింత అందంగా, హుం దాగా, అమాయకంగా కన్పిస్తుంది. పతి

పూర్ణమైన యవ్వనం అవయవాల్లో తొంగి చూస్తున్నది. సన్నని పొడవైన విగ్రహం. పసిడి ఛాయ...మీనాల్లాంటి కళ్ళు..పొడవైన సన్నని నాసిక ..విండ్లను బోలిన కనుబొమలు...అర్ధచంద్రాకృతిలో నున్న నుదుటిపై గాలికి అల్లల్లాడే ముంగురులు.. వాటి వెనుక కొంచెంగా కన్పిస్తున్న కుంకుమ ఆమె కదలికల్లో, కళ్ళల్లో చిందులు త్రొక్కే పసితనం చూస్తే ఆమెకు ఇరవై నాలుగేళ్ల వయస్సుండదేమో నన్పిస్తుంది! ఎల్లవేళలా ముఖంలో తొంగి చూసే చిరునవ్వు, కదలికల్లో, మాటల్లో ఉత్సాహం చూస్తే దుఃఖానికి అతీతురాలుగా కన్పిస్తుంది .చిరునవ్వునీ, ఉత్సాహాన్ని, సంతోషాన్ని మింగి వేసే క్లిష్ట సమస్యలు, బరువు బాధ్యతలు ఆమెకు బహుశా వుండి ఉండక పోవచ్చు! పరిస్థితులు, జీవితం ఆమెకు అనుకూలంగా వుండి ఉండచ్చు! 'రేణుక భర్త అనుకూలుడయి వుంటాడు' అనుకున్నది వసుంధరాదేవి.

రేణుక లేచి అలమారు లోంచి రెండు కప్పులూ, రెండు సాసర్లూ తీసి బల్ల మీద పెట్టింది. వసుంధరాదేవి పరీక్షగా ఆ కప్పుల వైపు, ఆ సాసర్ల వైపు తరచితరచి చూడ సాగింది. పువ్వుల గుత్తుల డిజైను... ఆకుపచ్చని రేకులు తెల్లని హృదయాలు.. నల్లని అంచులు ఆకుపచ్చని రంగు తెలుపు. నలుపు..ఆకుపచ్చ ...

డైనింగు బల్ల చుట్టూ సంతోషం పొంగిపొర్లే గొంతుకలు...ఆకుపచ్చని రంగు... తెలుపు రంగు...నలుపురంగు... డైనింగు టేబిల్ కుర్చీలు...గాజు సామాను వున్న అలమారు కాఫీ తయారు చేస్తున్న మాతృమూర్తి. ఇంకా ఇంకా ఒకదాని తర్వాత ఒకటి మెదిలి ఒకదాన్లో ఒకటి ఐక్యమై.. ఒక్క దృశ్యమైంది...మూడు రంగులు... ఆకుపచ్చ ..తెలుపు నలుపు...

కొంతమందికి నిముషాలూ, క్షణాలూ కాలానికి కొలబద్దలు.... ఇంకొందరికి మాసాలూ, సంవత్సరాలూ. మరికొందరికి గత జీవితంలో హృదయానికి హత్తుకున్న సంఘటనల స్మృతులు....

మనస్సు గతమనే గమ్యస్థానానికి పరుగులు తీస్తున్నది. హృదయం వర్తమాన, భూతకాలాల మధ్య వూగిసలాడి వూగిసలాడి, వాస్తవానికి కొంచెం దూరంలో ఉన్నదానిపై మ్రొగ్గుతున్నది. ఈ క్షణాన వాస్తవానికి, జరిగిన దానికీ మధ్య అంతులేని దూరమున్నదేమో నన్పిస్తున్నది. కాని ఆక్షణాన అది వాస్తవానికి ఎంత దగ్గరగా గోచరించింది?..ఆ కప్పులూ, సాసర్లూ అతివేగంతో 'జెట్' విమానం కన్న వేగంతో మనస్సును గతానికి తీసుకుపోతున్నవి.

ముఖాలూ..!రంగులూ... కోణాలూ .. గోడల చివరలు ..సందడిగా వుండే డైనింగ్ రూము...మెరిసే 'మెరూన్'రంగు సిమెంటు గచ్చు ...... దాని మీద ..... గది, మధ్యలో అన్నివేళల్లోను దర్శనమిచ్చే, ఎన్నటికీ చెరగని, మాయని తెల్లని మచ్చ....

ఇప్పుడు ఆగదిలో ఎవరు వుంటున్నారో? ఆగది గోడ మీద ఆకాలంలో బోసినవ్వులు చిందులు త్రొక్కే పసివాడి స్థానాన్ని ప్రస్తుతం అర్ధ నగ్నంగా వున్న సినిమా తార బొమ్మ ఆక్రమించి ఉండచ్చు! తన స్థానాన్ని మరెవరో భర్తీ చేసే ఉంటారు. ఆస్థానం ఖాళీగా ఉండదు! అయితే ఆస్థానాన్ని ఆక్రమించిన వ్యక్తి ఎటువంటిదో... రాత్రనక పగలనక గ్రామఫోను వేస్తూ ఇరుగుపొరుగుకి సమస్యను తెచ్చిపెడుతూ ఉండచ్చు...లేదా.. వాళ్లతో కయ్యానికి కాలు దువ్వుతూ ఉండొచ్చు ... ఇరుగుపొరుగుకి మధ్య ఉండాల్సిన మిత్రత్వానికి అంతరాయం కల్గిస్తూ ఉండచ్చు......

వచ్చే స్నేహితులు?...కొంతమంది తెల్లవారిందని సూచిస్తూ తొలికోడి కూయకుండానే, ఇంకా చీకట్లు కరగకుండానే దర్శనమిచ్చేవారు. తను తప్పని సరిగా లేచి తలుపు తీసి స్వాగత వచనాలు పలికేది. ఇంట్లో అడుగు పెట్టకుండానే వాళ్ల నోటంట ఆత్రతతో వచ్చే మాటలు ..'శేఖరం ఉన్నాడా?'... అతను ఇంట్లో లేకపోతే వాళ్ల ముఖాల్లో తొంగి చూసేది నిరుత్సాహం.. తలకాయలు వాల్చేసి, ఏదో కోల్పోయినట్లు భారంగా అడుగులు వేసుమేంటూ వెళ్లేవారు. ఒక్కొక సారి వాళ్ళు వచ్చేసరికి అతను నిద్రలోనే ఉండేవాడు...సగం నిద్రకళ్లతోనే ప్రక్కకు తిరిగి స్వాగతం చెప్పేవాడు...ఆ దృశ్యంతో తెల్లవారేది...స్నేహితుడి తర్వాత స్నేహితుడు. వేళ ప్రకారం సూర్యుడు అస్తమించేవాడు. కాని అతనికి రోజుకొక వేళకి దినం పూర్తయ్యేది...అతనెప్పుడూ స్నేహితుల వల్ల అలసి పోలేదు. పైగా వాళ్లను చూస్తూనే ఉత్సాహాన్ని, ఓపికను మరింత పుంజుకునేవాడు. ఇల్లొక 'వెయిటింగ్' రూము.. స్నేహితులు కలసే స్థలం. స్నేహితుల మీద చూపించిన శ్రద్ధ ఇంటి విషయాల మీద చూపిస్తే ఎంత బాగుండేది! .ఉదాహరణకి అతని నోటంట వచ్చేమాటలు కించత్తయినా చలించని స్వరంతో వెలువడే మాటలు. .'వసూ నీ మందు తేవడం మర్చిపోయాను. అసలు తెద్దామనే అనుకున్నాను. సుమీ.. ఎంతమంది స్నేహితు లనుకున్నావ్. ఎన్నిమాట లనుకున్నావ్. ఆ ధ్యాసలో పడి మర్చిపోయాను. తెల్లవారనీ పట్టుకొస్తానుగా...', 'బాబుకి హార్లిక్సు అయిపోయిందని చెప్పావు కదూ..మర్చేపోయాను సుమీ ... ఈపూటకి ఆవుపాలల్లో నీళ్లు కలిపి పట్టేయ్యి..పొద్దున్న చూసుకుందాం ' అవి పొరపాటు జరిగినందుకు అభ్యర్థనలా? లేక పొరపాటు జరిగినందుకు చెప్పుకునే సంజాయిషీలా?...ఇవి తరచుగా జరిగే సంఘటనలు. ఒకటి రెండుసార్లయితే పొరపాటనుకుని సమాధానపడచ్చు.. ఎప్పుడూ జరిగే సంఘటనలు పొరపాట్లు ఎలా అవుతాయి? .

తన బాబు..పద్దెనిమిదేళ్ల క్రితం ఏణ్ణర్థం పసివాడు. అందరికీ ఒక రబ్బరు బొమ్మ. అందరికీ ఒక వేడుక. అందరికీ అన్నివేళలా కాలక్షేపాన్ని ఇచ్చే మనిషి . క్షణాలూ, నిముషాలూ, గంటలూ మర్చిపోయేంతగా ఆనందాన్ని సంతోషాన్ని ఇవ్వగలిగే మనిషి..వాడి చేతుల్లోనూ, చూపుల్లోనూ తొంగి చూసేది కొంటెతనం .. నున్నని గచ్చుమీద చేతికందని వేగంతో తప్పటడుగులు .... వాడి వేగం చూస్తుంటే పడతాడేమోనని భయంవేసేది *తనకు..... వాడా పడేది ? తనను ఇంట్లో ప్రదక్షిణలు చేయించి, తనకు ఆయాసం వచ్చి చతికిల బడ్డాక వీరుడిలా తప్పటడుగులు వేసు

కొంటూ వచ్చి తన [illegible] దాచుకునేవాడు. తలతో తన పొట్టను కుమ్మేవాడు. అప్పుడు తనకు నొప్పి పుట్టేది కాదు. అదొక దివ్యానుభూతిగా అన్పించేది.... చిన్ని చేతులు లొంపెమ్మల్ని తడిమేవి. వస్తువులపై హఠాత్తుగా పడే చిన్ని చేతులు.... గాజు సామానంటే మరింత ఆత్రుతతో పడే కోమలమైన చేతులు... ఆకుపచ్చని పువ్వులు వాడి దృష్టిని ఆకర్షించేవి. చూడ్డమే తరువాయి. చేతులు వాటిమీద పడ్డం ఒకదాని తర్వాత ఒకటి అఖరు చెయ్యడం.... అన్నీ ముక్కలైతేనే గాని వాడి ఆట పూర్తయ్యేది కాదు.... ఒక్క క్షణం కప్పులూ, సాసర్లూ విరిగిపోయినందుకు విచారం కలిగేది. వాటిని చూసి సాధించిన విజయాన్ని తెలియపర్చడాని కన్నట్లు చప్పట్లు చరిచేవాడు. బోసి నవ్వులు నవ్వేవాడు... వాడి నవ్వు చూశాక, విరిగిన వాటి ధ్యాస మాయమయ్యేది. అసలు తక్కిన వాళ్లను తన వైపు త్రిప్పుకొనగల చాతుర్యం వాడికుందేమో ?... ఆ అమాయకపు నవ్వు... ఆ పసివాడి నవ్వు వెనుక నల్లని గంభీరమైన మబ్బులు. ఏ క్షణాన్నయినా వర్షించ సామర్థ్యంగల మబ్బులు.. కన్పించీ కన్పించని ఉదాసీనత.... ఇంటి విషయాలపట్ల అసంతృప్తి.... ఒక విధంగా మన్నిత విషయాల్లో అసంతృప్తి ఇవన్నీ కలిపి రూపొందించేది. ఇద్దరి వ్యక్తుల హృదయాల మధ్య ఎన్నటికీ తరగని దూరం...' నల్లని మబ్బులు.... ఎర్రని కవళికలు.... పడగాడ్పుల్లాంటి ఉద్వేగాలు .... చివరకు మిగిలినది ?

అడ్డుగోడ

"కాఫీలో పంచదార సరిపోయిందా ?...."

ఉలిక్కిపడింది వసుంధరాదేవి. ఆమె మనస్సు గతంలోంచి వర్తమానంలోకి రావడానికి కొద్ది క్షణాలు పట్టింది. కప్పు అందుకుని కాఫీ ఒక గుటకవేసి కప్పు తిరిగి బల్లమీద పెట్టింది. వలువూలలా వింతగా చూడసాగింది. రెండు గదులు.. రెండు వాతావరణాలు... ఒకదాన్లో ఒకటి ఏది వర్తమానమో, ఏది భౌతికమో తెలియనంతగా కలసిపోయాయి.

ఇంతకూ జరిగిన దేమిటి ?... తామిద్దరూ దెబ్బలాడుకున్నారా ? ఘర్షణ పడ్డారా ? ... లేదు .... మరి ఇద్దరికీ మధ్య ఈ అనంతమైన దూరానికి హేతువు? . పరిస్థితులు ప్రవర్తనలు . ఎన్నటికీ పూర్తికాని ప్రమాణాలు... ఒక్కసారిగా గట్టు తెగిన ఏటి ప్రవాహపు వేగంతో కనుగొనబడ్డ హృదయాంతర్గత భావాలు... అవి అతను స్పృశించలేనివి..'. అతను కనుగొనలేనివి.... ఎప్పటికప్పుడు మార్గంలో ఎర్రటి దీపాలు దర్శనమిస్తూనే ఉండేవి... కొన్ని సంఘటనలు.... కొన్ని సందర్భాలు తామిద్దరి హృదయాలను వేరుచేసి క్షణక్షణానికి మధ్య దూరాన్ని హెచ్చు చేసినాయి.... అవే తమ మధ్య నిలచిన అడ్డుగోడకు పునాదిరాళ్ళు..... ఆ గోడ ఎత్తు రామరాను పెరిగింది.... ఒకరి నొకరు చూసుకోనేలేనంత ఎత్తుగా పెరిగిపోయింది!

ఒక్క క్షణం వసుంధరాదేవి ఆలోచనల్లో పడింది..... అసలు గోడెక్కడ ? తమ మధ్యా ?.... తమ హృదయాల్లోనా ?.... తమ మధ్య అయిన వక్షంలో ఆ అడ్డుగోడను కూల్చడానికి మార్గాలు ఉండే వేమో ? .... అది హృదయాల్లో గోడ ! శాశ్వతంగా చెక్కు చెదరక నిలచిపోయేంత దృఢంగా ఉన్న గోడ అది !! అది కట్టబడ్డది నల్ల కంకరతోనూ, సిమెంటుతోనూ ఏమో ? .... అయితే నేం? .... అతనికి లెక్కలేనంతమంది స్నేహితులు .... అతని శ్రేయస్సును కోరేవాళ్ళు .... వాత్సల్యంతో చూసుకునేవాళ్ళు .... ప్రేమించేవాళ్ళు .... అతని స్నేహం కోసం ప్రాకులాడే మనుష్యులు వాళ్ళు .... వాళ్లను అతి దగ్గరగా తెచ్చుకోగల నేర్పు అతనికి ఉంది. నెలల తరబడి వాళ్లను మర్చిపోనూ గలడు. అతని లోకం స్నేహితులనబడే మనుష్యులు.... తప్పు చేసినవాడికి అతనొక మహానుభావుడు ! ఇచ్చిన డబ్బు వసూలు చేసుకోడానికి అప్పుల వాళ్ళు నెలల తరబడి ఓపికతో ఎదురు చూసేవారు !

'అతనెంత దయాళువు '... 'అతని స్వభావమెంత మంచిది' ....'ఈ ఇరవయ్యో శతాబ్దంలో అల్లాంటి వాళ్లను ఎక్కడో కాని చూడం...." ఇవి స్నేహితులు అతని గురించి అనే మాటలు.

ఒక్క క్షణం వసుంధరాదేవి మనస్సు ప్రసవ వేదనతో మూలుగుతున్నప్పుడు .... నొప్పులతో మెలికలు తిరుగుతున్నప్పుడు....



జీవన్మరణాల మధ్య ఊగిసలాడుతున్న ప్పుడు, అతనిలో కలిగిన పంచలనం ... తనకేమీ పట్టనట్లు మంచం దిగనేలేదు.... అతను నవ్వుముఖంతో తన ఎదుట నిలబడితే తన బాధ మాయమయ్యేదేమో ? .... ఆ హృదయంలో కృష్ణ, పంతానమో చోటు చేసుకునేవేమో ?.... అతనికి మంత్ర సాని ఇల్లు తెలియకపోవచ్చు ..... కాని రామం తనకు తెలుసు నప్పుడు ప్రక్కకు తిరిగి కళ్ళు తెరవకుండానే, నిద్రమత్తు తానే 'ఆ సంగతేదో నువ్వే చూడా'ని పాడిక పురమాయించి గోడవైపు తిరిగిపోయాడు... దాంతో తన బాధ్యత తీరినట్లు నిశ్చింతగా నిద్రపోయాడు .... పసివాడి 'కేరు మన్న ఏడ్పు అతనిని నిద్రలోంచి యధార్థం



...కి, వాస్తవంలోకి తెచ్చింది.

'జీవితమే అంత' అన్నది జనవాక్యం.... మనిషి పుట్టినప్పుడు గ్రీష్మం .... వివాహమప్పుడు వసంతం.... ఆ తర్వాత ??

మండు వేసవి వడగాడ్పులు కావి, శరీరాన్ని వణికించే 'జివ్వు' మంటూ వీచే శిశిరాలపు గాలి కావి తన మనస్సును ఏమాత్రమూ మార్చలేకపోయాయి. ఐతే ఈ చిన్న సంఘటనతో తన హృదయఫలకం బీటలు తీసింది.

అడ్డుగోడ

హృదయంలో నిలబడిన అడ్డుగోడ పునాది సత్యమైనది.... దృఢమైనది..., ఎన్నటికీ చెక్కు చెదరనిది.

మనస్సుకు శాంతి దూరమయ్యింది.... విశ్రాంతి దూరమయ్యింది. ఒక సంఘటనలోంచి ఇంకొక సంఘటనలోకి .... ఒక దృశ్యంలోంచి ఇంకో దృశ్యంలోకి .... ఒక అధ్యాయంలోంచి ఇంకో అధ్యాయంలోకి పరుగెడుతున్నది మనస్సు..... అయితే దేనిమీదా స్థిరంగా నిలవడంలేదు.

ఆ కప్పులూ, సాసర్లూ ఒకదాని తర్వాత ఒకటి ముక్కలయ్యాయి. హృదయం శిలగా మారింది.... అనుబంధం తెగిపోయింది... ఆకుపచ్చని పువ్వులు .... నల్లని అంచులు.... తనకు దక్కినదల్లా ఒక్క కొడుకు. బోసినవ్వులు చిందించే కొడుకు.... తెల్లగా బొద్దుగా ఉండే కొడుకు. మెడ కొక గుదిబండలా తనకొక తెంచుకోలేని బాధ్యత.

జీవితమే తనకొక పాఠం.... అడుగడుగునా సమస్యలు... తను ముఖపడింది లేదు. అతన్ని ముఖపెట్టనూ లేకపోయిందేమో ?

బాబు చదువు కొద్ది నెలల్లో ముగుస్తుంది. వాడి కొక ఉద్యోగం దొరికితే తను ఉద్యోగం చెయ్యవల్సిన అవసరం ఉండదేమో ?!.... కోడలొచ్చాక తనింక విశ్రాంతి తీసుకోవచ్చునేమో ?.....

ఏమో ఏం చెప్పగలం ?.... తన జీవితంలో ఇంతవరకూ కోరుకున్నట్లు సాగింది కనుకనా? ..తనకు భవిష్యత్తొక ఎండమావి. కాని తాను హృదయమున్న మనిషి ! ఆశించడమే తన వంతు.


"ఏమిటలా కప్పు వైపు అల్లా చూస్తారు ?... కాఫీ చల్లారిపోతోంది "

మరొక్కసారి వసుంధరాదేవి 'ఉలిక్కి' పడింది. రేణుక మాటలు ఆమె మనస్సును ఎండమావుల్లాంటి స్మృతుల నుండి యథార్థంలోకి తీసుకువచ్చాయి.

ఒక్కసారి భారమైన నిట్టూర్పు విడిచింది వసుంధరాదేవి చెమటల్తో నిండిన చెక్కిళ్లను రుమాలుతో అద్దుకుంది కళ్ళు తుడుచుకుంది రేణుకవైపు దృష్టిని సారించింది ఒక్క క్షణం .. ఆమె పెదాలపై పేలవమైన చిరునవ్వు మెదిలింది. శక్తినంతనూ కూడదీసుకుని, శూన్యంలోకి దృష్టిని మరలుస్తూ నిర్జీవమైన స్వరంతో తనలో తాను గొణుక్కుంది "ఒకప్పుడు ... ఒకప్పుడు.... నా దగ్గర ఇల్లాంటి 'కాఫీ సెట్' ఉండేది. దానిమీద .... పువ్వులు... ఆకుపచ్చని రేకులు .... నల్లని..... " ●

వైజ్ఞానిక గాథాశతి-57

-డాక్టర్ం.



వెతికేది ఒకటైతే దొరికింది మరొకటి

నక్షత్రాలు ఎంతదూరాన్న ఉన్నాయీ అన్నది చిరకాలపు ప్రశ్న. భూమి సూర్యుడి చుట్టూ తిరిగే దీర వర్తులపు కక్ష్యకు దీర్ఘ వ్యాసము 186,000,000 మైళ్లు. జూనునెల 21వ తేదీన ఈ వ్యాసానికి ఇవతలికొసనీ డిసెంబరు 23వ తేదీన అవతలి కొసనీ ఉంటుంది భూమి. అలాగవున్న సమయాలలో భూమినించి చూస్తూ ఒక నక్షత్రము ఏ కోణములో వున్నదో కొలిస్తే 186,000,000 మైళ్ల పీఠము (Base) మీద రెండు కొసల్నీ ఆ కోణాలలో గీతలు విలిపితే అవి నక్షత్రమున్నచోట కలుస్తాయి. అక్కడినుంచి పీఠముమీదికి లంబరేఖను దింపితే దానిపొడవే ఆ నక్షత్రానికీ భూమికీ వున్న దూరము. అయితే ఈ యత్నము ఫలించలేదు రెండుకొసల్నించి కొలిచిన కోణాలు సమమే అయిపోయినాయి. త్రిభుజము ఏర్పడలేదు. రైలులో ప్రయాణము చేస్తూ దూరపుచెట్లను రెండింటిని చూశామనుకొండి రైలు నడిచి పోగా పోగావాటిలో ఒకటి రెండోదానిముందునుంచి దాటుతుంది. ఇదేమో మనకు చేరువగా ఉన్నదీ, ఆరెండోదీ మనకి దూరంగా ఉన్నదీను. ఈ చెట్లలాంటి నక్షత్రాలు రెండింటినిపట్టి వాటిలో ఒకటి—భూమి తన కక్ష్య కొస ఒక దానినుంచి రెండోకొసకిపోయేటప్పుడు — రెండోదానిని దాటుతూన్నట్టు గుర్తించ గలిగితే అది కొంత పనే. తరవాత ఏ ఉపాయమువల్లనో 'దాటే నక్షత్రము మనకింత దూరము' అని తెలియబడితే 'దూరాన్న ఉన్నది దీనికి ఇన్ని రెట్ల దూరాన్నవుంది' అని లెక్కగట్టుకోవచ్చును. ఇలాటి కొలతలు తీద్దామని హెర్షల్ ఆకాశాన్ని జాగ్రత్తగా పరిశీలించి, చేరువగావున్న జంటల్ని గుర్తుపెట్టుకున్నాడు. ఈ జంటల్ని ఏడాదిపాటు గమనిస్తే వీటిలో మనకి దగ్గరగావున్న నక్షత్రాన్ని ఒక ఆరు నెలల్లో ఇటునుంచీ, ఇంకొక ఆరు నెలలో అటునుంచీ దాటుతుందని ఆశపడ్డాడు హెర్షల్.

అతననుకున్నరీతిగా ఆ జంటలలో ఒకటి రెండోదాన్ని, ఆరునెలలో ఇట్నుంచి, తరవాతి ఆరు నెలలలో అట్నుంచీ దాటలేదు. అతని యత్నము ఫలించలేదన్నమాటే. అయితే మరొక చిత్రము గోచరించింది హెర్షల్‌కి అతడు గుర్తించుకున్న జంటలు ఒకదాని చుట్టూ ఇంకొకటి, ఒప్పులకుప్ప బాలికలు తిరిగినట్లు తిరిగేయి! అదిన్నీ ఆరునెలలకిటూ ఆరు నెలల కటూ కాదు. ఇంకా చాలాకాలానికి. సుయ్యికోసము తవ్వితే నిక్షేపము దొరికినట్లయింది హెర్షల్‌కి!

న్యూటను గురుత్వాకర్షణ సిద్ధాంతము ప్రకారము ఖగోళాలు రెండు చేరువగా వున్నాయంటే అవి—ఒక దాని చుట్టూ మరొకటి తిరుగుతూన్నట్టు కనబడేలాగ— వాటి రెండింటి కేంద్రము చుట్టూ తిరగాలి సూర్యుడిచుట్టూ గ్రహము తిరగడముతోనని పూర్తి కాదు, సూర్యుడు కూడా గ్రహమూ—సూర్యుడూ కేంద్రముచుట్టూ తిరగాలి. ఈ తిరుగుడు—సూర్యుడిది—పట్టడము కష్టము. ఇప్పుడు నక్షత్రాకాశంలో జంట నక్షత్రాలు పట్టేడు హెర్షల్; అవి గురుత్వాకర్షణవల్ల రెండింటి గరిమనాభి (Centre of Gravity) చుట్టూ తిరుగుతూన్నాయి!

ఇవి జంటలు, ఒక దాని కొకటి చేరువగా ఉన్నట్టివి. ఒకంతటూ దూరమవవు. అయితే కాలము గడవగా గడవగా ఇవి దూరమవడము కనబడింది. అంటే ఒకప్పు డెప్పుడో ఇప్పటి కంటె అవి ఇంకా దగ్గరగా ఉండేవన్నమాట. వాటి చేరిక యదాలాపముకాదు. మొదటి నుంచీ అవి చేరి ఉన్నట్టివే. వాటి వయసు ఒకటి. వాటిని కాలక్రమాన్ని గమనిస్తే జంట నక్షత్రాల వింతలు తెలుస్తాయి. అవి అన్ని (జంటలూ) కవలలులాగ ఉండడములేదు. ఒకసారి పుట్టి ఒకే పరిస్థితులలో పెరిగినప్పుడు అవి రెండూ వేరు లక్షణాలతో వుండడానికి కారణమేమిటి?

జంటలలోని రెండు నక్షత్రాలూ దీప్తివంతాలుగా వుంటేనే వాటిని గుర్తుపట్ట డానికి అనుకూలత వుంటుందన్న సంగతి మనకు తెలుసు. కాని, సిరియసు అనే నక్షత్రము చిన్న చిన్న గిరికీలు తిరుగుతూ మొత్తపు పాలపుంతలో ఒకవైపు జరుగుతూంటే చూచి, దానిపక్కనే దాని జంట ఉండాలన్నారు. దాని చుట్టూ ఇది యాభయేళ్లకు ఒకమారు తిరుగుతుందనీ కనుక్కున్నారు. 1862లో ఆల్వన్‌క్లార్కు సిరియసుయొక్క జంట నక్షత్రాన్ని చూచి కనుగొన్నాడు.


అది సిరియసు చుట్టూ— సిరియసు గిరికీల మేరకు రెండు రెట్లు విస్తరణమున్న తన ప్రత్యేకపు పరిధిలో తిరుగుతూన్నదట. అంటే, సిరియసు బరువులో అది సగమే ఉన్నదని లెక్కవేశారు జంట నక్షత్రాలు కనుక్కోనిక్రితము నక్షత్రాల బరువులను గురించి మనకు ఏమిన్నీ తెలియదు. హెర్షల్, జంటలనూ వాటి ప్రదక్షిణ కక్ష్యలనూ కనుక్కున్న తర్వాత పెరిగిన విజ్ఞా

వమే ఇది ఒంటరిగావున్న నక్షత్రాలను చూచే పద్ధతి ఏదీలేదు. సిరియసు సూర్యుని కంటె మూరురెట్లు కాంతివంతమైనదీ, దాని సహచరి సూర్యుడిలో మూరోవంతు కాంతి గలది! సిరియసు లోని హైడ్రోజను కర్చుకావడము వల్లనే అది కాంతిని విరజిమ్మ గలుగుతోంది. దాని

వైజ్ఞానిక గాథాశతి

సహచరిలో హైడ్రోజను ఖర్చైపోయింది అది క్రమంగా సైకిలు పంపులో గాలి లాగ కుంచించుకుంటూ ఆ వేడిమివల్ల కలిగే మంటను మాత్రమే చూపిస్తోంది.

'కంటికి కనబడే జంటలు పది ఏళ్లకు లోపున ఒక ప్రదక్షిణము పూర్తి చెయ్యవు, అంటే గమనిక ఎంత తీక్ష్ణముగా ఉండాలో గ్రహించండి. కంటికి తెలియనివి వర్ణ చిత్రగ్రాహిని (Spectroscope) వల్ల తెలుసుకోవచ్చును. వీటి వేగమూ, ఇది ఒక ప్రదక్షిణము చేసే కాలమూ కూడా తెలుస్తుంది. హెర్షల్ వెలికిన దొకటైనా, దొరికిన దానిని పట్టి చక్కగా సానబట్టేడు ●



జరిగిన కథ

జీవితంమీది విరక్తితో ఆత్మహత్య చేసుకోబోతున్న రాధను, రక్షిస్తాడు ఆ ఊరి డాక్టరు వేణు వేణుకు తన దయనీయ జీవితగాథనంతా వినిపిస ంది రాధ చిన్నతనంలోనే తండ్రిని కోల్పోతుంది స్కూలు ఫైనలు ప్యాసయిన రాధను ఒక మ చి సంబంధమే అనుకుని, భాస్కరానికిచ్చి పెళ్లి చేస్తాడు అన్న ప్రకాశరావు కాని భాస్కరాన్ని గురించి వారూహించినదంతా పొరపాటని తెలుస్తుంది పైగా డబ్బుకోసం రాధ పుట్టింటివారిని తరచూ పీడిస్తుంటాడు భాస్కరం అనుకోని విధంగా ఒక ప్రమాదంలో భాస్కరం మరణిస్తాడు. అనాథ రాధకు అన్నగారింట్లో కూడా ఆదరణ కరువవుతుంది కూతురిని గురించిన బెంగతోనే తల్లి శాంతమ్మ ప్రాణాలు విడుస్తుంది

5

ప్రకాశం వూరునుండి వచ్చిన తరువాత వో ఇరవై రోజులకి కామాక్షి వచ్చింది వాళ్ల తమ్ముడిని కూడ తీసుకుని.

ఆవిడ తమ్ముడు ఆంజనేయులికి పాతికేళ్లుంటాయి చదువు సరీగా అంటలేదు నాలుగైదు చోట్ల ఉద్యోగాలు చేశాడు గాని, ఒక్కదానిలోనూ నిలకడగా ఉండక యజమానులతో పోట్లాట పెట్టుకుని మానేసేవాడు ఇన్నాళ్లూ ఉండే తల్లి కూడా పోవడంతో, ఇక అతను మరీ తెగిన గాలి పటంలా తిరుగుతాడని అక్కగారు తీసుకొచ్చేసింది ఇక్కడే ఏదో ఉద్యోగం చూపించి తమ్ముడిని తన కళ్లముందే ఉంచుకోవాలని ఆవిడ అభిలాష.

ఉన్నదానిలో కొంత ఖర్చయిపోగా, కొంత ఈ ఆంజనేయులు తగలెయ్యగా ఇప్పుడో చిన్న యిల్లు తప్ప యింకేం మిగ్గలేదు వాళ్లకి. ఆ యింట్లో సగం వాటా వాళ్ల పినతండ్రిగారిది నెమ్మదిమీద తమ వాటా అమ్మకానికి పెట్టడమో ఏదో చెయ్యవచ్చునని, ముందయితే తమ్ముడిని తనతో కూడ తీసుకొచ్చేసిం దావిడ


అతనంటే రాధ కెందుకో సదభిప్రాయం కలగలేదు మొదటి చూపులోనే. ఆమె అభిప్రాయంతోటీ అంగీకారంతోటీ నిమిత్తం ఏమిటి ? అది కామాక్షి యిల్లు ఆ యింటికి ఆమె తమ్ముడిని తెచ్చుకునే హక్కు ఆమెకుంది అయితే బావమరిది అంటే ప్రకాశాని కెలాంటి అభిప్రాయం ఉందో ఏమిటో రాధకు తెలియదు అతన్ని గురించి వాళ్లిద్దరూ ఎప్పుడూ మాట్లాడుకోలేదు


అతను వచ్చిన దగ్గరనుండీ రాధతో ఎంతో చనువుగా ఉండడానికి ప్రయత్నిస్తూ, ఆమెతో ఎడతెగని వాగుడుతో ఏదో వాగుతుండేవాడు. రాధకి అతని ప్రవర్తన నచ్చకపోయినా చేసేదిలేక, ఏదో సమాధానం చెప్తూ, సాధ్యమైనంతవరకు ముభావంగా ఉంటూ ఉండేది అతన్ని వో వెకిలి మనిషి క్రింద, ఎందుకూ పనికిరాని వాడుగా జమకట్టిందే కాని, అతనివల్ల ఎవరికీ ఏలాంటి అపకారం హాని జరుగుతుందని ఆమె అనుకోలేదు


అతను రాధ గత జీవితాన్ని గురించి, ఆమె భర్తని గురించి ఏవేవో ప్రశ్నలు వేస్తుంటే ఇతని కెందుకీ అనవసర ప్రసంగం అని లోలోపలే విసుక్కునేదే కాని, తనమీదేదో సానుభూతి చూపిస్తున్నట్లు నటిస్తూ, తనకు దగ్గర కావాలని అతను ప్రయత్నిస్తున్నాడని ఆమె గ్రహించలేకపోయింది

ఓ సాయంత్రం రాధ వంట చేస్తుంటే వచ్చి అక్కడ పీట వాల్చుకు కూర్చున్నాడు కామాక్షి పేరంటానికి వెళ్లింది. పిల్లల నాడిస్తూ ప్రకాశం వీధి గదిలో ఉన్నాడు

ఆంజనేయులు వచ్చి కూర్చుంటూ కొంతసేపు రాధ అందాన్ని వర్ణిస్తూ పొగడడం మొదలుపెట్టాడు తరువాత "ఏమిటో నిన్ను చూస్తే జాలేస్తుంది రాధా. నువ్వు పాపం జీవితంలో ఏం







నిరీక్షణ

చూశావని. ఇంత చిన్న వయస్సున ఉండి కూడ, నువ్వు ఇలా ఉండిపోవా లనుకోవడం ఏం బాగుండలేదు. పోనీ అని మా అక్కయ్యకీ బావకీ అయినా నీకు మళ్లీ పెళ్లి చేద్దాం అన్న ఉద్దేశ్యం ఎందుకు కలగదో. వాళ్ళు మాత్రం హాయిగా పిల్లాపాపతో సుఖంగా సంసారం చేసుకుంటున్నారు. నీ సుఖం గురించి వాళ్లకేం పట్టినట్లు లేదు. మా అక్కయ్య మరీను. తను హాయిగా కాలుమీద కాలు వేసుకుని కూర్చుని ఇంటిపనంతా నీచేత చేయిస్తూ నిన్నోదాసిదానిలా చూస్తోంది. అక్క అయితే అయింది కాని, తన వరస నాకేం నచ్చలేదు. నీకీ పనంతా చెయ్యడం కష్టంగా లేదా ?" అన్నాడు ఎంతో జాలి పడి పోతున్నట్లు రాధ వంక చూస్తూ.

"ఏం చెయ్యమన్నారండీ. ఎవరు చేసుకున్న ఖర్మ వాళ్లనుభవించాలి. చెయ్యందే రాదు, అనుభవించందే తీరదు అని మా అమ్మ ఎప్పుడూ అంటూండేది. నా దురదృష్టానికి ఎవరు మాత్రం ఏం చేస్తారు?" అంది. ఇంకనైనా ఆ ఘటం అక్కడ నుండి వెళ్లిపోతే బాగుండు ననుకుంటూ.

"నిజమే, ఎవరు మాత్రం ఏం చేస్తారు. ఇందులో ఒకళ్లు చేసేదేమీ లేదు. ఎవరు సుఖపడే మార్గం వాళ్లే వెతుక్కోవాలి. నీకు మాత్రం సుఖపడాలని లేదూ ? కోర్కెలు లేవూ ?" అన్నాడు ఆమెవంక భావగర్భితంగా చూస్తూ.

రాధలో దుఃఖం, కోపం, జుగుప్స పొంగి పొరలుతూంటే, అతి కష్టంమీద నిగ్రహించుకుంటూ "ఎందుకు లేవు. నన్ను పెళ్లి చేసుకునేవాడు ఎవరైనా కనిపిస్తే చేసుకోడానికి నేనూ సిద్ధంగానే ఉన్నాను. పోనీ, నేనంటే ఇంత అభిమానం చూపించి జాలిపడుతున్నారు. మీరే నన్ను పెళ్లిచేసుకొని నా జీవితం ఉద్ధరించరాదా ?" అంది. ఆనా డంత చిలిపి బుద్ధి ఎలా పుట్టిందో తలుచుకుంటే ఆమెకీ ఆశ్చర్యంగానే ఉంటుంది.

"ఛీ, ఛీ. పెళ్లా? నిన్నా ? నా ఖర్మం వెధవముండని పెళ్లిచేసుకునేందుకు" అంటూ అక్కడనుండి లేచి వెళ్లిపోయాడు. అతని మొఖం క్రోధంతో అవమానంతో జేవురించి ఉంది.

అతను వెళ్లిపోయిం తరువాత తనకి జరిగిన అవమానానికి లోలోనే కుమిలి కుమిలి ఏడ్చింది రాధ. ఎవరికి చెప్పుకో గలదు ? చెప్పినా వదినగారు నమ్ముతుందా తమ్ము డలాంటివాడంటే.

మర్నాడు వెళ్లి పార్వతితో చెప్పుకుని ఏడ్చింది. పార్వతి అంతకుముందే పుట్టింటికి వచ్చింది పురిటికి.

"మళ్లీ అలాంటి వెధవ్వేషాలేస్తే మా అన్నయ్యకి చెప్పేయి. భయం ఏమిటి? లేకపోతే నేనే చెప్తాను." అంది కోపంతో వూగిపోతూ.

నాలుగైదు రోజులు ఏ విశేషం లేకుండానే గడిచిపోయాయి.

ఆ ఉదయం సూర్యం మేష్టారి తల్లి వూరికెళ్లింది ఆవిడ అక్కకూతురు పెళ్ళని. అప్పటికి పెళ్లి యింకా పదిరోజు లుంది. ఆవేళ్టికి శలవు దొరికితే వస్తానని ముందుగా వెళ్తే పెళ్లి పనులకైనా సహాయంగా ఉంటుందని తల్లిని పంపించాడతను.

సాయంత్రం రాధా కామాక్షి వంట గదిలో ఉన్నారు. రాధ కూర తరుగుతూంటే కామాక్షి బియ్యం కడుగుతోంది. ఆంజనేయులు ఏదో కొంప మునిగిపోయినట్లు "అక్కయ్యా, ఇలారా" ఇది చదువ్. అన్ని సంగతులు నీకే తెలుస్తాయి." అంటూ నో ఉత్తరం ఇచ్చాడు.

అది చదువుతూనే ఆవిడ కోపంతో పళ్ళు కొరుకుతూ, "ఇలాంటి వెధవ బుద్ధులు కూడ పుట్టాయన్నమాట. మా పరువు మర్యాద ఏం నిలబెట్టదలుచుకో లేదా? మీ అన్నయ్యకే చూపిస్తా యీ ఉత్తరం. దీని సంగతేదో ఆయనే చూసుకుంటారు." అంటూ ఆడబడుచుమీద కేకలేస్తూ,

"పిలుచుకురారా మీ బావని. ముద్దు

ల్లెలు ఎలాటి ఘనకార్యం చేసిందో తెలుసా దానికి శతవిధాల ప్రయత్నించింది. అయినా ఈ అక్రమానికంతా ... కారణం

...ంటారు." అంది తమ్ముడితో.

అతను వెళ్లక్కరలేకుండానే, భార్య కేకలు విని ప్రకాశం లోపలికి వచ్చాడు. ఏం జరిగింది అంటూ.

"ఏమిటా. చూడండి ఉత్తరం. మీ చెల్లెలు ఆ అద్దెకున్న మాష్టారికి వ్రాసింది. ఆ ముసలావిడ వూళ్లో లేదుగా" అంటూ ఉత్తరం భర్తచేతి కిచ్చింది.

అంతవరకూ అసలా ఉత్తరంలో ఏముందో తెలియక అయోమయంగా చూస్తున్న రాధ ఆ మాటలు వింటూనే దెబ్బతిన్నట్లు విలవిలలాడుతూ.

"అబద్ధం వదినా. అసలా ఉత్తరం ఏమిటో నాకు తెలియదు. అది నేను వ్రాయలేదు." అంటూ రెండు చేతు లోనూ మొఖం దాచుకుని వెక్కివెక్కి ఏడవడం మొదలుపెట్టింది

ఆ ఉత్తరం చదువుకున్న ప్రకాశం కొద్ది క్షణాల్లోనే ఆ దిగ్భ్రమ నుండి తేరుకుని, "నేను నమ్మను ఇది రాధ వ్రాసిన ఉత్తరం కాదు. తను అసలలాంటి పిల్ల కాదు" అన్నాడు ఉత్తరం ముక్కలు ముక్కలు చేస్తూ.

"సరి ఋజువు దొరికినా నమ్మకపోతే ఎలా అయినా మీరు నమ్మకపోయినంత మాత్రాన నిజం మాసిపోదు. ఛీ ఇలాంటి వెధవ బ్రతుకు బ్రతికే కంటే ఎందులో నైనా పడి చావడం మేలు. ఇదే నా కూతురైతే ఆ కత్తిపీటతో ముక్కల ముక్కలు చేసి వదిలిపెడుదును మీరు కాబట్టి చెల్లెలు ఎలాంటిపనులు చేసినా నోరు మూసుక్కూర్చున్నారు" కామాక్షి నోటికి హద్దులేక పోయింది.

రాధ చటుక్కున వదినగారి రెండు కాళ్లు పట్టుకని "అబద్ధం వదినా! అదంతా అబద్ధం. ఆ ఉత్తరం నేను వ్రాయలేదు నామాట నమ్ము నువ్వు చెప్పేనదాకా అసలా ఉత్తరం ఏమిటో నాకు తెలియదు. ఇందులో ఏదో మోసం ఉంది నేనెలాంటిదాన్నో నీకు తెలియదా ?" అంటూ కన్నీళ్లతో ఆమె పాదాలు తడి పేస్తూ తన నిర్దోషిత్వాన్ని నిరూపించుతో కామాక్షి నమ్మలేదు. నిర్దాక్షిణ్యంగా కాళ్లు వెనక్కి తీసుకు వెళిపోయింది.

"అస లిలాంటిదేదో జరుగుతుందని నే ననుకుంటూనే ఉన్నాను. మొన్నోవాడు 'నన్ను పెళ్లిచేసుకుంటావా' అని అడిగిం దక్కయ్యా." అంటి ఫిర్యాదు చేశాడు అక్కగారితో.

"చూశారా, మీ చెల్లె లెంతకి తెగించిందో ఈ వెధవముండని కట్టుకునేంత ఖర్మ వాడికేం పట్టలేదు. దీని బుద్ధి యిలాంటిదని తెలిస్తే అసలు నేను వాడిని తీసుకురాకనే పోదును. వాడు లొంగలేదని కాబోలు ఆమేష్టారిమీద విసిరింది వల." అంటూ కామాక్షి కసిదీరా రాధ హృదయాన్ని ముక్క ముక్కలు చేసింది.

"నిజమా తల్లీ అతన్నలా అడిగావా?" అన్నాడు ప్రకాశం నమ్మలేనట్లు, అంతమంది చెప్తున్నా అతనికి చెల్లెలిలో విశ్వాసం సడలిపోలేదు.

"ఈ జీవితం ఇలా ఎన్నాళ్లు గడుపుతావు మళ్లీ పెళ్లి చేసుకో అని ఆయనంటూంటే, అయితే మీరు చేసుకుంటారా అని అడిగాను హాస్యంగా." అంది రాధ అపరాధిలా తలొంచుకుని.

"ఛీ. ఎంత సిగ్గుమాలిన సంగతి. పోనీ ఇప్పటికైనా నమ్ముతారా ?" అని విలదీసింది కామాక్షి

ప్రకాశం మౌనంగా బయటికి వెళ్లిపోయాడు. అన్నగారు కూడ తనని శంకిస్తున్నాడేమోననివే వూహ కలిగేసరికే రాధకి జీవితంమీదే రోత పుట్టింది

"నా కెవరూ లేరు. నే నెవరికోసం బ్రతవాలి" అనే భావం ఆ క్షణంలోనే మొలకెత్తి గాఢంగా నాటుకుపోయింది ఆమె హృదయంలో. కనుచీకటి పడుతూండగా ఎవరూ చూడకుండా ఇల్లు విడిచి వెళ్లిపోయింది. ఎన్ని అవాంతరాలు వచ్చినా వెనుకంజ వేయదలుచుకోలేదు తను చెయ్యని అక్రమానికి దోషిగా నిలబడి నలుగురిచేత 'ఛీ' అనిపించుకుంటూ బ్రతింకంటె అదే ఉత్తమమార్గం అనిపించింది.

ఎవరో గ్రహించుకో గలిగింది ఆంజనేయులు. ఆమె తనకి లొంగిరాలేదన్న కసి, ద్వేషం, పగ అతనిలో ప్రతీకారాగ్నిని ప్రజ్వలింపజేశాయి. సమయం చూసి సాధించాడు. పెద్దరికాగులవాడు చెకిలివాడు అని రాధ నిర్లక్ష్యం చేసినవాడే ఆమె జీవితంలో చిచ్చు రగిల్చాడు. సిగ్గుపడి ఆమె అన్నగారికి చెప్పుకోలేకపోయిన సంఘటన తనకనుకూలంగామార్చిచెప్పుకున్నాడు....

గతాన్ని తలుచుకున్నకొద్దీ ఆమెకి దుఃఖం ఆగలేదు. అవిరళంగా స్రవిస్తున్న అశ్రుధారలను ఒత్తుకోడానికి కూడ ప్రయత్నించకుండా తలగడలో తలదూర్చి నిశ్శబ్దంగా రోదిస్తున్న రాధ తెల్లవారగట్ల నిద్రాదేవి వడిలో వాలిపోయింది.

"ఏమిటమ్మోయి ఆ పడక. అర్ధరాత్రిదాకా షికార్లుకొట్టి రావడం, బారెడు పొద్దెక్కినదాకా నిద్ర లేవకపోవడం" అంటూ కామాక్షి గొంతు ఖంగుమనడంతో ఉలిక్కిపడి కళ్లు తెరిచింది

బద్ధకంగా ఒళ్లు విరుచుకుంటూ లేవబోతుంటే, "ఎక్కడెక్కడ తిరిగొచ్చావమ్మా, నేను నిన్నేదో అన్నానని, నీవు రోషం వచ్చి ఎందులోనైనా పడి చావడానికి వెళ్లావని మీ అన్నయ్య నా ప్రాణాలు తోడేశారు. నాకేమవసరం నిన్ననేందుకు ? చెల్లె లెలాంటిదయినా ఆయనకి సిగ్గు, అవమానం లేనప్పుడు నాకా ఏమిటి ? ఇదుగోనమ్మా, నీ ఆటలకి నేనేమీ అడ్డురాను. కాని నువ్వు మాత్రం బలవంతాన్ని ప్రాణాలు తీసుకోకు నువ్వలా చేస్తే, నన్ను ప్రాణాలతోటే తగలేస్తారు మీ అన్నయ్య" అంటూ యింకో యింత విషం కక్కింది కామాక్షి.

రాధ సమాధానం చెప్పలేదు. ఏమీ జరగనట్లే, తన పనులు తాను చేసుకోడం మొదలుపెట్టింది

సాయంత్రం అయింది "పార్వతిగారింటికి వెళ్లి వస్తా వదినా" అని చెప్పి వేణుగోపాలరావుని కలుసుకోడానికి బయలుదేరింది.

* * *

నిరీక్షణ

సంగ్రహంగా తన చరిత్రంతా చెప్పి,

"మూర్ఖంగా సాహసానికి పూనుకున్నానని అన్నారు మీరు నిన్న. ఇప్పుడు చెప్పండి, ఇలాంటి పరిస్థితులలో చిక్కుకున్న ఏ వ్యక్తికైనా మరణం కంటె శరణ్యం వేరే ఏమైనా ఉందా? ఆ మరణము కూడా నా కందకుండా పోయింది." అంది రాధ తలవొంచుకుని వ్రేలితో మట్టిలో గీతలు గీస్తూ.

కన్నీటితో తడిసి బరువెక్కిన కనురెప్పలను భారంగా పైకెత్తుతూ "మీ నిర్ణయానికి కొంచెం ఇన్ని విషాద సంఘటన లున్నాయనుకోలేదు. తొందరపడి అనాలోచితంగా మాట్లాడినందుకు నన్ను క్షమించండి. కాని నా దొక కోరిక. ఇకముందు ఎలాంటి పరిస్థితులలోనూ అలాంటి సాహసం చెయ్యనని నాకు మాటివ్వండి." అన్నాడు తన హృదయంలోని జాలి, సానుభూతీ అంతా ఆ మాటలలో పొందుపరుస్తూ.

"ఇంక అలాంటి పని చేయదలుచుకోలేదు ఆ క్షణంలో ఏదో ఆవేశపడ్డాను కాని, ఇప్పుడాలోచిస్తే అదెంత తెలివితక్కువపనో తెలిసి వస్తోంది. నేను చచ్చిపోయి సాధించేదేముంది? బ్రతికుంటే ఏ నాటికైనా సుఖపడే రోజులు రావచ్చును. ఏనాటికైనా అన్నయ్యా నడినా నాలో ఎలాంటి కళంకంలేదని గుర్తించవచ్చు. ఇంక నేను చావుని గురించి ఆలోచించదలుచుకోలేదు. ఎక్కడైనా చిన్న ఉద్యోగం చూసుకొని స్వతంత్రంగానే పొట్ట పోసుకోగలనే ధైర్యం కలుగుతోంది."

"మీకు కలిగిన ఈ ఆత్మవిశ్వాసానికి చాలా సంతోషం. నేనే ఈ ఊరికి క్రొత్తగా వచ్చాను. అయినా ఎలాగో ప్రయత్నించి మీకో ఉద్యోగం సంపాదించి పెట్టగలను."

"వద్దండి. ఈ వూళ్లో ఉద్యోగం నేను చేయదలుచుకోలేదు. ఈ వూరికి ఇక్కడి మనుష్యులకి దూరంగా వెళ్లిపోవాలని గట్టిగా నిశ్చయించుకున్నాను. ఇంట్లో అందరిచేత అంత హీనంగా చూడబడుతూ ఆ యింట్లో ఉండడం నావల్ల కాదు. అన్నయ్యకి నామీదెలాంటి – అనుమానం లేదనే నేనుకుంటున్నాను. అయినా నిన్నటి నుండి అన్నయ్య ఎదుట పడడానికే సిగ్గుతో చచ్చిపోతున్నాను. ఎన్నాళ్లని తప్పించుకు తిరుగుతాను. అందుకే ఇంకా ఇంట్లో ఉండడం సాధ్యంకాదని నిశ్చయించుకున్నాను.

ఈ విశాల ప్రపంచంలో నన్నాదరించే వ్యక్తి ఒక్క పార్వతే తన దగ్గర ఉండి ఏ ప్రయత్నాలైనా చేసుకోవచ్చు అసలు తనే ప్రయత్నించి నా కేదో ఇంత జీవిక చూపించగలదు. కాని తను వెళ్లడానికి ఇంకా మూడు నెలలైనా పడుతుంది. అప్పటిదాకానైనా నేనిక్కడ ఉండాలి. ఈ జరిగిందంతా వింటే తనేం సలహా చెప్తుందో చూడాలి."

"సరే. రేపు వెళ్లి ఆమె సలహా కూడా తీసుకోండి. మీ రెక్కడున్నా నన్నొక స్నేహితుడిగా గుర్తుంచుకో గలిగితే సంతోషిస్తాను."

"ఎంతమాటన్నారు, మీరు నా ప్రాణదాతలు. ఆ కృతజ్ఞతాభావం నాలో కలకాలం నిలిచిపోతుంది." అంది రాధ ఆ భావాన్ని చూపులతోనే వ్యక్తంచేస్తూ.

"దానికేంలెండి .... మీరింకా కొద్ది రోజులు ఇక్కడే ఉంటారుగా. ఎప్పుడైనా వీలైతే ఇటు వస్తూండండి" అంటూ లేచాడు వేణు.

"కోపిగ్గా నా కథంతా విన్నందుకు మీ కెలా కృతజ్ఞత తెలుపుకోవాలో తెలియడంలేదు. ఆ బాధంతా మీతో చెప్పుకోవడం వలననే ఇప్పు డింత హాయిగా ఉండగలుగుతున్నానేమో అనిపిస్తోంది." అంది రాధ అతన్ననుసరిస్తూ.

వేణు నుండి సమాధానం ఏమీ రాలేదు. ఏదో దీర్ఘాలోచనలో మునిగిపోయినట్లు మౌనంగా అడుగులు వేయసాగాడు. రాధ కూడా ఏమీ సంభాషణ పెంచలేదు. స్టేషను దగ్గరికి వచ్చాక మాత్రం "ఇక నే నిటు వెళ్లిపోతానండీ. నమస్కారం." అంటూ శలవు తీసుకుంది రాధ.

"మంచిది. ఎప్పుడైనా వస్తూంటారుగా." అని చిరునవ్వుతో సమాధానం చెప్పి, కొద్ది క్షణాలు ఆమె వెళ్లిన వేపే చూస్తూ నిలబడిపోయాడు.

దారి కష్టం లేమ్మనడానికి సూచనగా రిక్షావాడు మ్రోగించిన గంట విని త్రుళ్లి పడి, ఒక్కసారి దీర్ఘంగా నిశ్వసించి ఇంటి ముఖం పట్టాడు.

"కూతురు గోరణితో పడి మిగతావాళ్ల నెవరినీ గమనించేటట్లు కూడ లేదే." అంటూ నో కుర్చీ మంచానికి కొంచెం దగ్గరగా జరుపుకుని కూర్చుంది రాధ.

తదేకంగా పాపనే చూసుకుంటూ, మధ్య మధ్య ఆ పసిపాప ముంజేతులను తన పెదిమలమీద ఒత్తుకుంటూ బడలికగా పడుకోమన్న పార్వతి రాధ మాటలు విని తలెత్తి చూసి "రా కూర్చో. ఎంతసే పయింది నువ్వొచ్చి." అంది చిన్నగా నవ్వుతూ.

"అబ్బో, అరగంట పైనే అయింది. అలా గుమ్మంలో నిలబడి చూస్తున్నా. ఎప్పటికైనా నా రాక గమనిస్తావేమోనని. ఊహూ. నువ్వసలీ ధ్యాసలో ఉంటేనా. ఆ పాపతో ఏమిటో ఒకటే కబుర్లు, ఒకటే ముద్దులు"

"అబద్ధాలతోపాటు కవిత్వం కూడ వస్తోందే అమ్మాయికి. అది సరేగాని ఎక్కడా కనిపించడమే మానేశావేం. ఇప్పుడయినా మా తమ్ముడొచ్చి చెప్పబట్టి వచ్చినట్లు న్నావు. లేకపోతే ఎన్నాళ్లకయేదో నీ దర్శనం ?"

"అంత విస్తారం వెయ్యకు మరి. మొన్న నొకరోజు నే నెలాంటి పరిస్థితు లలో చిక్కుకున్నానో, నా కెలాంటి సమ స్యలు ఎదురయాయో చెప్తే ఆశ్చర్య పోతావు. అవన్నీ నీకు చెప్పాలనీ, నీ సలహా తీసుకోవాలనీ రెండు రోజులనుండి ప్రయా ణము అవుతోంటే ఏహో అవాంతరాలు వస్తున్నాయి. ఈ సాయంత్రం ఏమైనా సరే తప్పకుండా రావాలని ప్రయాణం అవుతోంటే మీ తమ్ముడొచ్చి ఈ శుభ వార్త అందజేశాడు."

"ఏమయిం దేమిటి ? మళ్లీ ఆ అంజ నేయులు ఏమైనా అన్నాడా ? మీ అన్న య్యకి చెప్పకపోయావా ?" అంది పార్వతి ఆదుర్దాగా.

"పెద్ద గొడవేలే. అసలు నీ కిప్పుడు వినే ఓపిక ఉందా చెప్పు. లేకపోతే రెండు మూడు రోజులు పోయాక మళ్లీ వస్తా."

"ఓపికేం ? పడుకుని ఎన్ని ఖబు ర్లయినా వినగలను. చెప్పు త్వరగా."

"తలుపు వేసేయనా. లేకపోతే ఉండు. నా కుర్చీ అటు జరుపుకుంటా. ఎవరైనా వస్తున్నారేమోనని నో కన్ను వేసి ఉంచ వచ్చు." అంటూ కుర్చీ తెచ్చి తలుపుకి పార్వతి మంచానికి మధ్యగా వేసుకుని కూర్చుంది రాధ.

"నే నానాడు వచ్చినప్పుడు చెప్పాగా అంజనేయులు సంగతి." అంటూ మొదలు పెట్టి, తను డాక్టరు వేణుగోపాలరావుని కలుసుకోడం, అతనికి తన కథంతా చెప్పడం వరకు అంతా చెప్పేసింది రాధ.

"ఎంత అఘాయిత్యానికి పూను కున్నావు రాధా ! ఔను. ఇప్పుడు జ్ఞాపకం వస్తోంది. మొన్న నో సాయంత్రం బాగా చీకటి పడ్డాక మీ అన్నయ్య వచ్చాడు. 'రాధ ఉందా ?' అంటూ. 'లేదు. ఏం అన్నాను. 'అబ్బే. ఏంలేదు. నేనిటు బజారు నుండి ఇంటికి వెళ్తూ రాధ ఉందేమో కలిసి పోదామని వచ్చాను. ఇవాళ ఇక్కడికి వస్తానని చెప్పింది. మళ్లీ మానుకుం దేమో' అన్నాడు. నిజమే ననుకున్నా. అసలు సంగతి చెప్తే నలుగురిలోను తల వంపులని ఎంత గుంభన, జాగ్రత్త చూడు." అంది చమర్చిన కళ్లను ఒత్తు కుంటూ.

"ఏమిటే ? అన్నయ్య ఆనాళ ఇక్కడికి వచ్చాడా ? అందుకే కాబోలు నే నిక్కడికి వచ్చానని చెప్తే నమ్మలేనట్లు అదోలా చూశాడు. ఇంకా ఎక్కడెక్కడ వెతికాడో పాపం" అంది తను అబద్ధం చెప్పినట్లు అన్నగారికి తెలిసిపోయింది కదా అని బాధ పడుతూ.

"అది సరే. అప్పుడే నా దగ్గరికి రాక పోయావా ? నే నిక్కడ లేకపోతే ఏమో అనుకోవచ్చు. నే నుండి కూడ నీకే సహాయం చేయలేకపోతా ననుకున్నావా ? ఇంతేనా, ఇన్నాళ్ల స్నేహంతోటి నువ్వు నన్ను అర్థం చేసుకున్నది ?"

"ఏమిటో. ఆ సమయంలో నాకు బ్రతుకుమీదే విరక్తి పుట్టింది. ఇంక వేరే ఏమీ ఆలోచించలేకపోయాను."

"ఆ పుణ్యాత్ము డెవరో ఆవేళ్టికి దైవం పంపించినట్లే వచ్చాడు. నిన్ను కాపాడిన అతను కలకాలం సుఖంగా ఉండాలని కోరుకుంటున్నాను" అంది అలసటగా కళ్లు మూసుకుంటూ.


"ఇప్పుడేం జరుగలేదుగా. నువ్వేం బాధ పడకు. అసలు నువ్వింత నీరసంగా ఉన్న ప్పుడు నా సొదంతా చెప్పడం నాదే తప్పు."

"నా నీరసాని కేమిటిలే. నీ అవస్థ తలుచుకుంటే కడుపు తరుక్కుపోతుంది. ఆ యింట్లో ఎలా ఉండగలుగుతున్నావో అన్నది నా వూహకి కూడ అందడంలేదు. ఆమధ్య ఏదైనా ఉద్యోగం కోసం ప్రయ త్నించమని మీ అన్నయ్యకి చెప్తానన్నా వుగా. ఇంకా ఏమీ దొరకలేదా ?"

"అసలు అన్నయ్య ప్రయత్నం చేశాడో లేదో నాకే తెలియదు. ఇక ఇప్పుడు ఇక్కడ ఉద్యోగం దొరికినా చెయ్యదలుచుకోలేదు." అంది రాధ పార్వతి వంక చూస్తూ.

"అయితే ఏం చేద్దామని." అంది పార్వతి అర్థంకానట్లు.

"నా ఆశలన్నీ నీమీదే పెట్టుకున్నాను పార్వతీ. ఈ పరిస్థితిలో నా కేదైనా మార్గం చూపించగలిగేదానివి నీవే. ఒకళ్లమీద ఆధారపడకుండా నా కాళ్ల మీద నేను నిలబడాలనే నిశ్చయించు కున్నాను. అయితే మా యింట్లో ఆ మను ష్యుల మధ్య మసలుతూ అడుగడుక్కీ అవమానాలు సహిస్తూ ఇక్కడ ఉండ దలచుకోలేదు. మీ హైదరాబాదు అంత



మహాపట్నం కదా. నాలాంటి నిర్భాగ్యురాలికి జీవనోపాధి కల్పించలేకపోతుందా ? అయితే ఆ మహా పట్నంలో నేను ఎరిగున్నవాళ్లు ఎవరూ లేరు ఎక్కడ ఉండాలో, ఉద్యోగాల కోసం ఎక్కడ ప్రయత్నించాలో ఎవర్ని కలుసుకోవాలో నాకేమీ తెలియదు. నువ్వెళ్లిం తరువాత నేను నీ దగ్గరికి రావాలనుకుంటున్నాను. మీ ఇంట్లో చిన్న గది కాని, ఆఖరికి చిన్న వసారా అయినా సరే చూపించావంటే అందులో గుప్పెడు గింజలు ఉడకేసుకుని కాలక్షేపం చేయగలను. నా కేదైనా ఉద్యోగం చూపించే భారం కూడ మీ దంపతు లిద్దరిదే. మీ పెళ్లిలో వొసారి చూడ్డమే తప్ప మీ ఆయనతో నా కసలు పరిచయంలేదు. వన్నొక నిర్భాగ్యురాలైన సహోదరిగా అన్నగారి పంచని తలదాచుకోడానికి వచ్చిన చెల్లెలిగా ఆయనకి పరిచయం చెయ్యి. నువ్వు కాదనవని, మీ ఇద్దరి అండనీ, నేను జీవితం వెళ్లదీసుకోగలననే ధైర్యంతోటే నేనింకా ప్రాణాలతో ఉన్నాను పార్వతీ నాకు ఉద్యోగం దొరికేదాకా కూడ నేను మీకు భారంగా ఉండను. అమ్మ పొలం అమ్మిన బాపతుదేదో ఉందని ఒక నూరు రూపాయ లిచ్చాడు అన్నయ్య ఆమధ్య. అవి నా దగ్గరలాగే ఉన్నాయి వాటితో కొన్నాళ్లు జరిగిపోతుంది ఈలోపుని ఏ ఉద్యోగమయినా దొరకదంటావా ? అంతగా అవసరమయితే ఈ గాజులు గొలుసు కూడ అమ్మేయడానికి నాకేం అభ్యంతరం లేదు. చెప్పు పార్వతీ. ఈ స్నేహితురాలికీమాత్రం సహాయం చేయలేవా ?' అంటూ అశ్రుతప్త నయనాలతో పార్వతి వైపు చూసింది రాధ.

"ఎందు కంతగా ప్రాధేయపడతావు రాధా. ఈమాత్రం సహాయం కూడ చెయ్యలేకపోతే మన స్నేహాని కర్థం ఏముంది. అయితే నేను వెళ్లేసరి కింకా రెండు మూడు నెలలు పడుతుందిగా. అప్పటిదాకా నీకీ బాధలు తప్పవు." అంది పార్వతి ఆగకుండా స్రవిస్తున్న దుఃఖాశ్రువులను ఒత్తుకుంటూ

"హైదరాబాదులో మా కాలేజీ ప్రిన్సిపాలు మొన్న వేసంగుల్లోనే రిటైరయింది వూరికే కూర్చునే అలవాటులేక ఒక చిన్న నర్సరీ స్కూలు పెట్టింది మా యింటికి దగ్గరేలే. నేనా కాలేజీలో నాలుగేళ్లు చదవబట్టి ఆవిడ నాకు బాగా పరిచయమే. అదీ కాకుండా ఫైనలియరులో మా క్లాసుకి ఇంగ్లీషు తీసుకునేది. అందుచేత ఆవిడదగ్గర నాకు కొంచెం చనువు కూడ ఉందనుకో అవిడ్నెలాగయినా బతిమిలాడి నీకో పోస్టు యిప్పించగలను కాని జీతం మాత్రం డెబ్భై, ఎనభై రూపాయలకంటే ఎక్కువ ఇవ్వదు." అంది మళ్లీ.

"చాలదా ఏమిటిలే. నా స్కూలుఫైనల్ క్వాలిఫికేషనుకి. ఈ సహాయం మాత్రం ఎలాగో చేసిపెట్టావంటే నీకు జీవితాంతం ఋణపడి ఉంటాను. మళ్లీ ఆ పోస్టు ఎవరికీ ఇచ్చేయకుండా కాస్త చెప్పి ఉంచమని అన్నయ్యగారికి వ్రాయి పోనీ." అంది రాధ ఆత్రంగా.

"ఇప్పు డప్పుడే ఎక్కడా ? మళ్లీ స్కూళ్లు తెరిచేనాటికి ఒకళ్లిద్దర్ని కొత్తవాళ్లని తీసుకుంటానని ఆవిడ చెప్పింది నే వెళ్లేసరి కింకా వేసంగి సెలవలు పూర్తయిపోవు. వెళ్లగానే చెప్తాలే. ఇంక వేరే ఎవరికీ మాటివ్వవద్దని.

ప్రస్తుతం నువ్వుండడానికి కూడ ఏవీ ఇబ్బంది ఉండదులే. మాది లంకంత ఇల్లు. కాస్త సాయంగానైనా ఉంటారు, ఒకభాగం ఎవరికైనా అద్దె కిద్దామంటే మీ అన్నయ్యగారు ఒప్పుకోరు నువ్వు కూడా మాతోపాటే ఉండొచ్చు."

"అలా కాదు పార్వతీ. నాకేదో వొ గదంటూ చూపించావంటే నా సంపాదనతో అందులో కాలక్షేపం చేస్తాను. అంతే కాని, అందరం కలిసే ఉందామంటూ మొహమ్మాట పెట్టకు. నువ్వందు కంగీకరించేటట్లయితేనే నేను రావడానికి సిద్ధపడతాను. ఎంత స్నేహితులమైనా, ఎంతలో ఉండవలసినవాళ్లం అంతలో ఉండి, మర్యాద యిచ్చి పుచ్చుకుంటేనే ఆ స్నేహం అయినా పది కాలాలపాటు నిలుస్తుంది. మరీ కలిసిపోయి ఒకటిగా అయిపోవాలనుకోడం ఆ స్నేహబంధాన్ని తెంచుకోడానికే కారణం అవుతుంది. నే నిలా అంటున్నానని ఏమీ అనుకోకు. నువ్వు కూడ బాగా ఆలోచించు."

"దానికేం రాధా. నీ యిష్టం వచ్చినట్లే ఉండొచ్చు. పాపకి మూడో నెల రాగానే నేను మా అత్తవారి వూర్కి వెళ్లి అక్కడ్నించి హైదరాబాదు వెళ్తాను. నేను వెళ్లాక ఉత్తరం వ్రాస్తాను. అప్పుడు రావచ్చు ఇంక నువ్వు దాన్ని గురించి ఏం బెంగ పెట్టుకోకు "

"ఇంక ఇప్పుడేం బెంగ లేదులే " అంది చిరునవ్వుతో రాధ తృప్తిగా పార్వతి కళ్లల్లోకి చూస్తూ.

కొద్ది క్షణాలు మవునంగా గడిచాయి.

"అన్నయ్యగారికి ఉత్తరం వ్రాశారా ? బారసాలనాటికివస్తారేమో."అందిరాధేమళ్లీ.

"ఆయన కలాంటి వేడుకలేం ఇష్టం ఉండవు అయినా పదకొండు రోజులదాకా ఆగుతారా ? ఉదయమే టెలిగ్రాం ఇచ్చారు నాన్నగారు. అది అందగానే ఈపాటికే బయలుదేరి ఉండాలి "

"నయమే నేను రేపు వచ్చాను కాదు. ఈ గొడవంతా చెప్పుకోడానికి "

"వస్తే మాత్రం ఏం. వాళ్ల నాన్నగారితో ఖబుర్లు చెప్పడానికి పాపని అప్పచెప్పి మనిద్దరం ఖబుర్లు చెప్పుకుంటూ కూర్చుందుం." అంది పార్వతి మురిసెంగా, పాప బుగ్గలు మృదువుగారాస్తూ.

ఆ దృశ్యం చూసి రాధ మనస్సులో "ఎంత అదృష్టవంతురాలు " అన్న భావం మెదిలింది. మరు క్షణమే ఆత్మపరీక్ష చేసుకుని " ఛ ఏమిటిది ? పార్వతి అదృష్టాన్ని చూసి నేను ఈర్ష్యపడుతున్నానా ? వద్దు భగవాన్ ! అలాంటి భావం నా కెప్పటికీ కలగనివ్వకు. పార్వతి బిడ్డా పాపాతో పది కాలాలపాటు సుఖంగా ఉండాలనే నా కోరిక." అనుకుంది.

"వస్తాను పార్వతీ. చీకటి కూడ పడుతోంది. నాలుగు రోజుల కోసారి వస్తుంటాలే." అని పార్వతికి చెప్పేసి యింటికి వెళ్లిపోయింది రాధ. (సశేషం)







డా॥కరుణాకర్
భాగవతార్
ఆనందరావు
సుందరరామయ్య
వీరభద్రరావు


గోపన్న
దేవదాసు
వేణు
శాంతన్న
ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ సమర్పించు
నవరాత్రి
నిర్మాత ఏ.వి.సుబ్బారావు దర్శకుడు టి.రామారావు
NVKR





వారఫలం

22-4-1966 శుక్రవారం మొదలు
28-4-1966 గురువారం వరకు.

మేషం : వృత్తి వ్యాపారాల్లో మీరు ఘన విజయాలను యేమీ సాధించలేకపోయినా అన్ని వ్యవహారాలు అనుకొన్నట్లుగా నెరవేరతాయి. సమయానికి యేదో ఒకవిధంగా డబ్బు చేతికి వస్తుంది వృత్తి రీత్యా చేసే ప్రయాణాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి ఉద్యోగంలో మిత్రులకు ఉపకారం చేయడానికి అవకాశం లభిస్తుంది కుటుంబ కార్యక్రమాలు కొంచెం శ్రమ మీద నెరవేరతాయి. కళాకారులకు మంచి సమయం.

స్త్రీలకు—ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది నూతన విషయాలను తెల్సుకొంటారు. ప్రయాణాలోచనలు చేస్తారు

వృషభం అందరూ సలహాలు చెప్పేవారే కాని సహాయం చేసేవారు ఒక్కరూ ఉండరు వ్యాపారంలో మీ మంచితనాన్ని కొంతమంది వ్యక్తులు తమ స్వార్థానికి వాడుకొనడానికి ప్రయత్నిస్తారు వృత్తిలో పోటీవారితో యేర్పడిన పోటీ తగ్గుతుంది ఇదివరకు యేవో వ్యవహారాల చిక్కుల్లో ఉండిపోయిన డబ్బు యిప్పుడు చేతికి వస్తుంది సాహసముతో కూడిన వ్యవహారాలు వారాంతంలో ప్రోత్సాహకరంగా ఉంటాయి

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో అధికవ్యయం జరుగుతుంది సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి.

మిథునం: వారం ప్రారంభంలోనే వృత్తివ్యాపారాల్లో వ్యయ ప్రయాసలకు గురి కావలసి వస్తుంది కాని తరువాత అన్నివ్యవహారాల్లోను అనుకూలతను సాధించగలరు కొన్ని వ్యవహారాల్లో అధిక వ్యయం జరగడం వలన ఆర్థికంగా ఒత్తిడి వస్తుంది ఉద్యోగంలో ముఖ్యమైన నిర్ణయాలు వారం మధ్యలో చేయడం మంచిది ప్రయాణాలు కొంచెం శ్రమ మీద ఫలించగలవు కుటుంబ సంతోషం లభిస్తుంది

స్త్రీలకు—ఆరోగ్యం ప్రస్తుతం బాగా ఉన్నా, నిర్లక్ష్యం చేయడం తగదు దైవకార్యాలు నెరవేరతాయి

కర్కాటకం . ఈవారం శుభాశుభ మిశ్రమంగా ఉంటుంది ప్రయత్నించిన పనులకు ఆటంకాలురావడం అనుకోని వ్యవహారాలు నెరవేరడం వంటి సంఘటనలు జరుగుతాయి వృత్తిలో వారారంభంలో నూతనావకాశాలు లభిస్తాయి వ్యాపారంలో మీ పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది ప్రయాణాల్లో మీ తాలూకు వస్తువులు పోయే ప్రమాదం ఉంది. సాంఘిక కార్యక్రమాలకు అనుకోని మార్పులు వస్తాయి

స్త్రీలకు—కుటుంబ కార్యక్రమాలు ఒడుదుడుకులు లేకుండా నెరవేరతాయి వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

సింహం : కొన్ని వ్యవహారాల్లో మీ మంచితనమే మీకు యిబ్బందిని కల్గిస్తుంది వ్యాపారంలో మీ అంచనాలు సరియైనవని రుజువు కావడం వలన అధికాదాయంతోపాటు ఆత్మవిశ్వాసం కూడా లభిస్తుంది. వృత్తిలో పోటీవారి పోటీని యెదుర్కొని అనుకూలతను సాధించగలరు. సాహసముతో కూడిన వ్యవహారాలు కొంతవరకు లాభిస్తాయి. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది. వారాంతంలో చికాకులు యేర్పడతాయి

స్త్రీలకు—ఆరోగ్యం సంతృప్తికరంగా ఉంటుంది సాహిత్య కళారంగాల్లో మీ కృషి రాణించగలదు.

కన్య : వ్యాపారంలో యిదివరకు యేవో కారణాల వలన ఆగిపోయిన వ్యవహారాలను యిప్పుడు లాభదాయకంగా పూర్తి చేయగలరు. వృత్తిలో మీ కంటే పెద్దవారు కూడా మీ సహకారాన్ని కోరవలసి వస్తుంది ఆర్థికంగా మీ స్వంత వ్యవహారాలు బాగానే ఉన్నా, యితరుల నిమిత్తం శ్రమ పొందవలసి వస్తుంది ఉద్యోగంలో అనుకూల వాతావరణం యేర్పడుతుంది ఆరోగ్యం ప్రస్తుతం బాగా ఉన్నా శరీర శ్రమతో కూడిన కార్యక్రమాలు పనికిరావు

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో స్వల్పభేదాభిప్రాయాలు వస్తాయి. బంధువులకు సహాయం చేస్తారు.

తుల . వృత్తి వ్యాపారాల్లో వారం ప్రారంభంలోనే ఆందోళన కల్గించే పరిస్థితులు యేర్పడి తరువాత సర్దుకొంటాయి. వృత్తిలో మీ యెదుట పొగడుతూ చాటున దూషించే వ్యక్తులతో వ్యవహరించవలసి వస్తుంది సాహసముతో కూడిన వ్యవహారాల్లో యితరుల జోక్యం వలన నష్టం వస్తుంది ప్రయాణాలు కొంచెం శ్రమ మీద ఫలించగలవు కుటుంబ వ్యవహారాల్లో అధికవ్యయం జరుగుతుంది సజ్జన సాంగత్యం లభిస్తుంది

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది శుభకార్యాల విషయంలో మీ ప్రయత్నాలు ఫలించవచ్చును. పుణ్యకార్యాలు చేస్తారు.

వృశ్చికం : కొన్ని వ్యవహారాలు మీ అదుపు తప్పి ఊహించని పరిణామాలకు గురి కాగలవు వృత్తిలో మీ తాలూకు మనుష్యులే మిమ్మల్ని మోసం చేయగల ప్రమాదం ఉంది. భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాల్లో స్వల్పభేదాభిప్రాయాలు వస్తాయి దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది ఉద్యోగంలో మెప్పుకురాని కార్యభారాన్ని వహిస్తారు ఆందోళన కలుగుతుంది వారాంతంలో కొంచెం మంచి పరిస్థితులు యేర్పడతాయి.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి. సాంఘిక కార్యక్రమాలకు అనుకోని మార్పులు వస్తాయి.

ధనుస్సు : ప్రయత్నించిన ప్రతిపని తున్నట్టే కన్పిస్తుందిగాని ఫలితం మాత్రం చేతి అందదు వృత్తి రీత్యా చేసే ప్రయాణాలు శ్రమ మీద ఫలించగలవు ఆర్థిక వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి ఉద్యోగంలో వారాంతంలో చికాకులు యేర్పడవచ్చును. సాహిత్య కళారంగాల్లో మీ కృషి ప్రోత్సాహకరంగా ఉంటుంది కుటుంబ వ్యవహారాలు సంతృప్తికరంగా ఉంటాయి. మిత్రులకు సహాయం చేస్తారు.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు. పోటీవారితో గౌరవం బాగా ఉంటుంది

మకరం : వృత్తి వ్యాపారాల్లో మీరు అనుకొనేది ఒకటి జరిగేది మరొకటి కావచ్చును. వృత్తిలో మీకు నష్టం కలిగించడానికి యితరులు చేసే ప్రయత్నాలే మీకు లాభదాయకంగా మారగలవు. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు స్వల్పంగా లాభిస్తాయి ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది కోర్టు వ్యవహారాల్లో అనుకూలమైన మార్పులు వస్తాయి ఆరోగ్యం బాగా ఉంటుంది.

స్త్రీలకు—కుటుంబ కార్యక్రమాలు ఒడుదుడుకులు లేకుండా నెరవేరతాయి. విలాస వస్తువులు కొంటారు

కుంభం : ఇప్పుడు మీరు జరిపే వ్యవహారాలవల్ల తాత్కాలికమైన లాభమే కాకుండా ముమ్ముందు కూడా తగిన ఉపయోగం ఉంటుంది. అధికారుల వలన జరగవలసిన వ్యవహారల్లో యేర్పడిన ఆటంకాలు తొలగిపోతాయి రావలసిన డబ్బు సమయానికి అందకపోవడం వలన యిబ్బంది కలుగుతుంది సాంఘిక కార్యక్రమాల్లో ప్రయోజనంగల వ్యక్తులను కలుసుకొంటారు. కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది.

స్త్రీలకు—ఆరోగ్యం సంతృప్తికరంగా ఉంటుంది. ప్రయాణాలోచనలు చేస్తారు దైవకార్యాలు నెరవేరతాయి

మీనం వృత్తి వ్యాపారాల్లో మీ కార్యక్రమాలు బాగానే ఉంటాయి కాని కొన్ని వ్యవహారాల్లో మీరు మొగమాటాలకు లొంగిపోవడం వలన ప్రయోజనం లేని బాధ్యతను వహిస్తారు రావలసిన డబ్బు మీద ఆధారపడి నూతన వ్యాపారాలు ప్రారంభించడం తగదు ప్రయాణాలు ప్రయోజనకరంగా ఉంటాయి రాజకీయ వ్యవహారాల్లో అనుకూలమైన మార్పులు రగలవు ఆరోగ్యం ప్రస్తుతం బాగా ఉన్నా, నిర్లక్ష్యం చేయడం తగదు.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి విద్య వైజ్ఞానికరంగాల్లో మీ కృషి రాణిస్తుంది.

—మహేష్ ●

పొరపాటు

కోమలాదేవి

ఏరో(గాం—ఉత్తరం చూడగానే డా. అమర్‌నాథ్‌కు చాల సంతోషం వేసింది. తమ్ముడు రాసిన ఉత్తరమది. అన్నింటికన్నా ముందర తెరిచి చదివాడు.

చాలా క్లుప్తంగా వ్రాసిన లేఖ అది.

"—ఢిల్లీలో మేజర్ కృష్ణారావు గారని ఉన్నారు. వారమ్మాయిని ఇవ్వా మంటున్నారు. ఆ అమ్మాయిని చూచి మీకు అంతా నచ్చితే మీరు వచ్చేటప్పుడు మీతో తీసికొని రావలసినది. పెండ్లి రిజి(స్ట్రేషన్ ఇక్కడే కావాలి. కాబట్టి నేను అక్కడికి వచ్చి పెళ్ళాడి భార్యను తీసికొని రావటం కుదరదు.—అని మీకు తెలుసు. ఈ పరిస్థితుల్లో పెళ్ళి యిక్కడ జరగాలి—పిల్లను పంపాలి వారు—అమ్మాయికి కూడ ధైర్యం ఉండాలి. ఇవన్నీ చూసుకుని ఒక నిర్ధారణకు రావలసినది. అన్నయ్యా—నా అభిరుచులు, నా మనస్తత్వం, అన్నీ నీకు క్షుణ్ణంగా తెలుసు. ఆ అమ్మాయి నీకు నచ్చితే వెంటనే అన్ని ఏర్పాట్లు చెయ్యి— లేదా నచ్చలేదని నాకు తిరుగు టపాలో జాబు రాసెయ్యి......"

మిగతా వివరాలతో ముగించాడా ఉత్తరం. తమ్ముడు అరవిందనాథ్ అమెరికాలో ఇంజనీరింగ్‌లో డాక్టరేట్ చేస్తున్నాడు. వెళ్ళి రెండు సంవత్సరాలైంది. అక్కడే ఉండిపోవాలని కోర్కె.— నెల క్రితం పేపర్లో వేయించిన ప్రకటన తాలూకు ఉత్తరాలల్లో ఇదే మంచిదిగా తోచింది అరవింద్‌కు. దాదాపు పదిమంది రాశారు. వారితో మేజర్ కృష్ణగారి అమ్మాయి బాగా చదువుకున్న పిల్ల. కొన్ని సంవత్సరాలు విదేశాల్లో ఉండి వచ్చారట అందుకని ఆ అమ్మాయికి పై దేశంలో పెళ్ళాడి కాపురం చేయటం మరీ క్రొత్తగా అనిపించదు!

ఎం. ఏ. ఇంగ్లీషు (పెసిడెన్సీ కాలేజీ నించి పాసయింది. అంటే మరీ చిన్న పిల్ల కాదన్నమాట. ఆమె వ్యక్తిత్వం పరిపూర్ణత చెంది ఉండాలి. విదేశ జీవితానికి అలవాటు పడగల మనః ప్రవృత్తి కల్గి ఉంటుంది. అమర్ చాలసేపు ఆలోచిస్తూ కూచున్నాడు.

ఇదిగాని నెరవేరితే—తన బాధ్యతలన్నీ పూర్తిగ నెరవేరినట్లే. అలా కళ్ళు మూసుకుంటే గతం వర్తమానంలోకి వచ్చింది. పూర్వ స్మృతులు అలలు అలలుగా తరుముకొస్తున్నాయి.

తను అందరికన్నా పెద్దవాడు. తరువాత ఇద్దరు చెల్లెండ్రు, ఒక తమ్ముడు. తండ్రి స్కూల్లో మేష్టరుగ పనిచేసేవారు పెద్ద ఆస్తిపరులు గాకపోయినా ఒకరిని ఆశించకుండా గౌరవంగా గుట్టుగా బ్రతుకుతున్న కుటుంబమది. తను చాల తెలివి గలవాడు. అన్నింటిలో ఫస్టుమార్కులొచ్చేవి. ఇంటర్ పరీక్షలో యూనివర్సిటీ ఫస్ట్ వచ్చాడు. ఎం. బి. బి. ఎస్.లో ఇట్టే సీటు వచ్చింది. ఎలాగో సోలగ తండ్రి తనకు డబ్బు పంపుతుంటే ప్రతి సంవత్సరం విధిగా పాసవుతూ ఆరు సంవత్సరాలకి డాక్టర్ పట్టా అందుకున్నాడు.

అంతే. ఇంటికి రాగానే సంసార బాధ్యత నీ కొడుకుచేతి కప్పగించి ప్రాణం వదిలాడు తండ్రి.

ఆ వూళ్ళో పెద్ద డాక్టర్లు లేరు, వెంటనే ప్రాక్టీసు పెట్టాడు. తనకు మిగతా వాళ్లకు చాల సంవత్సరాలు తేడాఉంది. చెల్లెండ్రిద్దరు హైస్కూలు క్లాసుల్లో, చిన్నతమ్ముడు థర్డ్ ఫార్మ్‌లో ఉండేవారు.

అమర్ మితభాషి. మానవత్వం, ఇతడు తోబుట్టువులా అనిపించేటంత సాధు స్వభావం—రోగుల ఎడల జాలి, ప్రేమ—పెద్దల యెడల వినయ విధేయతలు కల్గిఉంటం మూలాన ఆ వూళ్ళో ప్రతి ఒక్కరికీ అతను ఆప్తుడయ్యాడు.

అతని మంచితనం—స్నేహం అతిగా గౌరవించి సాయపడినవాడు గోపాల్ ఇద్దరు కాలేజిలో బాలస్నేహితులు. కట్నం లేకుండా స్నేహితుని పెద్ద చెల్లి ఎస్. ఎస్. ఎల్. సి. పరీక్ష రాయగానే పెళ్లి చేసుకొని తీసుకెళ్ళిపోయాడు.

రెండో చెల్లి పెళ్ళి అంత సులభంగా అవ్వలేదు. ఆమెను బి. ఏ. వరకు చదివించాడు. కొంత అప్పుచేసి కట్నాలు, లాంఛనాలు, మర్యాదలు జరుపవలసి వచ్చింది.

అప్పుదీర్చి కాస్త వూపిరి నిలుపుకుందాం అనుకునేలోపల తమ్ముడు అరవింద్‌ను ఇంజనీరింగ్‌కు పంపవలసి వచ్చింది. తన ప్రాక్టీసు వేంకు వేలు తేకపోయినా ఈ బాధ్యతలకి ముందూ వెనకా ఆలోచించి నెరవ్వలసిన పరిస్థితులు కల్పించనంత సంపాదన ఉండేది

కాలచక్రం అవిరామంగా తిరుగుతోంది. అరవింద్ ఫస్టున ప్యాసయ్యాడు. అంతే —వెంటనే కెమికల్ ఇంజనీరింగ్‌లో పై చదువులు చదివి డాక్టరేట్‌కు గాను స్కాలర్‌షిప్ రాగా అమెరికా వెళ్లాడు.

అమర్‌కు ఇప్పుడు ముప్పైఆయిదో ఏడు. ఇంతవరకు తన పెళ్లి విషయం తలపెట్టినవాళ్లు లేకపోలేదు. తను గూడ ఆలోచించేవాడు. కానీ—ఎందుకో—వివాహం పట్ల పెద్ద విముఖత లేకపోయినా పెళ్లి తన ధర్మాన్ని విస్మరించేలా చేస్తుందేమో అని భయం. అందరికి దూరమవుతాడేమో !

పెద్ద చెల్లి విషయం తనకు ఏ చీకూ చింతా లేదు. గోపాల్ తను, బంధుత్వంతో కలిసిన స్నేహబంధం గాఢమైంది. ఒకరిపై ఒకరి కెనలేని గౌరవం, ప్రేమ. కాని రెండో చెల్లి సంసారం ప్రథమం నుంచీ ఒడుదుడుకులతో మొదలైంది. కోడరికం భరింపరానిదై పోయింది. ఆమె సంతోష

పెళ్ళి కోసం అమర్ ఎంతో ధనం వ్యయం చేయవలసి వచ్చింది. లాభం ఇసుమంతైనా లేకపోయింది. పిటీలో ఉమ్మడి సంసారం. లెక్చరర్‌గా మరిది తెచ్చే జీతం అందరికీ చాలదు. ఎప్పుడూ ఏవో గొడవలు. ఎన్నో విధాలుగా వేరే పెట్టించాలని చూచేడు చెల్లి ఆరోగ్యం చెడితే చివరికి ఇంటికి తెచ్చేశాడు. ఇద్దరు కొడుకు లామెకు. ఆరు నెలలకు ఆరోగ్యము పొందాక వచ్చి తీసుకెళ్ళమంటే విన్నరూ రాలేదు. అక్కడి పరిస్థితులను చూడటానికి వెళ్ళిన అమర్ బావమర్దిని తీసుకొచ్చేశాడు. అతని ఆరోగ్యం సరిలేదు. టి. బి. అని అనుమానమట. ఆ అనుమానం నిజమే అయింది. అప్పటికే ఆలస్యమైనట్లు అతను కొన్నాళ్ళకే ఈ లోకం నుంచి నిష్క్రమించాడు. అప్పటినించి వాళ్ళ భారం తనమీద పడింది.

పరిస్థితులు సానుకూలం కావటంలేదని గోపాల్ తన ప్రాక్టీస్ పెరగటంతో అమర్‌ను ఒప్పించి తీసికొని వెళ్ళాడు మెడ్రాస్‌లో గోపాల్, తండ్రితో, అమర్ వాళ్ తో నర్సింగ్‌హోం నడిపేవాడు ఆర్థికంగా అమర్ బాగుపడ్డాడు. తల్లి, చెల్లి ఇంటిపనులు చూసుకుంటుంటే, పిల్లలు బళ్ళోకి వెళ్తుంటే వాళ్ళని చూస్తూ చాల తృప్తి చెందేవాడు. అతన్ని గూర్చి ఎన్నో కథలు చెప్పుకునేవారు పెళ్ళాడమని తల్లి పోరుపెట్టని రోజు లేదు. అతను మాత్రం దురాలోచనతో కొంచెం లొంగినట్లే లొంగి వెంటనే విముఖత చూపేవాడు. అతనికి కాలేజీలో ఒకమ్మాయి పరిచయమైనట్లు, ఆమె మోసం చేసినట్లు, దాంతో విరక్తి చెంది పెళ్ళంటే అయిష్టమన్నట్లు చెప్పుకునేవాడు చనువుగా తిరిగే స్నేహితులు నిలదీసి అడిగితే నవ్వి వూరుకునేవాడు. ఏదేలా అనుకున్నా తనకే నష్టంలేదు. నమ్మితే మరీ మంచిది, పెళ్ళి పెత్తనాలు చేయకుండా ఉంటారు. నిజం ఇదని ఖచ్చితంగా ఔనూ అనలేదు—కాదనీ అనలేదు. కాబట్టి తేలిందేమిటంటే అతని జీవితంలో స్త్రీ వల్ల కొంత మానసికబాధఅనుభవించాడని.

మంచి రోజులు చూస్తున్నాడు. తమ్ముడి పెళ్ళి చేసేస్తే ఇక తనకే భారం వుండదు. అతని చదువు పూర్తయ్యేసరికి నాలుగైదు సంవత్సరాలు పట్టొచ్చు. తను కళ్ళను గూర్చి నిక్కువ ట్రైనింగ్ పొందటానికి అమెరికా వెళ్తున్నాడు ఇంకో నెల రోజులుంది. ఈలోగా ఎవరినో కుదుర్చుకుని తీసుకొని వెళ్ళాలి.

అమర్ మెడ్రాసులో అంతా సిద్ధం చేసుకున్నాడు. ఒకనాడు ఢిల్లీకి ప్రయాణమై వెళ్ళాడు మేజర్ కృష్ణ స్వయ



ముగా కారు తెచ్చారు ఎంతో ఆదరంగా ఆహ్వానించారు ఇంట్లో.

స్నానం, టిఫిన్ అయ్యాక అమర్, కృష్ణగారు చాలసేపు ముచ్చటించుకున్నారు దాదాపు పది గంటలకు అమ్మాయి శాంతిని పిల్చారు. ఆమె పొడవుగా, అందముగా ఉంది. ఎంతో నిండుగా హుందాగ కనిపించింది. ఆ కళ్ళలోని కాంతి, చేతల్లోని శాంతం చూడగానే తనకు తగిన మరదలనే నిర్ణయాన్ని కొచ్చేశాడు. ఆమె అలా సోఫాలో కూచుని స్వెట్టర్ అల్లుతోంది. అప్పుడప్పుడు మాత్రం తలెత్తి ఇద్దరికేసి చూచి తిరిగి తన పనిలో నిమగ్నమైపోయేది.

అమర్ తమను గూర్చి అంతా వివరంగా చెప్పాడు. చెప్పటంలో తను చాల త్యాగం చేసినట్లు, తండ్రి మరణానంతరం తను ఎంతగా అందర్నీ పైకి తెచ్చింది, చెల్లి విషయంలో ఎంత శ్రమపడింది చెప్పాడే గాని—అది ఎంతో సాధారణ విషయమైనట్లు అహం లేకుండా తన విషయం గొప్పగా చెప్పుకోలేదు అమ్మాయి తల్లిదండ్రులకివన్నీ అవసరమైన విషయాలే—వారు తెలుసుకోవలసినదే—ఆ భావంతోనే అతడు అన్నీ సమగ్రంగా చెప్పినట్లే ముఖ్య విషయాలన్నీ విశదీకరించేడు అతడు ఏక ధాటిగా చెప్పుకు పోతుంటే కృష్ణగారు ఏమీ ఆటంకపర్చలేదు

ఆమె మాత్రం చాల శ్రద్ధగా వింటూ కూచుంది.

అప్పుడప్పుడు ఆమెను పరీక్షగాచూడటానికి కష్టంగా తోచిందతడికి. తమ్ముడి ఫొటోలు టీపాయ్ మీద ఉంచాడు.

పౌరవాణి

“ఇది ఎస్. ఎస్. ఎల్. సి. లో ఉండగా తీసిన ఫోటో, ఇది ఇంజనీరింగ్ ఫస్ట్ ఇయర్‌లోది ఇది మూడో సంవత్సరంది. ఇది పాస్‌పోర్ట్‌కని తీసింది ఇది మొన్నటిది లేటెస్ట్. చూచీ చూడనట్లు చూస్తోంది. ఆ ఫోటో లుంచిన టీపాయ్ ఆమెకు దగ్గరగా జరిపాడు ఆమె కేవిధంగా యిబ్బందీ కల్గించకూడదన్న ఉద్దేశంతో కృష్ణగార్ని మాటల్లోకి దింపాడు

ఆ సాయంత్రం అతను ఒంటరిగా తోటలో కూచుని ఉన్నాడు. శాంతి వచ్చి దూరంగా కుర్చీలో కూచుంది.

“ఏ సబ్జక్ట్‌లో ఎం. ఏ. చేరారు ?” సూటిగా చూస్తూ అడిగాడు.

“ఇంగ్లీషు ”

“ఐతే మీరు ఫారిన్‌లో పి హెచ్‌డి చేయొచ్చు ఏమంటారు ”

ఆమె మవునం దాల్చింది. చాలసేపు ఆమె జవాబుకోసం నిరీక్షించాడు. లాభం లేకపోయింది.

అతను ఆత్రంగా కాస్త ముందుకు వంగాడు.

“చాల దీరంగా ఆలోచిస్తున్నారు మీకు మీకు వెళ్లటానికిష్టంలేదా ! దాపరికం లేకుండా చెప్పండి .... నా తమ్ముడు సుఖించాలని తాపత్రయపడటం వాస్తవం—కానీ, మీ కిష్టంలేకుండా, మీ తలిదండ్రుల ఇష్టంకొద్ది బలవంతంగా మీరు వెళ్ల నవసరంలేదు. మీ కయిష్టంగా ఉంటే చెప్పండి—నేనే ఏదో చెప్పి వెళ్లిపోతాను...... ”

ఆమె కళ్ళు వాల్చేసుకుంది. సుదీర్ఘంగా నిట్టూర్చి మెల్లగా అంది. “అవేం లేదు.. వెళ్లటానికి నాకే సంశయంలేదు . మీకన్నీ తెలుసు. ఇది కేవలం పుట్టింటిపై గల మమకారమే ”’

అతను హాయిగా నిశ్వసించి వెనక్కి అనుకున్నాడు.

“అక్కడికెళ్తే మీకు చాలా బాధ్యత లుంటాయి......”

ఏమి టన్నట్టు చూచింది.

“నా తమ్ముడు చిన్నవాడు—అంటే కష్టాలకు, బాధలకు, సమస్యలకు అతీతుడిగా పెరిగాడు. ఒకవిధమైన సరళ మార్గంలో పెరిగి పెద్దవాడయాడు. ఎప్పుడు డబ్బుకు లోటు లేకపోయినా— ఎక్కువ డబ్బు మనిషి కిచ్చే దురలవాట్లు అలవడనంతవరకు ఎంత డబ్బు అవసరమో అంతే ఉండేది. క్లిష్ట పరిస్థితుల నెదుర్కోగల ధైర్యం ఉందో లేదో చెప్పలేను. తెలివి ఉండొచ్చు, తగిన గుణగణాలుండొచ్చు కానీ సమీక్షా కారిత్వం ఉన్నదో లేదో తెలియదు మీ ఇద్దరు చిన్నవాళ్లు కాబట్టి ఎంతో ఓర్పు అవసరం. ఒకరినొకరు అర్థం చేసుకోక ముందే మీరు భార్యాభర్తలై పోతారు. అంతవరకు వెళ్లి తిరిగి రావటంలో ఎంతో అనర్థం ఉంది. అందుకని మీరు బాగా ఆలోచించాలి చాలా ధైర్యంతో దీనికి ఒప్పుకోవాలి. నా తమ్ముడు నాకు అత్యంత ప్రియుడు. అన్నీ మంచి గుణాలే అగుపిస్తాయి నాకు అతన్ని గూర్చి చెప్పవలసినదంతా చెప్పాను ఇక మీరే ఒక నిర్ణయానికి రావాలి.” అతను ఆమెవైపు ఉత్సుకతతో చూస్తుండిపోయాడు

కొన్ని క్షణాలు గడిచాయి. తన సుకుమారమైన వ్రేళ్లకు గడ్డిపోచలు చుట్టుకుంటూ కూచుందామె. మెల్లగా తన విశాల వినీల నయనాల నెత్తి అతడి కళ్లలోకి చూచి తన నిశ్చయాన్ని తెలియజేసింది.

“అలాగే కానివ్వండి చాల రోజుల నించి ఆలోచిస్తున్నాను ఎడ్వెంచరస్‌గా ఉండకపోతే జీవితం వ్యర్థమనిపిస్తుంది. నాకు వెళ్లటానికే అభ్యంతరంలేదు ... కానీ మీ తమ్ముడుగార్ని గురించి ఎన్నో విషయాలు తెలిసికోవాలనుంది. మీరు వారి జీవితాన్ని చెబితే సావధానంగా వింటాను. ఎటువంటి వ్యక్తో ఒక నిర్ణయాని కొస్తాను.”

అతని ముఖం ఆనందంతో విప్పారింది. ఆమెకేసి నిశ్చలంగా చూచాడు ఆమె చాల అందంగా కనిపించింది. ఆమె తెలివితేటలకి ఇంకా ఆనందించాడు.

తన తమ్ముడి జీవిత విశేషాల్ని, ఉత్ప్రేక్షించకుండా మామూలుగా చెప్పుకు పోయాడు. ఆమె కథ విన్నట్లు దీక్షగా వింటూ కూచుంది.

అతను ఢిల్లీకి రావటం అదే ప్రథమం. మేజర్ కృష్ణగారు కారును, డ్రైవర్‌ను అతని ఆధిపత్యంలో ఉంచారు. అతను రెండు రోజులు అన్నీ చూచాడు. ఒక రోజు ఆగ్రా వెళ్లి వచ్చాడు.

ఆఖరిరోజు కుతుబ్‌మినార్ చూడటానికి అమర్‌తోపాటు అందరూ పిక్‌నిక్‌లా బయలుదేరారు.

కారు నిండుగ కూచున్నారు.

సాయంత్రం నాల్గు గంటల వేళ.

అక్కడి తోటంతా రకరకాల పువ్వులతో శోభిల్లుతుంది. గడ్డిమీద కూచున్నారంతా శాంతి తమ్ముళ్లిద్దరూ, కొంత వరకు కుతుబ్‌ను ఎక్కి వచ్చారు.

ఆకాశానికి నిచ్చెనలా ఉన్న ఆ మీనారుని చూస్తూ చైతన్యరహితంగా నుంచుండిపోయాడతను. ఏవో అక్షరాలు—ఉర్దూనో— అరబ్బీనో— ఏదోతనకు తెలియదు !

శాంతి అతని దగ్గరగా వచ్చి నుంచుంది.

"ఇంత దగ్గరగా చూస్తే మెడలు పట్టుకు పోతున్నాయి."

"ఏమాలోచిస్తున్నారు ?" శాంతి తలెత్తి ఆ కట్టడాన్ని చూస్తోంది

"ఏముంది ఆలోచించటానికి ? ఎంత అందంగా, హుందాగా ఉంది! ఈ బయలు ప్రదేశంలో ఒంటరిగా, శతాబ్దాలుగా నిలబడి ఒకనాటి మానవుని అఖండశక్తిని అంతస్తులుగా చాటుతుంది !"

ఆమె దృష్టి మరల్చింది తమ్ముళ్లు పిలవటాని కొచ్చారు. ఆమె—అతడు అడుగు తీస్తున్నారు. . "ఈ కట్టడం కుతుబ్‌చే కట్టబడినది కాదని, రాజపుత్రులచే కట్టబడిన దానిని ముస్లింలు కొద్దిగా మార్చి కట్టారనీ, ఈ అక్షరాలన్నీ పీరు వ్రాయించినవనీ చెబుతారు ....."

"ఔను. చదివాను. రెడ్‌ఫోర్టు కూడ షాజహాన్ నిర్మితం కాదనటం—ఫతేపూర్ సిక్రీకూడ రాజపుత్రుల కేంద్ర స్థానాలంటూ పరిశోధించి వ్రాసిన వ్యాసాలు చదివాను గానీ .. . అవన్నీ ఒక ఎత్తు— కడకు తాజ్‌మహల్ కూడ మామూలు సమాధి అంటూ పేపర్లో చదవగానే ఎంతో ఇదనిపించింది సుమా !"

అంతలో వారు తల్లి తండ్రిని సమీపించారు ఏవో కబుర్లతో కాలక్షేపంజేసి ఇంటికి వెళ్లిపోయారు.

మరునటిరోజు తిరిగి మెడ్రాసుకు వెళ్లకముందు అమర్ ఒక ఉంగరం, చీర, రవికె తెచ్చి ఇచ్చాడు.

"ఇంకో వారం పోయాక మీరు మీ అమ్మాయిని తీసికొని రావాలి. అమ్మా వాళ్లు చూస్తారు ఆ తర్వాత మీరు పాస్‌పోర్టు వీసాలకు ప్రయత్నాలు మొదలెట్టండి.

అనుకున్న విధంగా, శాంతి, తండ్రితో పాటు మెడ్రాస్ చేరింది గోపాల్, అమర్‌లు స్టేషన్ కొచ్చారు.

వాళ్లు హోటల్‌లో ఉండటానికి నిశ్చయించుకున్నారు అమర్ ఎంతో నొచ్చుకున్నాడు కానీ తండ్రి ఏదో సర్ది చెప్పారు.

మేజర్ కృష్ణగారి ముఖం బాగా అలసి ఉంది ఏదో అవ్యక్తమైన బాధ, ఆందోళన వ్యక్తమవుతుంటే చూచినవాళ్లిద్దరికి అస్వాభావికంగా తోచలేదు. కూతుర్ని ఇక ఒకరి చేతిలో పెట్టాలి ఇంతటితో ఋణం తీరినట్లే—ఏం లాభం——ఎంత చేసి—ఎంత ప్రాణం పెట్టినా ఒకరి చేతిలో పెట్టవలసినదే !

మంచి హోటల్‌లో వాళ్లను దింపి— అన్ని సదుపాయాలు కల్పించి వెళ్లి పోయారు. శాంతి హృదయం శాంతికి దూరమైపోయింది. సాయంత్రం ఐదు గంటలకి అమర్ వచ్చాడు. శాంతి అతిగా అలంకరించుకోలేదు. సాధారణంగానే అగుపించింది. లక్నో ఎంబ్రాయిడరీ చేసిన తెల్ల ఫుల్ వాయిల్ చీర—నల్లని 'ముఖమల్' రవికె వేసుకుంది ఒంటిపేట ముత్యాలు కంఠాన్ని అలంకరిస్తున్నాయి నయాపైసా అంత బొట్టు ఆమె కంటిపాప తళుకుతో వెలవెల బోతోంది పైగా ఎత్తి ముడి వేసిన వెండ్రుకల మీదుగా కొంగు కప్పుకుని బైటి కొచ్చింది.


పరస్పరాభినందనల తర్వాత అంది "నాన్నగారు అలా వెళ్లారు ఆరు గంటల కొస్తారుట. వాళ్ల ఫ్రెండ్ రిటైర్డ్ కల్నల్ అడయార్‌లో ఉన్నారుట వెళ్లారు."

ఆమె దూరంగా ఉన్న కుర్చీలో కూచుని ఎటో చూస్తోంది.

అమర్ వేచివుండాలన్నట్లు సోఫాలో చేరగిలబడ్డాడు. ఏదో స్ఫురించింది. గబుక్కున లేచి నుంచున్నాడు.

"మీరు మెడ్రాసుకు రావటం ప్రథమం కాదుగా—"

ఆమె మెల్లగా తలాడించి మందహాసం చేసింది. "ఇక్కడే చదివాను. .."



అతను నిరాశ చెందాడు. "ఐతే చూడవలసిందేమీ లేదు. మీ రిక్కడే చదివారన్న విషయం మర్చిపోయాను సుమా."

ఆమె లేచి నుంచుంది. "చూడవలసినవేమీ లేవు గానీ—ఢిల్లీలో సముద్రం లేదు చూచి చాల రోజులైంది డాక్టర్"

"ఓ కె ఐతే అక్కడికే వెళ్దాం ఓ అర గంటకంతా వచ్చేస్తామని చెప్పి వెళ్దాం"

టాక్సీ తీసుకున్నారు ఆమె ఒంటరిగా వెనుకవైపు కూచుంది. బీచ్ దగ్గర దిగారు అప్పటికే బీచ్ నిండుగ జనం. ఆమె ముఖంలో చికాకు స్పష్టమైంది.

"నా కేదో గాభరాగా ఉంది . అలా మెరీనా కేంటీన్‌లోకి వెళ్దాం. పోనీ ఆ ప్రక్క ఎక్కువమంది లేరు. అలా ప్రశాంతంగా కాసేపు కూచుంటే ప్రాణానికి హాయనిపిస్తుంది డాక్టర్‌గారు"

అతను మవునంగా ముందు నడుస్తున్నాడు చాల దూరం నడిచారు అక్కడ రద్దీ తక్కువగా ఉంది. ఇద్దరు ప్రక్క ప్రక్కగా కాస్త దూరంగా కూచున్నారు.

ఎవ్వరూ ఏమీ మాట్లాడటంలేదు. ఆమె తదేకంగా పాలపొంగులాంటి నురగలు గ్రక్కుతున్న అలలకేసి చూస్తోంది. అతనే మాట్లాడాడు. "నాకు అశాంతిగా ఉంటే ఎలియట్స్ బీచికి వెళ్లి ఇలా ఒంటరిగా కూచుంటే అంతా పటాపంచలై మనసు నిర్మల మవుతుంది .."

ఆమె ఏదైనా మాట్లాడుతుం దనుకున్నాడు గానీ శాంతి ఇటు తిరిగి చూడనైనా చూడలేదు.

"చాల దీర్ఘంగా ఆలోచిస్తున్నారు .... ఆమెకేసి చూస్తూ అన్నాడు

ఆమె చటుక్కున అతనివైపు చూచింది. వాచివేపు చూచుకుని ఒక్క నిట్టూర్పు వదలింది.

"ఔను ... ఎప్పుడూ .. ఇలాగే ఇక్కడ కూచోవాలనిపిస్తుంది"

"నిజమే . . ఈ అనంత జలరాశిని చూస్తూంటే ఏదో సన్నిహితత్వం ఏర్పడుతుంది ...."

ఆమె నెమ్మదిగా తల త్రిప్పింది తల మీది ముడి మీదనించి కొంగు కొద్దిగ

పొరపాటు

జారింది అతి నెమ్మదిగా, ఉద్రేకంతో అంది "అది కాదు డాక్టర్‌గారూ . ఇలాగే ఇక్కడే మీ సాన్నిధ్యంలో కూచోవాలనిపిస్తోంది"

"శాంతీ— ఏమిటి మీరంటున్నది" అమర్ ఉద్రేకంతో బిగ్గరగా కలగబ అనేశాడు.

ఆమె రెండు చేతుల్లో ముఖం దాచుకుంది. బాణం సంధించి వదలింది. ఇక దాని సంగతి తనకు తెలీదు హృదయం అతి వేగంగా కొట్టుకుంటోంది మాటలు అన్నదే గాని, మరి మాటాడేందుకు ధైర్యం చాలటంలేదు.

"శాంతీ—మిమ్మల్ని నా తమ్ముడికోసం ఏర్పాటుచేసి మాటలు జరిపామని ముందు నించీ స్పష్టంగా మీకు తెలుసునుకదా —ఇలాంటి పొరపాటు .... పొరపాటు ." అతను తల పట్టుకుని కూచున్నాడు.

ఇదే సమయం—మాట్లాడాలి—హృదయము విప్పి చెప్పుకోవాలి. "పొరపాటు కాదు డాక్టర్‌గారూ ... మిమ్మల్ని చూచిన మరుక్షణంనించీ నాకు తెలియకుండానే మిమ్మల్ని ప్రేమించాను...."

"శాంతీ—చూడమ్మా—నువ్వు చిన్న. ." మధ్యలోనే ఖండించింది.

"నన్ను అమ్మా అనకండి ఈ క్షణంలో ఇలా మనసు విప్పి మాట్లాడగల్గుతున్నానంటే అది ఇన్నాళ్లుగా నేను పడిన ఆవేదన ఫలితమే మీరు అర్థం చేసుకోండి...... ఈక్షణంలోనే ఏమాటా చెప్పండి. మీచే తిరస్కరింపబడితే వెంటనే వెళ్లిపోతాను. ఏ సందర్భంలో కూడా నేను మీ తమ్ముడికి భార్యను కాలేను."

అమర్ స్థాణువై రెప్ప వాల్చకుండా చూస్తుండిపోయాడు తల పంకించి ఉద్రిక్తుడయ్యాడు "మీతండ్రిగార్కి, నాతమ్ముడికేం చెప్పను శాంతీ!—నా మాటలపై లక్ష్యముంచి నిన్ను తీసుకొచ్చారు. అక్కడ అరవింద్ ఎదురు చూస్తుంటాడు. ఇలాంటి పరిస్థితుల్లో నిన్ను నేను స్వీకరించటం న్యాయమంటావా ?" శాంతి ఇసుక ప్రోవు చేస్తూ—గోపురాల్ని పడగొడ్తోంది.

"నాన్నగార్కి రైల్లో చెప్పాను . చాలా సేపు వాదించుకున్నాము. ఇది ఎలా పరిణమిస్తుందో అని నాన్న ఎంతో ఆందోళన చెందుతున్నారు .. నా హృదయం విప్పి చెప్పాను. ఆ తర్వాత మీయిష్టం !" ఆమె సజల విశాల నయనాలను వాల్చేసుకుంది అమర్ ఇరకాటంలో పడిపోయాడు.

ఏదో ఒక విధంగా తప్పుకోవాలి "నాకు ముప్పైఆరు సంవత్సరాలు. నీకన్నా ఎంత పెద్దవాడినో చూడు శాంతీ— నా యవ్వన కాలం గతించి పోయింది ఏది చేసినా పెద్దవారి తరహాగ చేస్తాను. నాకు సరదాలు, సల్లాపాలు ఏమీ లేవు నాతో ఏం సుఖపడ్తావ్—ఏ సందర్భంలో కూడ నా తల్లిని, చెల్లిని, పిల్లల్ని వేరు చేయలేను. అరవింద్ అన్నింటికి తగినవాడు చిన్నవాడు. దాంపత్య జీవితంలో పొందవలసిన ఆనందము అతని సాహచర్యంతో లభించగలదు . .... నీ విషయం రాశాను ఎంతగానో ఎదురు చూస్తుండవచ్చు నన్ను నమ్ముకుని నా విచక్షణపై ఆధారపడిఉంటే చటుక్కున అంతా తారుమారు చెయ్యలేను . . నాకు చేతకాదు .. ఇలా జరిగిందని రాయలేను ...."

అమర్‌నాథ్ ఆమెవైపు ప్రాధేయపడుతున్నలా చూచాడు.

శాంతి కళ్లలో నీళ్లు తిరుగుతున్నై. చుట్టూ కొద్దిగ దూరంలో కూచున్న మనుష్యులు—భార్యాభర్తల పోట్లాటలో, తిరిగి కలవటమో—ఏమో అవి ఆసక్తిగా చూచీ చూడనట్లున్నారు

శాంతి కాళ్లు వత్తుకుంది హేండ్ బేగ్ తెరచి ఏరోగ్రామ్ ఉత్తరం అతడి కందిస్తూ "చదవండి" అంది.

ఆమె లేచి వెళ్లి అలలు పరుచుకని వస్తున్న తీరానికి వెళ్లి కూచుంది. ఆమె చీర కుచ్చిళ్లు నీళ్లలో తడుస్తున్నాయి. ఒక్కొక్క అల ఇంకాస్త పైకి వస్తుంటే ఆమె వెనక్కి జరిగి కూచుంది పాల మరుగులాంటి చీరను చూడలేక అన్నట్లు అలలపై నురుగు ఆమెను సమీపించక ముందే మాయమవుతున్నాయి. ఆమె నిశ్చ

లంగా కూచుని ఉంది.

అమర్ ఆతృతతో ఉత్తరం తెరిచాడు.

చూడగనే విస్తుపోయాడు.

అరవింద్—వదినా—అని సంబోధిస్తూ శాంతికి రాసిన లేఖ అతని ఆలోచనలు స్తంభించినై. అచంచలుడై పోయాడు. చాల చిన్న లేఖ.

"మీ లేఖను చూచి కొంతవరకు ఆశ్చర్యపడినమాట వాస్తవం మీచే అన్నయ్య ఆకర్షింపబడ్డారని తెలిసి నా కెంతో సంతోషము వేసింది అన్నయ్య ఒక ఇంటివాడు కావాలని మేమంతా ఎన్నాళ్లుగానో ఎదురు చూస్తున్నాము పెద్దలు లాభంలేదని వూరుకున్నారు మీ ప్రయత్నం సఫలం కావాలని—అన్నయ్య మిమ్మల్ని తప్పక తన అర్ధాంగిగా స్వీకరించవలెనని సర్వదా భగవంతుని ప్రార్థిస్తున్నాను.

అన్నయ్య చాలా మంచివాడు మిమ్మల్ని అర్థం చేసుకోగలడు.

భారతదేశం గొడ్డుపోలేదు నాకు తగిన అమ్మాయి ఎక్కడో ఉండకపోదు. ఈ విషయంలో నిశ్చింతగా ఉండండి కానీ వధువు అన్వేషణ మాత్రం మానకండి.

నాకు అతి త్వరలో ఏ కబురు తెలుపగలరు "

అతని చేతిలో కాగితం చల్లగాలికి రెపరెప లాడుతుంది

ఒక్కసారి కాదు—పదిసార్లు చదువుకున్నాడా లేఖ.

అతని హృదయంలోని అల్లకల్లోలాన్ని, సంశయాన్ని, బాధను, ఆవేదనను, కప్పి వేస్తున్నలా సముద్రం ఘోషిస్తూనే ఉంది .

ఆమె అతనికి వ్యవధి యిస్తున్నలా మవునం దాల్చింది

నిమిషాలు దొర్లిపోతున్నాయి

శాంతి వెనుదిరిగి చూచింది.

ఇంతటితో తన భవిష్యత్తు ఒక రూపాని కొస్తుంది ఏదో ఒకటి తేలిపోతుంది అంతటితో సరి !

అమర్ కాళ్లను చుట్టేసుకుని సముద్రం కేసి చూస్తున్నాడు.

"ఇక వెళ్దామా ? నాన్న ఎదురు చూస్తుంటారు " నిలబడే అడిగింది.

"శాంతి . ఇలా కూచో ...."

ఆమె కొద్ది దూరంలో కూచుంది.

"నాలో ఏం చూచి ప్రేమించావు శాంతి ... .ఎటూ తేల్చుకోలేక పోతున్నాను సుమా!" జాలి గొల్పుతున్న చూపులతో ఆమె నరి కట్టాడు.

"పరిపూర్ణ మానవత్వానికి, వ్యక్తిత్వానికి ఒక అర్థం కల్పించిన మీరు నా హృదయంలో చిరస్థాయిగా నిల్చిపోయారు .... "

ఆమె ముఖం ప్రక్కకు త్రిప్పుకుంది ఆ సంధ్య చీకట్లలో ఆమె ముఖ కవళికలు స్పష్టం కాలేదు కానీ స్వరం—లీలామాత్రంగా కంపించింది . "మీరు ....నా కోసం ఏ త్యాగం చేయ నవసరంలేదు డాక్టరుగారూ మనస్ఫూర్తిగా మీ కిష్టమైతేనే ఈ వివాహం జరుగుతుంది "

ఆమె లేచి నిలబడింది కొంగు నిండుగా కప్పుకుని,

"వెడదామా" అంది.

అమర్ నుంచున్నాడు. ఇద్దరు మెల్లగా నడుస్తూ రోడ్డెక్కారు

టాక్సీ వచ్చి ఆగింది ఆమె ఎక్కి కూచుంది అమర్ తలుపు చేతిలో పట్టుకుని ఈ షణ్మాత్రంగా తటపటాయించాడు ఆ ఒక్క క్షణం శాంతికి వెయ్యి యుగాలుగా అనిపించింది గుండె కొట్టుకోవటం ఆగిపోయినట్లే బాధపడింది .. కానీ అమర్ తలుపు బార్లగా తెరిచి ఎక్కి కూచున్నాడు

శాంతి కళ్లు మూసుకుని వెనక్కు చేరబడి దీర్ఘంగా, హాయిగా నిశ్వసించింది. ఆమె హస్తాన్ని తన చేతిలోకి తీసుకున్నాడు

"శాంతీ—" అని మృదువుగా పిల్చాడు

నక్షత్రాల్లా మెరుస్తున్న కన్నీళ్లతో అతనివేపు చూచింది

"నువ్వే గెల్చావు శాంతి . "

"ఇక ఎప్పటికీ మీరే గెలుస్తారుగా" అంది ఆవేశంతో.


"ఎన్నో విషయాలు ఆలోచించాలి...."

"ఎంతకాలం కావాలి?"

"బహు కొద్ది కాలమే . నిస్సహాయుడినై పోయాను త్వరగా పాయానికి రావాలి ."

టాక్సీ వేగంగా పోతూంది—చల్లగాలి, విద్యుద్దీపాల వరుసలు—ప్రక్కలో ప్రేయసి —అతని చేతిలో ఆమె చెయ్యి—ఆ క్షణం విలువలేనిది

అతని హృదయం ప్రశాంతమైంది.



చెల్లాయికి ప్రేమతో... 5

'పి. ఎస్.'

చెల్లీ,

ఈమధ్యన మాయింటికి చుట్టాలొచ్చి నందువలన నీకు లేఖ త్వరగా వ్రాయలేక పోయాను. చుట్టాలు వారం రోజులున్నారు. ఈవారం రోజులూ వూపిరి సలపలేదంటే నమ్ము. ఒకటే హడావుడి, ఒకటేపని, ఒకటేపని.

చుట్టాలకి నలుగురు పిల్లలు. అబ్బ అదేంపిల్లలు బాబూ! ఒకటేగోల! ఒకేఅల్లరి! ఆపిల్లలు రేడియోతిప్పడం, ఫ్యాన్ తిప్పడం, అవీఇవీ విరగ్గొట్టడం,వాళ్లఅమ్మ చూసీచూడ నట్లు ఊరుకోడం, వాళ్లు బాత్‌రూమ్‌లో జారిపడి 'లబో' మని ఏడవడం. చుట్టాలా, 'రాక్షసులా' అనికూడా అనిపించింది. ఇలా వ్రాస్తున్నానని ఏమీ అనుకోకేం. వాళ్ళు ఎక్కడో పెళ్లికివెళ్లి వస్తూ త్రోవలో మాఇంట్లో దిగారు. రాగానే స్నానం చేసి పెళ్లి బడలికచేత నిద్రపోయారు, కనుక ఆ పూటకి బ్రతికి పోయాను. ఇక చూసుకో, వాళ్లబడలిక తీరిందిగా, పిల్లలు, పెద్దలు ఇల్లంతా కలియ తిరగడంమొదలు పెట్టారు. ఆవిడ వాకిట్లో మొక్కలకి వున్న గులాబీపూలన్నీకోసింది. జాజిమొగ్గలు నరేసరి. పిల్లలు జాజిచెట్టు కొమ్మలు నగంవిరిచేశారు. కుర్చీలకున్న నైలాన్ వైర్లు బ్లేడుపెట్టి కోశారు. నేను ఏం చేసేది! వాళ్లని కోప్పడితే వాళ్లమ్మ ఏమను కుంటుందో! సరే, ఆవిడ మర్నాడు పెళ్లిలో మాసిన బట్టలన్నీ ఉతికేకార్యక్రమం మొదలు పెట్టింది. యాభై, అరవై బట్టలు. "సబ్బుపొడివుందా మీఇంట్లో!" అన్నది. కొత్తప్యాకెట్ సీలుతీసి యిచ్చాను మూడు గంటలసేపు ఆబట్టలన్నీ ఉతికిందావిడ, మధ్యమధ్యలో "టినోపాల్, వుందా? స్టార్చ్ వుందా" అని అడుగితే వున్నవన్నీ యిచ్చాను. ఇస్త్రీపెట్టె కూడా యిచ్చాను. నన్ను బట్టలు ఆరవేయమని కూడా పురమా యించిందావిడ. మడతలు పెట్టమనికూడా చెప్పింది. ఆసాయంత్రం సినిమాకివెళ్దాం అంది. సరేనని బయలుదేరాం ఆవిడదగ్గర పెద్ద హాండ్‌బ్యాగ్ ఒకటివుంది. దాంట్లో డబ్బుకూడా వుంది. ఆబ్యాగ్ తీసుకొచ్చిం దావిడ. నలుగురుపిల్లలు, పనిపిల్ల.రెండు రిక్షాలలో బయలుదేరాం. హాలుచాలా దూరం. ఒక్కొక్కరిక్షాకి రూపాయిఅడి గాడు రిక్షావాడు. రిక్షా దిగగానే ఆవిడ చిల్లర లేదంది. "అదేమిటబ్బాయ్ పదిరూపా యలకే చిల్లరలేదా?" అన్నది. నేను యిచ్చాను డబ్బు. టికెట్లు కూడా నేనే తీసుకొచ్చాను. ఆవిడ మర్యాదకైనా "నేను తెస్తాలెండి టికెట్లు" అనలేదు. వెళ్లి లోపలకూర్చున్న తరువాత పిల్లలు చిప్స్ కావాలనీ ఆరెంజ్ కావాలనీ, బిస్కెట్లు కావాలనీ ప్రతిదానికీ పేచీలే. ఆమె ప్రతిదానిదగ్గరా చిల్లర లేదనడం, ఆ డబ్బు నేనివ్వడం. ఇరవై రూపాయలు వదిలించు కునిఇంటికిచేరుకున్నాం. ఆవిడ పదిరూపా యలకాగితం మార్చనేలేదు. "అయ్యో పాపం, ఖర్చంతా మీరేపెట్టారు" అని మాత్రం ఒకసారిఅన్నది. నేను కష్టపడి నెలరోజులుగా దాచుకున్నఇరవై రూపాయలు అయిపోయాయి నేను కొనుక్కుందామను కున్న హాండ్‌లూంచీర నన్ను చూసి షోకే సులోనుంచి జాలిగానవ్వింది ఆమరునాడు సాయంత్రం ఏవో కొనాలని బజారుకి రమ్మంది. ఈసారి జాగ్రత్తగా వుండా లని నిశ్చయించుకుని నేనుకూడా చిల్లర తీసుకెళ్లలేదు. ఆవిడే యిచ్చింది ఏమను కుందో రిక్షాకి. పిల్లలు హోటల్‌లో ఐస్ క్రీం తినాలని పేచీ పెట్టారు అక్కడ ఆవిడ బిల్లుఎంతసేపటికీ తీసుకోదు ప్లేట్ లోవున్న బిల్లువైపే చూడదు నేనే ఇచ్చు కున్నాను. చుట్టాలువెళ్లాక మాకు యాభై రూపాయల అప్పూ, రెండురోజుల జ్వరమూ వచ్చాయి. ఇదంతా ఎందుకు వ్రాయాల్సి వచ్చిందీ అంటే అసలుమనం ఒకరి ఇంటికి వెళ్లినప్పుడు మనకువీలై నంతలో వాళ్లని యిబ్బంది పెట్ట కూడదు...... రాత్రి తొమ్మిది దాటితే ఏ వూరువెళ్లినాసరే, ముందు హోటల్లో భోజ నంచేసి తరువాత చుట్టాల యింటికివెడ తాం మేము. ఎందుకంటే, వాళ్లభోజ నాలు అప్పటికి పూర్తిఅయిపోయివుంటాయి. పక్కలు వేసుకుని పడుకోడానికి సిద్ధ మవుతూ వుంటారు మనం ఎంతవద్దని చెప్పినా భోజనం చేయందే పడుకో నివ్వరు అంచేత వాళ్లని యిబ్బంది పెట్టడం బావుండదని మేమలా చేస్తాం. మా ఇంటి కొచ్చేవారందర్నీ ఇలా చేయమని నేను చెప్పను కానీ, బంధువుల కష్టసుఖాలు కూడా కొంచెం ఆలోచించాలి. అసలు చుట్టాలకు వారం రోజులు భోజనం పెట్టడమంటేనే ఖర్చు ఎక్కువైనట్లు ఉంటుంది చుట్టాలు మనింటికి రోజూ రారు. ఎప్పుడోగాని రారు. వారికి వీలై నంత మర్యాద జరపాలని గృహిణి ఆత్రుత చూపుతుంది. ఈ ఆత్రుతను చుట్టాలు గ్రహించి సర్దుకు పోవడానికీ, కలసిమెలసి ఉండడానికీ ప్రయత్నించాలిగానీ, లోపా లను ఎత్తి చూపి దెప్పి పొడిచి హేళన చేయకూడదు ..... మామూలుగా రోజూ



వంటలో రెండు మూడు ఐటమ్స్‌తో సరి పుచ్చే గృహిణి అతిథులువస్తే ఇంకో రెండు ఐటమ్స్ ఎక్కువే చేస్తుంది. విసుగుతో కాదు, ఆప్యాయతతోనే చేస్తుంది. బంధు ప్రేమతోనే చేస్తుంది ఈ విషయాన్ని వాళ్ళు గ్రహించాలిగా. 'మనకోసం ఆవిడ సినిమాకి వచ్చారు. మనం ఎక్కువ మందివున్నాం. నెలాఖరులో ఆవిడ దగ్గర డబ్బు ఉందో, లేదో. మనమే ముందు ఐయులుదేరదీశాం. కనుక ఆవిడను ఖర్చు పెట్టనివ్వడం ధర్మంకాదు.' అనే విషయం వారికి తట్టాలి. ఇది చాలా సున్నితమైన విషయం. ఒక్క డబ్బు విషయంలోనే కాదు. పని విషయంలో కూడా చుట్టాలు గృహిణికి సాయం చేస్తే తప్పేమీలేదు. మనం 'చుట్టాలు' కదా అని ప్రీడాయింగ్ రూంలోనో పుస్తకం తీసుకుని కూర్చుని భోజనం వేళకి వంట యింట్లోకి వెళ్లడం ధర్మం కాదు. వంటి యింటి గడపలో పీట మీద కూర్చుని ఏ కబుర్లో చెబుతూ ఆమెకి కూర తరిగియిచ్చినా సంతోషి స్తుంది ఎక్కడికైనా వెళ్లినప్పుడు పిల్లల్ని మనం జాగ్రత్తగా చూస్తూ అల్లరి చెయ్య కుండా చెయ్యాలి అది ముందునుంచే వాళ్లకి నేర్పుకోవాలి. చిన్న చిన్న అలవాట్లు మర్యా దలు పిల్లలకి అతి చిన్నతనంనుంచి నేర్పడం అవసరం. పిల్లలకి నేర్పడమేకాదు. మనమూ నేర్చుకోవాలి. అదొక్కటేకాదు. మనం విల్లాగూ యింటికి వెడుతున్నాం. ఈలోపల ఖరీదైన పట్టు చీరెలు అవసరంలేదు. వాటిని చుట్టాలింట్లో ఉతకడం ప్రారం భించకపోతే ఇంటికి వెళ్లి చూసుకో వచ్చునుగా ఆసని? ఇలాంటి చిన్న చిన్న విషయాలు మనం ఆలోచించాలి మనం ఒకరి యింటికి వెళ్లి వారం రోజులు గడిపి తిరిగి వెడుతూన్నప్పుడు "వాళ్లు వెళ్లి పోయారు. వాళ్లున్నన్నిరోజులూ సరదాగా గడిచిపోయాయి. ఇంకొక వారం రోజులు వుంటే బాగుండేది చాలా కలుపుగోరు మనుష్యులు" అనుకునేలా మనం ప్రవ ర్తించాలిగానీ, "వెళ్లారుబాబూ, జిడ్డు మనుష్యులు" అనుకోరాదు. అలాగే మనింటి కొచ్చిన అతిథులు మనని గూర్చి "చాలా మర్యాదగా చూశారు" అనుకోవాలిగానీ "అదేం మనుషులుబాబూ, ఇలాంటివాళ్లని తెలిస్తే రావే రాము వీళ్లింటికి" అనుకునేలా ప్రవ ర్తించకూడదు.


పూర్వం బంధువు లొచ్చారంటే, ఇక మర్యాదలకీ, పెట్టుపోతలకీ, సారె చీరెలకీ అంతే ఉండేదికాదట. కాలం మారింది. రూపాయి విలువా మారింది కనుక ఈనాడు మనం లేని పోని మర్యాదలకిపోయి తలకి మించిన అప్పు చేయకుండా మనకున్నంత లోనే చుట్టాలని సంతోషపెట్టి పంపడం నేర్చుకోవాలి ఏమంటావ్. త్వరగా ఉత్తరం వ్రాస్తావుకదూ?

(సశేషం)

సీ
అక్క.

సీరియల్

కరుణా



కొండముది శ్రీరామచంద్రమూర్తి

జరిగిన కథ

జమదగ్ని భార్య కాదంబరి తన కుమారుడు ప్రసన్నతోబాటు విశ్వనాథంగారమ్మాయి కరుణను కూడా పెంచి పెద్దచేస్తుంది. పెద్దకుమారుడైన మన్మథను జమదగ్ని తమ్ముడు చలపతి పెంచుకుంటాడు. కరుణ — ప్రసన్నలకు వివాహమవుతుంది. కరుణ, మన్మథ, వీరభద్రం ఎం. ఏ. లో చేరటానికి వాల్తేరు వెళ్తారు. ప్రసన్న ఉద్యోగ ప్రయత్నం సఫలమవుతుంది. పెడదారిపట్టిన వీరభద్రాన్ని మార్చటానికి మన్మథ చేసిన ప్రయత్నం విఫలమవుతుంది. సింహాద్రి అవకాశం కోసం ఎదురు చూస్తుంటాడు. పరిస్థితుల ప్రభావానికి లోనై నాటకంలో మన్మథతో నటించడానికి ఒప్పుకున్న కరుణకు ప్రసన్న వాల్తేరు వస్తున్నట్లు రాసిన ఉత్తరం కలవరపాటును కలిగిస్తుంది. మన్మథతో తను నటించలేనని చెప్తుంది కరుణ. మన్మథ దగ్గరికి వచ్చిన ప్రసన్న అతని ప్రవర్తన చూసి విస్తుపోతాడు.

26

"ఊండెడ్ సోల్జర్‌లా ఉన్నాడు. అందుకనే అంతబాగా నటిస్తున్నాడు." ప్రేక్షకుల్లో అభినందనలు, వ్యంగ్యాత్మకమైన ప్రశంసలు అతనిమీద వర్షంలా పడుతున్నాయి. కానీ, ఇంతటి ప్రేక్షకార్భాటమూ, రజని అహల్యగా రంగస్థలంపైకి రావడంతో తగ్గిపోయింది. ఇంద్రుడు గౌతమునిగా వేషం వేసుకోడం, అంతకుముందు రాత్రి మూడవజాము దాటిన సూచనగా కుక్కుటంలా అరవడం—ఆ విశేషాలు మంచి పట్టుగా నడిచాయి.

గౌతమ మహర్షి అహల్యతో, నదికేగి తాను స్నానంచేసి వస్తానని బయలుదేరి వెళ్లిపోతాడు, ప్రాతఃకాల నిత్య విధులకూ, దేవతార్చనకూ సమయం మించి పోతున్నదన్న తొందరలో. అదే సమయం చూసుకుని గౌతముని వేషంలో ఇంద్రుడు లోపలికి ప్రవేశించడం భార్యతో సురత క్రీడాభిలాష నెరిగించడం, ఆ జడదారి మన్మథావస్థ నెరిగి అహల్య అబ్బురపడి, మారాజ వెరచి, తనువు నతని కప్పగించడం—

ఈ దృశ్యం, అక్కడ మూగిన సైన్సు కాంగ్రెసు ప్రతినిధులనూ, విశ్వవిద్యాలయ అధికారులనూ, అతిథులనూ, అందరనూ పులకింపజేసింది. అనంగీకారమైన విషయాన్ని అంగీకారమైన పద్ధతిలో చూపించడంతో, దృశ్యాన్ని రక్తికట్టించడంలో, సంభాషణలు విరచించడంలో ఆ నాటక రచయిత అనన్య సామాన్యమైన ప్రతిభ కనబరచ జేశాడు.

కరుణ తనను తానే మరచి, తనకు సర్వమూ ఇదివరకే అవగతమైనప్పటికీ, ఆ దృశ్యాన్ని చూడసాగింది. నిజమైన గౌతమ మునీంద్రుడు నది నుండి ఇంటి కరుదెంచి, వేషధారియైన ఇంద్రుని, ధర్మభ్రష్ట అయిన భార్యనూ గమనిస్తారు. ప్రసన్న తన సమస్తమైన అంపటిమనూ, భౌతిక విషయాలనూ మరచి ఇంద్రుని మధ్యా, గౌతమ మునీంద్రుల మధ్యా జరుగుతున్న సంవాదమును వింటున్నాడు.

"హరి పిచ్చివాడా ! ఆ సంవాదము నేమి వింటావు ? నీ కళత్రము చేసిన కళంకాన్ని చూడలేక అంధుడవై, అహల్యా కళంకాన్ని గమనిస్తావెందుకు ?" అని సన్నసన్నగా తన చెవి దగ్గరగా ఎవరో అన్నట్లయింది.

"ఎవరది ? తనను వెంటాడుతున్నదెవరిది ?" అన్న భయంతో, అనుమానంతో వెనుకకు తిరిగి చూశాడు. అందరూ ఏకాగ్రచిత్తంతో నాటకాన్ని చిత్తగిస్తున్నారు.

మళ్లీ ఒక స్వరం. "భయపడతావెందుకు ? అనుమానం నీ కెందుకు ? మే మెవరో తెలియజెపుతాం. ఈ నాటకశాల వెనకాల ఉన్న జీడిమామిడి చెట్టు దగ్గరకు రా."

గుసగుసలుగా ఉన్నాయి ఆ మాటలు, గాజుముక్కలు గచ్చు నేలపై బడి సవ్వడి చేసినట్లు. ప్రసన్న ఆందోళనా మనస్కుడైనాడు. కరుణవైపు చూశాడు. ఆమె అమాయికంగా ఆ నాటకం చూడడంలో నిమగ్నమై ఉంది. ఆమె కళంకి ? ఊహూఁ, అతనికి నమ్మకం కుదరలేదు. కాకపోతే ఆ అపరిచితులు తనను హెచ్చరించవలసిన అవసరం ?

తాను భీరువుకాదు. అగ్నిపర్వతం స్రవించే లావాలో నయినా ఈదవలసి వస్తే ఈదగలడు. ఆ సమయంలో కులం, సభ్యత, సంస్కారం, సంప్రదాయం తనకు అడ్డురావు. విశాఖకు వచ్చినప్పటినుంచీ, తన నేదో పొగమబ్బు క్రమ్ముతున్నది. కరుణను గురించిన రహస్యం తెలుసుకోమంటున్నది. ఈ రహస్య వ్యాపారంతో మన్మథకూ చేయి ఉన్నట్లే అనిపిస్తున్నది. ప్రసన్న లేచి నిలబడ్డాడు. కరుణ తన ఏకాగ్రతకు భంగమై "ఎక్కడికి ?"

అన్నది అతని చేయి పట్టుకొంటూ.

"ఇప్పుడే వస్తాను." అతను వెళ్ళి పోయాడు. కరుణ వెనక్కు గుంజినట్లయింది. అతని చొక్కా అంచు, ఆమె కుర్చీ మడతల్లో చిక్కుకొంది.

"తొందరగా రండి. నాకు తెలిసిన అమ్మాయి శ్రీరాముడి వేషం వేస్తోంది. అన్నిటికన్నా శావ విమోచన ఘట్టమే బావుంటుంది."

ప్రసన్న మాట్లాడకుండా, జనాన్ని తప్పించుకొంటూ బయటకు వచ్చాడు. రంగస్థలంమీది పాటలూ, పద్యాలూ అంత దూరం వరకూ వినబడుతున్నాయి. బయటకు వెళ్ళబోతూ, వెనక్కి తిరిగి చూశాడు. ఎర్స్కిన్ స్క్వేర్‌లో వేల కొద్ది పట్టున్నారు జనం. అతను చుట్టూ తిరిగి స్టేజీ వెనుకనున్న పెద్ద రోడ్డుమీదకు వచ్చాడు. డిసెంబరు మాసపు చలి ఎముకల శక్తిని పరీక్షిస్తోంది. జరుగుతున్న వ్యవహారం అతని అంతరంగాన్ని శోధిస్తోంది.


జీడిమామిడి చెట్టు నీడలో ఎవరూ కనబడలేదు 'తన నొక వెర్రివాణ్ని చేయగలందులకు గాను ఎవరైనా పన్నిన కుట్ర గాదుగదా ఇది' అనుకొన్నాడు 'అయితే వూరు గాని వూళ్ళో తనమీద కక్ష చూపించేది ఎవరు ? ఏ కారణాన్ని పురస్కరించుకొని?' అని తనను తనే ప్రశ్నించుకొని, సమాధానం రాక వూరుకొన్నాడు.

ఇంతలో చెట్టు చాటు నుంచి సింహాద్రి అప్పలస్వామి బయటకు వచ్చాడు. అతని కళ్ళు తాగిన వాడి కళ్ళలా ఎర్రగా ఉన్నాయి అతను ప్రసన్న వరకూ వచ్చి, అనుమానం నివృత్తి చేసుకోవడం కోసం అన్నట్లు, "మీ పేరు ప్రసన్న అవునా ?" అన్నాడు.

"అవును" ప్రసన్న గుండె వేగంగా కొట్టుకుంటోంది

సింహాద్రి తన చెయ్యి ముందుకు జాపాడు. "నేను మీ స్నేహితుణ్ని ! మీరు గుండె ధైర్యం కల మనుష్యులని, కొన్ని కొత్త విషయాలు మీకు చెబుదామను కొంటున్నాను. ఏదీ షేక్‌హ్యాండ్ ఇలా ఇయ్యండి, మన స్నేహానికి చిహ్నంగా, నేను చెప్పే మాటల్ని విని బాధపడనన్నదానికి చిహ్నంగా !"

ప్రసన్న యాంత్రికంగా చెయ్యి ముందుకు జాపాడు. షేక్ హ్యాండ్ ఇచ్చి, అతని చెయ్యి తన చేతిలో ఉండగానే అన్నాడు. "నాకు ప్రాణంకన్న ఎక్కువైన స్త్రీకి మీరు కళంకం ఆపాదిస్తున్నారు. రజాపువర్చుకుంటే మీతోపాటు నేనూ.



లేదూ, నా దుష్టత్వమే మీరు చవి చూస్తారు."

"వెరీగుడ్ ! ఆ మాత్రం మగసిరి ఉంది కదా ? మాకూ అది కావలసింది బ్రదర్! నేను చెప్పవలసిన మాట ఒకటే ! మీరు పెళ్లి చేసుకున్న కరుణ అనే ఆవిడ ప్రవర్తన ఇక్కడ ఏమీ బాగాలేదు. మీ అన్నగారైన మన్మథతోటి అక్రమ సంబంధం కల్గి ఉంది."

ప్రసన్న, సింహాద్రి చొక్కా పట్టుకున్నాడు. "కల్గి ఉంది. సరే. అయితే ఆ విషయంలో నీ కేమిటి అంత ఆసక్తి ?" అతని మొహంలోకి రక్తం గూడుకట్టడం ఆ గ్రుడ్డి వెన్నెల్లోనూ స్పష్టంగా కన్పిస్తోంది.

"నేను మన్మథకు స్నేహితుణ్ని ! వయానా అతనికి చెప్పాను. మొట్టమొదట కరుణే అతని భార్య అనుకొన్నాను. కానీ కరుణకు పెళ్లయిందని తెలిసింది. కరుణ అంటే ఎందుకనో అంతరాళాల్లో నాకు జాలి. అభిమానం ! చిన్నప్పుడు నాకో చెల్లెలుండేది. ఆ అమ్మాయి పెద్దదైతే కరుణలాగానే ఉండేది నా చెల్లెలు చేసిన ప్రవర్తనను నేను సహించగలనా

మరి ? మన్మథను ఒకరోజు కోపంవచ్చి, ఇది నీకు తగదంటూ కొట్టాను నన్నే కొట్టి, గదిలోంచి తరిమేశాడు అప్పటి నుంచి కరుణకు అయినవాళ్లు ఎవరైనా తవబడతారా అని వేయి కళ్లతో ఎదురు చూస్తూ వచ్చాను.

"నేనే అయినవాణ్ణని నీకెట్లా తెలుసు?"

సింహాద్రి బిగ్గరగా నవ్వాడు. "మీకూ మన్మథకూ పోలికలున్నాయి. మీరు కరుణ ప్రక్కనే కూచున్నారు. మన్మథ లోగడ నాకు చెప్పిన ప్రకారం మీరే ప్రసన్న అయి ఉంటా రనుకొన్నాను. అందుకనే మిమ్మల్ని చూడగానే, "మీరు ప్రసన్నేనా?" అని అడిగింది.

ప్రసన్న తనలో తను అనుకొంటున్న ట్టుగా అన్నాడు. "ఉహూ, నాకు నమ్మకం కాలడం లేదు. కరుణ అటువంటిది కాదు." ప్రసన్న కళ్లల్లో నీళ్లు, వెన్నెల పడి మెరుస్తున్నాయి. రోడ్డు, వెన్నెట్లో నరకానికి మార్గంగా నల్లగా ఉంది

సింహాద్రి స్వతంత్రంగా ప్రసన్న బుజాల మీద చేతులు వేశాడు "బావగారూ ! కరుణ నాకు చెల్లెలయితే మీరు నాకు బావగారి వరుస. మిమ్మల్ని బాధపెట్టి నేను బాగుపడే దేవిటి ? అనవసరంగా వో ఆడ దానిమీద అభాండాలు వేస్తే ఆ ఉసురు వూరికే పోదు. అందుకనే సాక్ష్యాలతో వహ్ వచ్చాను.

"ఏవీ ?" ప్రసన్నఆత్రుతగా అడిగాడు.

"న్రిదపోతున్నా అవి నా వెంటే ఉన్నాయి. ఇవిగో చూడండి" సింహాద్రి అప్పలస్వామి లాగూ జేబుల్లోంచి మూడు ఫోటోలు తీసి చూపించాడు. మొదటి ఫోటో ఆర్ట్స్ కాలేజీలో మెట్లదగ్గర మన్మథతో కరుణ నుంచున్న పద్ధతిని చూపిస్తున్నది. కరుణ కళ్లు ఏవిటో మన్మథకు చెబుతున్నాయి. మన్మథ కరుణ మీదకు వంగినట్లుగా ఉన్నాడు. రెండో ఫోటో, జీడిమామిడి తోటలో మన్మథతో కరుణ మాట్లాడుతుండగా తీసింది. ఇద్దరి చేతులూ కలిసి ఉన్నాయి. ఇద్దరి కళ్లూ కలుసుకున్నాయి. ఇద్దరి పెదవులూ విడి

కరుణ

విడి ఉన్నాయి. మూడవ ఫోటో రంగ స్థలంమీద రిహార్సల్స్‌లో ఉండగా తీసింది. మన్మథ, కరుణ మీదకు వంగిపోయాడు. ముద్దు పెట్టుకుంటున్నట్టుగా ఉన్నాడు. 'అహల్యా!' అంటున్నాయి ఆ పెదవులు.

ఒక ఫోటో తరువాయిగా మరో ఫోటోగా మూడు ఫోటోలూ చూసి, కళ్లు జేవురించగా, "ఇప్పుడు నేను నమ్ముతున్నాను." అన్నాడు ప్రసన్న. అని ఆ మూడు ఫోటోలనూ చొక్కా జేబులో పెట్టుకో బోయాడు. "కులట. ద్రోహి ! నమ్మిన వ్యక్తిని మోసం చేయడం ఒక్క ఆడదానికే చేత నవుతుంది. ఛీ! ఛీ! ఛీ! ప్రాణాధికంగా ప్రేమించాను. తనను పంపించాను చదువుకు, నేను చదువు మానుకొని! లేదు. ఈ లోకంలో నీతి లేదు. న్యాయం లేదు. ధర్మంలేదు. మనిషిని మనిషి మోసం చేయడం ఒక్కటే మనకు తెలిసిన విషయం !"

ప్రసన్న చివాలున వెనక్కు తిరిగి వెళ్లిపోబోయాడు. ఆడిటోరియంలోంచి చప్పట్లు వినబడుతున్నాయి. జనం హాడా విడి లైట్లు వెలిగాయి.

వెళ్లిపోబోతున్న ప్రసన్నను ఆపి, "క్షమించండి ఈ విషయం వూరికే చెప్పడంలో నాకు ధార్మికబుద్ధి ఉన్నప్పటికీ, ఈ ఫోటోలను మాత్రం వూరికే ఇవ్వలేను. మన్మథకు తగిన పాఠం చెప్పాలి. వాటిని ఇట్లా ఇవ్వండి." అన్నాడు చేయి జాపుతూ సింహాద్రి.

"వాడికి తగిన పాఠం నేను చెబుతాను," ప్రసన్న దృఢంగా అన్నాడు.

సింహాద్రి ఆ ఫోటోలను అతని చేతి లోంచి తీసుకోటానికి ప్రయత్నిస్తూ "మీరు తీసుకోలేరు. మీకు ఆవేశం ఎక్కువ" అన్నాడు.

"మెత్తని పులిని అవుతాను. వాళ్లను చిత్రహింసకు పాల్పడజేస్తాను." ప్రసన్న ఆ ఫోటోలకోసం చేయి జాపాడు.

సింహాద్రి అతని ఆత్రుత గ్రహించి జాలిపడ్తున్నట్లుగా "సరే ! మీకే ఇస్తాను ఆ ఫోటోలు ! నేను పడ్డ శ్రమకు ప్రతిఫలం పడేయండి" అన్నాడు.

"ఎంత కావాలి !"

"మీరు సంతోషంగా ఎంతిస్తే అంత !"

ప్రసన్న జేబులో చేయి పెట్టాడు. వంద రూపాయల కాయితం చేతికి తగిలింది. విసురుగా దాన్ని తీసి, సింహాద్రి మీద పడేస్తూ, "టేక్ ఇట్" అని, ఆ ఫోటోలు తీసుకుని, మెట్లు దిగి ఆడిటోరియం వేపుకు వెళ్లిపోయాడు.

అతను అటు వెళ్లడం చూసి, అంత వరకూ చెట్టు చాటున దాగిఉండి, అవస్త పడుతున్న వీరభద్రం బయటకు వచ్చాడు. అతన్ని చూడగానే, ఉత్సాహంతో సింహాద్రి మొహమంత చేసుకొని "చాలా థ్యాంక్స్ బదర్ ! మన ప్లాన్ వండర్‌ఫుల్‌గా నెరవేరింది. మన్మథ పని ఆటకట్టు. తల తెగి పడుతుంది." అన్నాడు.

"మన్మథ సరే ! ఆ కరుణ సంగతే నాకు చాలా జాలిగా ఉంది." అన్నాడు వీరభద్రం సాలోచనగా.

"బదర్ ! ఏనుగులు ఏనుగులే ఎగిరి పోతుంటే, వెధవ దోమల గురించి అంత బాధపడతా వెందుకూ ?—అయినా దానికి మాత్రం అంత గర్వ మెందుకూ ?— ఎప్పుడూ ఆ రజనిని వెనకేసుకురావడం. ఈ శాస్తి కావలసిందేలే !"

వీరభద్రంలో విచారం తగ్గలేదు. "ఏమో ! ఇట్లా చెయ్యమని నీకు నేను చెప్పకుండా ఉంటే బావుండేది "

సింహాద్రి, వీరభద్రాన్ని ముందుకు లాక్కుపోయాడు. "చైనీస్ హోటల్‌కు వెళ్లి కాస్త పులావ్ తిని, ఆ తర్వాత కాస్మాపాలిటన్ క్లబ్బుకు వెళ్లి వో డ్రింక్ పుచ్చుకొని, 'చల్ నా రాజా' అంటూ ఏ మెరక వీధిలో వెళ్తే ! ఈ జ్ఞాపకాలే ఉండవు. పద పద." వీరభద్రానికి, సింహాద్రిని గుడ్డిగా అనుసరించక తప్పలేదు, అతని అంతరాత్మ మాత్రం మూలగడం మానలేదు. ఆ మూలగడం వినబడకుండా నవ్వని కూనిరాగ మొకటి పాడడం మొదలెట్టాడు వీరభద్రం, విశాఖవేపుగా పడుస్తూ.

* * *



హాకీ ఆటనాడే రాజుకు వెన్నునొప్పి
ఈ రోజు మధ్యాహ్నం హాకీ మ్యాచ్ వుంది. కాని నేను అదే స్థితిలో లేను. నా వెన్ను నొప్పిగావుంది.
ఒక సారిడన్ వేసుకో. వెంటనే నొప్పి తగ్గుతుంది చూడు!
రాజు ఒక సారిడన్ వేసుకొనును
తరువాత...
నా వెన్ను నొప్పి మాయమైంది. సారిడన్ ఎంత అద్భుతమైంది!
ఒకే ఒక సారిడన్
'రోష్'
నొప్పిని పోగొట్టును, సేదదేర్చును, నవోత్సాహమును కలిగించును
నొప్పికి ఉపశమనకారిగా ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సారిడన్ నొప్పులనుండి త్వరితముగా, నిరపాయముగా, నిశ్చయముగా ఉపశమనం కలిగిస్తుంది. తలనొప్పి, పంటినొప్పి, ఒళ్ళునొప్పులు, మామూలు అస్వస్థతలు మొదలైనవాటి నివారణకు ఎల్లప్పుడూ సారిడన్ వాడండి. ఒక బిళ్ళ పూర్తి మోతాదు. పిల్లలకు ¼ నుంచి ½ బిళ్ళ వరకు వెయ్యవచ్చును.
Saridon
ఒకే ఒక సారిడన్ బిళ్ళ చాలును
'రోష్' తయారు
ఏకైక డిస్ట్రిబ్యూటర్లు:
వాల్లాస్ లిమిటెడ్

VT. 3337 (Rev)

కరుణ

మన్మథ, చలపతిని వెంటబెట్టుకుని విశాఖ పట్నమంతా చూపిస్తున్నాడు. హార్బర్, సింధియా కంపెనీ, కాల్టెక్స్ ఆయిల్ రిఫైనరీ, ప్రేమాశ్రమం, రామకృష్ణ మఠం, హిందూ లైబ్రరీ, ఆంగ్లోఇండియన్ కాలనీ, అప్‌లాండ్స్ అన్నీ చూపించి "ఇక్కడ ప్రకృతి, తన సౌందర్యాన్ని చూసి తాను మురిసిపోతున్నట్టుంది తన సహజ సంపదను చూసి తాను గర్విస్తున్న ట్టుంటుంది. తనను గురించి తానూ ఆలోచించుకొంటూ, ధ్యానిగా, అభిసారికగా, దేవదాసిగా, వయ్యారపు నడక నేర్చిన ఆధునిక యువతిలా, వివిధ కాలాల్లోనూ దర్శన మిసు ంటుంది" అన్నాడు.

ఇద్దరూ ఆ సాయంకాలం బీచి దగ్గర, ముంతకింద పప్పు కొనుక్కొని తింటూ, మాట్లాడుకొంటున్నారు. చలపతికి, అంత వరకూ ప్రసన్న కనిపించక పోవడంతో, భార్యా ధ్యానంలో పడి తమను మర్చిపోయాడని, తమను వదిలిపెట్టాడని ఎంతో మురిసిపోయేడు ఇహ తన మన్మథ తనకు మిగిలాడు ! మన్మథకు, ప్రసన్న ఒకేవొక సారి కనిపించాడు దూరంగా, పిచ్చిపట్టిన వాడిలాగా రోడ్డుమీద తను బస్సులో పోతూ చూశాడు. పిలుద్దా మనుకొన్నాడు, జనుల కోలాహలంలో తన మాట తమ్ముడికి వినిపించలేదు తను, పోనీ బస్సు దిగుదా మనుకొన్నాడు, జనసందోహంలో మళ్లీ తమ్ముడు కనిపించలేదు. వాడు తనకు దూరమై పోయినట్లే భ్రాంతి కల్గుతోంది.

ఇద్దరూ ఆ మాటా ఈ మాటా మాట్లాడుకొంటున్నా, వాళ్ల అంత రంగాలు రెండు విరుద్ధ ప్రపంచాల్లో కొట్టుమిట్టాడుతున్నవి రెండు వింత శక్తుల ఆకర్షణల క్రింద నలిగిపోతున్నవి.

బీచీలో రకరకాల మనుష్యులు. రంగు రంగుల చీరలు. తండ్రులు—కొడుకులు, వయసు కనిపించనీయని తల్లులు, యవ్వనాన్ని ఎరువుపుచ్చుకొన్న పిల్లలు అంతా సందడిగా ఉంది మన్మథకు మెడ దండడిగా ఉంది.

కొంతసేపటినుంచి చలపతి అటువేపే తదేకంగా చూస్తున్నాడు మన్మథకు చిన్నతనం వేసింది ఆమె ఏమైనా అనుకొంటుందేమో అనుకొన్నాడు. ఆమెకు నలభై_య్యేళ్లు ఉంటాయి. జార్జెట్ చీర కట్టుకొంది మొహాన బొట్టులేదు చేతులకు మట్టిగాజులు బిదరికం అనుభవిస్తున్నట్టుగా ఉంది బీదరికాన్ని ఇతరులకు తెలియకుండా తనలో దాచుకొన్నట్టుగా ఉంది ఆమె కూడా చలపతివైపు తదేకంగా చూస్తున్నది

ఏదో జ్ఞాపకాల వలయం అనుభూతుల సాలెగూడు ఆమె ప్రక్కనే ఉన్న, ఇరవై ఏళ్లూ దాటిన పడుచు. ఆ తల్లి కుదుపుతూ అడుగుతోంది. "అట్లా చూస్తున్నా వేమిటే ? ఆయన తెలుసా నీకు ?"

చలపతి అదాటున లేచి నుంచున్నాడు సముద్రపుటల ఒకటి ఒడ్డుకు కొట్టుకు వచ్చి విరిగి పడిపోయింది తెల్లని నురుగు ఇసుకలో పీతలు పరుగులెడుతున్నాయి

"ఏమిటి నాన్నారూ ! ఆవిడ మీకు తెలుసునా ?"

చలపతి కంఠం వణికింది "నేను అనుకొంటున్న ఆవిడే అయితే, ఆవిడ కన్నా, మంహాళ్ళు, మంహాళ్ళు నాకు దగ్గరవాళ్లు ఉండరు "

ఆమె అతనికి అభిముఖంగా నడిచింది ఆ నడకలో తొట్రుపాటు. ఆయన ఆమెకు అబిముఖంగా నడిచాడు ఆ నడకలో తొందరపాటు

ఇద్దరూ ఒకరినొకరు సమీపించుకొన్నారు ఒకరి కన్నీరు వకర్ని సరిగా చూడనియలేదు "కాత్యాయనీ !" అన్నాడు గద్గదికంగా చలపతి "బాబుగారూ!" అంటూ ఆయన చేతుల్లో వొరిగి పోయింది కాత్యాయిని ఒకరి కన్నీరు నొకరు తుడుచుకున్నారు ఒకరి స్పర్శ నొకరు అనుభవించారు ఒకరి మనసు నొకరు తెలుసుకున్నారు "కాత్యాయనీ— ఇన్నాళ్లకా నువ్వు నాకు కనిపించడం ? ఏం తప్పు చేశానని నన్ను నువ్వు వదలి పెట్టి ఆ అర్ధరాత్రి అట్లా వెళ్లి

కరుణ

పోయావ్ !—చెప్పు—నీకు నేనేం తక్కువ చేశాను ?"

మన్మథకు ఆవిడ ఎవరో తెలిసింది ప్రక్కన ఉన్న ఆ పడుచుపిల్ల ఎవరో తెలిసింది.

"చెల్లీ !" అంటూ ప్రేమతో ఆ అమ్మాయివైపు చూశాడు చూసి కొయ్యబారిపోయాడు.

ఆ అమ్మాయి తన తల్లి అనుభూతిని పంచుకొంటూ ఉన్న కారణంగా, అంత వరకూ మన్మథనూ చూడలేదు. "చెల్లీ !" అన్న సంబోధన విన్న తర్వాత, తలఎత్తి చూసి, "నువ్వా ?" అన్నది భయంతో వణికింది మన్మథకు నిలువునా కోపం వచ్చింది

ఆపిల్ల కళ్లతోనే నమస్కారం చేసింది "పడుపు వృత్తిలోనే బ్రతుకుతున్నాను కానీ మనిషిని నేను! నన్ను, ఇన్నాళ్టికి కలుసుకున్న నా తండ్రి దగ్గర అవమానం చేయకు" అన్న ప్రార్థన ఆ కళ్లల్లో ఉంది

చలపతి అడిగిన ప్రశ్నకు కాత్యాయిని నుదురు బాదుకొంది "అంతా ఖర్మ, ఖర్మ!" అన్నది

దుఃఖపుటల కొంత తగ్గిన తర్వాత, "ఇటూవే—దగ్గరికి !" అంటూ ఆ అమ్మాయిని దగ్గరకు పిల్చి, "ఆనాడు ఇది కడుపున ఉండగానే మీ ఇంట్లో నుంచి, నన్ను మా నాన్న అనబడే ఆ పెద్దపులి, మరో చోటికి లేవదీసుకు పోయాడు చూడండి- మీ అమ్మాయిని చూడండి. కమలని చూడండి !" అంటూ కమల చేతులను ఆయన చేతులకు అందించింది

చలపతి ఆ ఆనందపారవశ్యానికి తట్టుకోలేక పోతున్నాడు అంతటి అదృష్టానికి అతలాకుతల మవుతున్నాడు. "నా తల్లే ఇది! కమలా దీని పేరు !! రూపానికి తగ్గట్టే ఉంది ! ఏం తల్లీ— నువ్వయినా మీ అమ్మకు చెప్పకపోయినావ్, నాన్న దగ్గరకు పోదామని" అంటూ, అది జనులు తిరిగే వీధి అని అయినా చూడకుండా ఆ ఇరవై ఏళ్ల యువతిని హృదయానికి గాఢంగా హత్తుకున్నాడు. అక్కడ ఉన్న జనానికి ఇవేమీ పట్టినట్లు లేదు. ఎవరి బాధలు వారివి ! ఎవరి బ్రతుకులు వారివి ! ఈ తండ్రీ కూతుండ్ర విషయం ఎవరికి పట్టింది ?

"ఇంటికి పోదాం రండి "

కాత్యాయిని లేచి, చలపతి చేయి పట్టుకుని నడవడం ప్రారంభించింది మన్మథకు అనుసరించాలో వద్దో ధర్మసందేహం కలిగింది వెనుకనే నిలబడిపోయాడు అతన్ని చూసి, కమల కూడా అతని ప్రక్కనే నిలబడిపోయింది రోడ్డుమీద పోతున్న జనం, అందంగా ఉన్న వాళ్లిద్దర్నీ మరో విధంగా అనుకొని తమ దారిన తాము చక్కా పోయారు

చలపతి వెనక్కు చూసి, మన్మథ రాకపోవడం గమనించి, "రా రా! మా పిన్ని !" అన్నాడు అని "కాత్యాయనీ ! చెప్పడం మర్చిపోయాను వీడు జమదగ్ని కొడుకు. నా దగ్గరే ఉంటున్నాడు " అన్నాడు

"రా ! నాన్నా ! సాంప్రదాయం ఉన్న కుటుంబీకుడివి నువ్వు ! చెడిపోయినవాళ్ల ఇల్లు ఎట్లా ఉంటుందో చూద్దు గాని రా!" అన్నది, అతని సంశయాన్ని గుర్తించి, ఆదరంగా, కాతరకంఠంతో.

"అమ్మ చెబుతుండగా విన్నాను జమదగ్ని గారంటే పెదనాన్నగారు కదూ ? అయితే నువ్వు నాకు అన్నయ్యవన్నమాట ! నన్ను క్షమించి, మా ఇంటికి రా అన్నయ్యా !"

కమల కంఠంలోని వేడికోలు మన్మథను కదిలించలేదు చలపతి ముందు నడుస్తున్నాడు. కాత్యాయిని ఆయనను పూర్తిగా వశపర్చుకొన్నట్లుంది ఆయనను అనుసరించక తప్పలేదు మన్మథకు

ఇంటికి చేరుకొన్న తర్వాత, ఎటు కాని సమయంలో కాఫీ తెప్పించింది కాత్యాయిని. "ఎందుకు నాకీ మర్యాదలు ?" అంటున్నాడు చలపతి.

"చేసిన పాపాన్ని సరిదిద్దుకోడానికి" అంటున్నది కాత్యాయిని

"దానికి అది కాదు మార్గం. నన్ను మళ్లీ వంటరివాణ్ణి చేసి ఏ అర్ధరాత్రో పారిపోకుండా ఉండడమే !" ఇన్నాళ్లకు

చలపతి మొహంలో వో వింత కళ కన్పిస్తోంది

“మా నాన్న అనబడే ఆయన చచ్చిపోయాడు ఇంక నేను వెళ్దామన్నా తీసుకు వెళ్లేవాళ్ళు లేరు”


వాళ్లిద్దరి సంభాషణకు, మన్మథ, కమల చెవులప్పగించిన బొమ్మలే అయేరు.

“అసలు ఎందుకు వెళ్లావ్ ? ఎక్కడకు వెళ్లావ్ ?” అని అడిగాడు చలపతి అతనికి ఆ యింట్లో స్వర్గధామంలో ఉన్నట్లుంది. ఆ ఇంట్లో ఆధునిక అలంకరణ ఏమీలేదు ఖరీదైన వస్తువులు లేవు. చేతగాని చిత్రకారుడు గీసిన మధ్యతరగతి కొంపలా, బోసిగా ఉన్నది.

కాత్యాయిని కొంగు మెడచుట్టూ తిప్పుకుని, పెడగాళ్ళ వేసుకుని చెప్పడం ప్రారంభించింది.

“నన్ను మీరు అసహ్యించుకున్నా సరే నా కథను మీకు చెప్పకుండా ఉండలేను. అలా చెప్పడమే చేసిన పాపాన్ని కొంత తగ్గించుకోవడం అవుతుందేమో ! నాకు ఏ ఆరు వివాహాలో అయాయి ఆశ్చర్యపడకండి. నాలుగు వివాహాల్లో ఆ భర్తతో మొదటి రాత్రి గడపకుండానే, ఆ ఇంట్లో ఉన్న డబ్బు దస్కం తస్కరించి పారిపోయాను, నాన్న అని పిలవబడుతున్న ఆయన బలవంతంచేత. నాకు తల్లిదండ్రులు ఎవరో తెలీదు. ఆ నాన్నకు, నాకు పెళ్లి చేయడమే ఒక పెద్ద వ్యాపారం ఆ వ్యాపారంలోనే, మీ దగ్గరకు కూడా వచ్చాను అదృష్టవశాత్తు కొన్ని నెలలైనా మీతో కాపురం చేశాను కడుపులో కమల ఉండగానే మళ్లీ నాకు ఇష్టం లేకపోయినా పారిపోయాను దొంగగా. పారిపోయిన కొద్ది రోజులకే ఆ ‘నాన్న’, వో యాక్సిడెంట్‌లో చచ్చిపోయాడు. అప్పటికి కమలకు నాలుగేళ్లు మళ్లీ ఈ వూళ్లో వో హోటలు ప్రొప్రయిటర్ను ఆశ్రయించాను అన్నం కోసం, బ్రతకడం కోసం, ఛీ! ఛీ! ఏం బ్రతుకు లిప్పి! ఈ జీవితం వో చెత్త కాయితాల బుట్ట. నలుగురూ సరదాగా నడిచిపోయే మెరిసే తివాచీ. ఆ హోటలాయన నన్ను కాపాడాడు. నా కూతుర్ని.”

“వ్యాపారంలోకి దించాడు.” మన్మథ మాట పూర్తిచేసి, “నాన్నగారూ ! ఇదీ వీళ్ల కథ ! వెళ్లిపోదాం రండి. ఎన్ని సంవత్సరాల క్రితమో తెగిపోయిన సంబంధం ఇది! వెళ్లిపోదాం రండి !” అన్నాడు లేచి నుంచుంటూ. కమల, అతనికి అడ్డుబడింది. ఏడుస్తూ అన్నది “నా అన్నవాళ్ళు లేని బ్రతుకు ! ప్రేమలు పంచుకోవడం ఎరగని బ్రతుకు ! ఈ బ్రతుకు భారాన్ని ఒకరు పంచుకున్నట్లయితే మేం దగాపడ్డ చెల్లెళ్లం ఎందుకయ్యేవాళ్లం ? కనీసం నే నెందుకయేదాన్ని ?—ఇదంతా మీ తప్పు? మళ్లీ యిప్పుడు నన్ను వంటరిదాన్ని చేయకండి. క్షణం క్రితం కొండంత ధైర్యంతో ఆనందశిఖరం ఎక్కాను. అధఃపాతాళానికి తోయకండి. అందరిలాగా నాకూ నాన్న ఉన్నాడు. అందరు బంధువులూ ఉన్నారు. ఏం నాన్నా ! మాట్లాడవేం ?—నన్ను నువ్వు వంటరిదాన్ని చేస్తావా ? చెప్పు?”



చలపతి ఆమెను సముదాయిస్తున్నట్టుగా అన్నాడు. “లేదమ్మా ! నిన్ను వంటరిదాన్ని చెయ్యను ! నీ బ్రతుకుకు ఒక మార్గం చూపిస్తాను. అధైర్యపడకు. అంతేకదు కాత్యాయినీ !” కాత్యాయిని నవ్వింది సముద్రం విరిగిపడ్డ నవ్వు. ఆకాశం పువ్వులు రాల్చిన నవ్వు. “నాన్నా! దేవుడివి నాన్నా !” అంటూ కమల ఆయన కాళ్లమీద పడిపోయింది.

“అయితే నేను వెళ్తున్నాను నాన్నగారూ!” మన్మథ ముందుకు అడుగులేశాడు.


చలపతి జీవితసత్యం తెలుసుకుంటున్నవాడిలా, తెల్సుకుని అంటున్న వాడిలా అన్నాడు. “మన్మథా ! ఇది రక్తసంబంధం! తెంచుకుంటే పోయేదికాదు తప్పులు చేస్తే తెగేది కాదు. నీకు నేను అన్యాయం చెయ్యను ! ఆస్తిలో నీకూ వాటా యిస్తాను నిన్నూ కన్నకొడుకు క్రిందే చూసుకుంటాను. దాన్ని మాత్రం వద్దనకు ఇన్ని సంవత్సరాలుగా నన్ను దహించిన ఆశ యిప్పుడు నెరవేరుతోంది. దీన్ని తుంపడానికి ప్రయత్నం చేయకు.”

మన్మథ ఆ మాటలన్నీ నిశ్చలంగా విన్నాడు “అవును బాబాయ్ ! రక్తసంబంధం తెగదు తెగిందనుకొని, నేనే పొరపాటుపడి మీ అండ చేరాను. నీకు నీవాళ్ళు దొరికారు. నే నక్కరలేదు ఇహ ! నాకు మీ ఆస్తీ అక్కరలేదు. వస్తాను” అంటూ బయటకు వెళ్ళిపోయాడు.

“మన్మథా ! మన్మథా!” అంటూ అక్కడినుండి లేవకుండానే చలపతి పిలుస్తున్నాడు. “అన్నయ్యా !” అంటూ కమల అరుస్తూ గుమ్మం దగ్గరకు పరుగెత్తింది మన్మథ ఆగలేదు. ఆ మాటలకు అతన్ని ఆపగల శక్తి లేదు

(సశేషం)

ఆధునిక పారిశుధ్య సాధనాల తయారీ



కొలిమిలోనుంచి తయారయి వస్తున్న శానిటరీ వేర్....

(ఇటీవలే శ్రీ వి. ఎస్. నైపాల్ రాసిన 'ఏన్ ఏరియా ఆఫ్ డార్క్‌నెస్' ఇక్కడ పెద్ద సంచలనమే కలిగించింది. రచయితకి మన దేశంలో బహిరంగంగా జరిగే మల మూత్ర విసర్జన పద్ధతులు మరీ కష్టం కలిగించాయి! ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్య పట్నాలలో ఒకటయిన విజయవాడకి వెళ్లినవారికి అన్నిటికన్నా కంటికి కొట్టవచ్చేట్లు కనిపించేది ఇదే. ఈ పత్రికలో కొన్ని సంవత్సరాల క్రితం శ్రీ చింతలపాటి వెంకటసుబ్బయ్యగారు విజయవాడలో వెనిస్ నగరంలో లాగే కాలవలు కన్నా ఇదే బాధ కలిగిస్తుందని రాసినట్లు జ్ఞాపకం. పారిశుధ్యం (శానిటేషన్), మురుగు పారుదల(డ్రెయినేజి) ఆధునిక జీవితంలో, అందులోనూ సామాజిక జీవితంలో మన వ్యక్తి, దేహానికీ కూడా ఆరోగ్యకరమయినదని వేరే చెప్పనవసరంలేదు. మనది చాలా బీదదేశం కాబట్టి వాటికి సంబంధించిన పథకాలు అమలులోకి తీసుకురావటం తేలికకాదు. అయినప్పటికీ ఈ విషయానికి సంబంధించిన ఒక ముఖ్య పరిశ్రమని గురించి పాఠకులకి వ్రాసి తెలియ చేయటమూ ఒక రకమయిన సేవ అన్నా అతిశయోక్తి లేదేమో అనిపిస్తుంది.)

దక్షిణ భారతదేశంలో శేషశాయి బ్రదర్స్ ఒక పెద్ద వాణిజ్యసంస్థ. ఈ సంస్థ పశ్చిమ జర్మనీలోని 'కెరామాగ్' సంస్థవారి సాంకేతిక సహాయంతో 'పారిశుధ్య సాధనాలు' (శానిటరీ వేర్) తయారీకి పూనుకుని 'నెయివేలీ సెరామిక్స్ ఎండ్ రిఫ్రాక్టరీస్ లిమిటెడ్' అనే పరిశ్రమని నెలకొల్పింది. ఈ పరిశ్రమ పెట్టుబడి మొత్తం కోటి రూపాయలు. ఇందులో ఎల్. ఐ. సి., ఇండస్ట్రియల్ క్రెడిట్ ఎండ్ ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్‌వంటి ఆర్థిక సంస్థలు రూ. 50 లక్షలదాకా పెట్టుబడి పెట్టాయి.

ఈ కంపెనీలోని యంత్ర సామగ్రి అంతా ప. జర్మనీనుంచి దిగుమతి చెయ్యటమేకాక ఇక్కడి ఇంజనీర్లని 'కెరామాగ్' కర్మాగారాలలో తర్ఫీదుకి పంపించారు.

నెయివేలీ ప్రాజెక్టు చాలా పెద్దదని అందరికీ తెలుసు. ఈ ప్రాజక్టు త్రవ్వకంలో 'చైనా' మట్టి చాలా మిగులుతుంది. పారిశుధ్య సాధనాల తయారీకి ఈ మట్టి ఉపయోగపడుతుంది. కనుక పై కంపెనీవారు తమ ఫాక్టరీని నైవేలీ దగ్గరే ఉన్న వడలూర్‌లో పెట్టారు. ఇందులో సుమారు రెండు వేలమంది కార్మికులు పని చేస్తారు.


ఈ 'శానిటరీ వేర్' ఎన్నో రంగుల్లో వస్తుంది. మంచి ప్రజాదరణని అందుకుంది. కాని వీరిని కొన్ని క్లిష్టమయిన సమస్యలు ఎదుర్కొంటున్నాయి. ఒకటి 'రవాణా సమస్య.' ఈ పారిశుధ్య సాధనాలు ఉత్తర దేశంలోనే ఎక్కువగా అమ్ముడు పోతాయి కాబట్టి అక్కడికి పంపాలి. గాజు సామాను ఎంతో భద్రంగా తీసుకుపోకపోతే విరిగిపోతూ ఉంటుంది! రెండవది, ముడి పదార్థాలు. వీటిని తయారు చేసే ముడి పదార్థాలు ఉత్తరప్రాంతం



నైసర్ కెరామాగ్
అధిపతి శ్రీ కృష్ణమూర్తి

నుంచే రావాలి. రవాణా కర్చులు అధికం అవటం, అక్కడి సంస్థలతో పోటీని మరింత కష్టం చేస్తాయి. ఇంకా ఇతర సమస్యలు ఉన్నాయి.

ఆధునిక జీవిత సౌకర్యాలని ఈ ప్రాంతంలో ప్రోత్సహించటానికి ఇంత ప్రయత్నిస్తున్న నెయివేలీ సెరామిక్స్, ఎండ్ రిఫ్రాక్టరీస్‌వారు అన్ని విధాలా ప్రశంసనీయులు. ప్రయోజనమేకాక అందానికీ వీరు ప్రాధాన్యం ఇస్తున్నారు. నాణ్యం సంగతి చెప్పనే అక్కరలేదు.



ఫాక్టరీ దృశ్యం


ఇంట్లో ఉతికినది
సర్ఫ్‌తో
ఉతికినది
Surf
AMAZING BLUE POWDER
FOR THE WHITEST WASH!

పరిషత్తులూ - పోటీలూ

"కావ్యేషు నాటకం రమ్యం" అన్నారు పెద్దలు. కళాకోవిదులు దాన్ని చాక్షుషమైన క్రతువుగా సత్వరజస్తమో గుణాత్మక ప్రకృతి ప్రతిబింబిక విశిష్ట ప్రక్రియాత్మక శక్తిగా ఆరాధించారు ఈ భావంతోనే మహారాజులు, జమీందారులు—నట గాయకాదుల పంక్తి బాహ్యతను సంపాదించుకున్నా—వారిని పోషించి ఆదరించారు నవరసాత్మకమైన ఈ సర్వ కళా సంసృష్టి సర్వ జనాదరణీయమైందంటే ఆశ్చర్యపడాల్సిన పనిలేదు

కాని, కాలం మారింది కాని కాలం వచ్చింది కాల పురుషుని కర్కశ పాద ఘట్టనలో ఆనాటి రాజ్యాలు, జమిందారీలు కలల్లా కరగిపోయాయి అలాంటి కల—కల్లల మధ్య కళాకారుల అంబర చుంబితాశాసౌధాలు అధః పాతాళంలో అణిగి పోయాయి

అణిగిపోయిన కళాకారులను, ఆరిపోయిన కళాభిరుచిని తమ అభిమానమనే ఔషధంతో పునస్సంజీవనం చేస్తానని ముందడు గేస్తున్నది ఈ ప్రజాస్వామిక యుగం ప్రజలే ప్రభుత్వమనే ఈ జగం అందుకే ప్రజలు పరిషత్తులుగా ఏర్పడి కళోద్ధరణానికి కంకణం కట్టుకుంటున్నారు

కాని, ఈ పరిషత్తుల శ్రమ అంతా ఎక్కడో పోసిన పన్నీరా అనిపిస్తున్నది ఈనాటి నాటకాల ప్రమాణాలుచూస్తే, ఒక ఏటి సంస్థలలో ఉన్న ఉన్నత ప్రమాణాలు మరుఏట మాయమవుతున్నాయి 'నాటికి తీసికట్టు నాగంభట్లు' అన్న స్థితిలోనే ఉన్నాయి పరిషత్తుల పోటీలకు వస్తున్న నాటకాలు

ఈ విషయాన్ని ఇటీవల తిరుపతి శ్రీ వేంకటేశ్వర నాట్య కళాపరిషత్తు జరిపిన పోటీలు బాగా ఋజువు చేశాయి.

సాధారణంగా దశ దినోత్సవంగా జరిగే ఈ కార్యకలాపాలను నిర్వాహకులు ఈయేడు ఐదు రోజులకే పరిమితం చేయగా నాటకాలు కూడా చాలా నిరుత్సాహం జనకంగా ఉన్నాయి ఇందులో చాలా నాటకాలు అనుసరణలో, అనుకరణలోతప్ప, రచయిత స్వీయ ప్రతిభకు నిదర్శనాలుగా నిలిచి మనసును మచ్చిక చేసుకోగలవి ఏ ఒకటో రెండో

ప్రథమ బహుమతి నాటకం "అపరాజిత" అన్ని విధాల నామసార్థక్యం సంపాదించగా, ద్వితీయ బహుమతి నాటకం 'శిరోమణి' ఉత్తమ నటనకే గాక, రచయితకు సమాజంపైగల ఆక్రోశానికి కూడా 'శిరోమణి' అనిపించుకుంది రచనలో మనవి అనిపించే మాటల మధ్య మనవికాని భావాలు, విజ్రుంభించి కన్పిస్తాయి ముందడుగు సర్వదా అభినంద్యమే బినా సమాజం, సంప్రదాయం, శాసనం అనే వాటికి కనీసపు విలువ లేకుండా జరిగే రచనా వ్యాసంగం, ఎంత సహేతుకమైనా సమాజంలో దుష్ఫలితాన్నిచ్చే ప్రమాదం ఉంది కళ వాస్తవం కాదు వాస్తవికతా భాసకమైన ఒక విభ్రాంతి మాత్రమే. రచయిత ఇది గమనిస్తే మంచిది.

బహుమతి సంగతి ఎలా ఉన్నా, రచనలో కొంత సొగసు, వినూత్నత కల్గిన బిగువైన నాటకం రత్నగిరి రచన 'కీలు బొమ్మలు'

ఇంక నాటికలు ఏవో బహుమతులను సంపాదించుకున్నా పోటీ స్థాయిలో రాదగ్గ నాటికలు రాలేదనే చెప్పాలి

విద్యా సంస్థలకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని కల్పించటం ఈ యేటి పోటీలలో ఒక ప్రత్యేకత

ఏక పాత్రాభినయం విషయంలో చెప్పదగిన అభివృద్ధి ఏమిటంటే పేర్లిచ్చినవాళ్ళలో సగానికి పైగా పోటీకి రాకపోవటం నాటకరంగంకు దీనివల్ల ప్రయోజనం కూడా స్పష్ట, స్పష్టంగానే కన్పిస్తున్నది ఇదీ పోటీ నాటికల స్థితి!

అసలు మంచి నాటకాలు రావటంలేదని, ఇలా ఆడిపోసుకోవటం అన్యాయమే అనిపిస్తున్నది ఏం చూసి ఈ పోటీలకు రావాలి? వచ్చి సాధించేదేమిటి? అన్న సమస్య చాల నాటక సంస్థలను వేధిస్తున్నట్లు కన్పిస్తున్నది క్రిందటేడు బహుమతి నాటకములు ప్రదర్శించిన సంస్థలు ఈ సంవత్సరం పోటీలకు రాలేదంటే కారణం? ఈ చెప్పే కారణాలు నేననుకొన్నవి మాత్రమే

ఒక దూర ప్రదేశమునుంచి పోటీలకు రావాలంటే నాటక సంస్థలు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన వలసి వస్తుంది ఔత్సాహికుల విషయంలో ఈ ఇబ్బందులు మరీ ఎక్కువ పోటీలకు వస్తున్న సంస్థలన్నీ చందాలు వేసుకోనో, చందాలడిగో, అదీ దొరకకపోతే అప్పుచేసో వస్తున్నాయి వీరి శ్రమలకు పోటీల నిర్వాహకులు తగిన ఉత్సాహాన్ని కల్పిస్తున్నారా అనేది కూడా అనుమానమే! గెలిచిన వారికి కప్పు, గెలవని వారికి ఇంటి దగ్గర అప్పు మాత్రమే మిగులుతున్నాయి ఈ గెలిచినవారు కూడా తమ ఇంటి దగ్గర ఈ కప్పులు చూస్తూ అప్పు లెలా తీర్చాలో తెలియక ఆరాటపడవలసి వస్తున్నది ఈనాటి ఆర్థిక వ్యవస్థలో చాల అనుభవం, శిక్షణ, పేరు, కలిగిన సంస్థలు మరువత్సరం పోటీలకు రావటం లేదంటే ఇందుకు కారణం వాటి వాటి ఆర్థిక దుస్థితే అని చెప్పాలి కనుక పోటీల నిర్వాహకులు బహుమతి పొందిన సమాజాలకే కేవలం కప్పుల్లాంటివి ఇచ్చి కళ్ళనీళ్ళు తుడవడంకన్నా, ఆ బహుమతి సంపాదించిన సంస్థలు బలపడి మరింత ఉత్సాహంతో ఇంకా మంచి నాటకాలు ప్రదర్శించేందుకు వీలుగా ఏదైన ధనరూపమైన బహుమతిని నిర్ణయిస్తే చాలా సంస్థలు ఇప్పటికన్న అన్ని విధాల మంచి నాటకాలను ప్రదర్శించే అవకాశం ఉంటుంది అటు నిర్వాహకులు మా పరిషత్తుకు ఇన్ని మంచి నాటకాలు వచ్చాయి అని గుండెమీద చేయి వేసుకొని చెప్పే ఆస్కారమూ ఉంటుంది కేవలం జ్ఞాపక చిహ్నాలుగా బహుమతులుంచినంతకాలం కళారంగానికి మిగిలేవి కొడిగట్టినదీపాలే.

నటుల్లో కూడా ఒక విధమైన నిరాశ నిస్పృహ కన్పిస్తున్నాయి. ఎన్నాళ్ళున్నా, ఎన్నేళ్ళున్నా పోటీలో ఏవో బహుమతులు పొందటం స్వగ్రామంలో 'మనవాడు గొప్పవాడ'నిపించుకోవటంతప్ప వ్యక్తిగతంగా అతని కేమీ లాభంలేదు ఈ పరిషత్తులూ—స్వగ్రామం 'షటిల్ సర్వీస్' లోనే జీవితమంతా గడచిపోతున్నది జీవితాన్ని కళ్ళతో ముడి పెట్టుకోవటం ఎలా అనే బాధ నటుల్లో ఎక్కువవుతున్నదేమో? అందువలన నాటక సంస్థలు పోటీలలో పాల్గొనాలని ఎంతో ఉత్సాహంతో ప్రయత్నించినా నటులలో గూడుకట్టుకున్న నిరాశ నిస్పృహలు ఈ పని చేయటానికి అడ్డుగా ఉన్నాయి ఈ కారణంగా చాల సంస్థలు పోటీలలో పాల్గొనటం మానేస్తున్నాయి

ఈ కళారంగాన్ని ఆదుకొనవలసిన పెద్దలు అంటే చలనచిత్ర పరిశ్రమలోని నిర్మాతలు కాస్త శీత కన్ను వేశారా అనిపిస్తుంది ఏమాత్రం నటనానుభవంలేని వ్యక్తులను తీసుకుని శిక్షణ ఇచ్చి సినిమాలలోకి తీసుకోవడానికన్నా సిద్ధపడుతున్నారు గాని అనుభవము' ఆకారముఉన్న ఔత్సాహిక నటులపై వారి దృష్టి అంతగా పోవటంలేదు!

ఇక్కడ ఒక చిన్న విషయం —సినిమావేరు, నాటకంవేరు అనేవాళ్ళూ ఉండవచ్చు కాని ఒక్క ప్రక్రియలోతప్ప మిగిలిన విషయాలలో నాటకానికి సినిమాకి ఆట్టే తేడా కన్పించదు ప్రస్తుత పరిస్థితి ననుబట్టి చెప్పాలంటే సర్వ కళా సంయుతము, సర్వ జనాదరణీయము, తత్కాలీనముఅయిన నాటకానికి అక్షరత్వాన్ని, లేదా బహు కాలస్థిరత్వాన్ని కల్పించి పెట్టేదే సినిమా ప్రక్రియ నాటకరంగంలో ప్రదర్శనానుకూల విషయాలన, యోచనైక సాధ్యాలను సులభంగా, సార్వ జనీనంగా రూపొందించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిన ప్రక్రియే సినిమా ఈ విషయాన్ని విస్మరించో, విస్మరిద్దామనుకునో సినిమావేరు నాటకంవేరు అని వాదించటం 'ఆదో' రకమైన సరదా' కొందరికి

నాటక పరిషత్తులూ—పోటీలూ పది కాలాల పాటు సక్రమంగానిలబడాలంటే, నటనలో ఉన్నత ప్రమాణాలు నెలకొనాలంటే, సినిమా—నాటకం ఈ రెండూ దృశ్య కావ్యాలే అని గమనించి, చలన చిత్ర పరిశ్రమ నాటకరంగంలో యోగ్యతైన నటీ నటులను ఆదుకొని యథాశక్తి ఉత్సాహాన్ని కల్గించాల్సి ఉంటుంది కారణమేమంటే ఈనాడు నటులు కడుపు కాల్చుకుని కళారాధన చేసేస్థితిలోలేరు అసలు కళ పరమార్థం కూడా అది కాదేమో నిర్మల మానస సరోవరంలో ఉద్భవించవలసిన కళాతరంగాలు మండే గుండెల్లో, కాలే కడుపుల్లో ఇంకిపోతాయేతప్ప వెలికిరావు బతుకలేని మానవుడు, బతుకు భయంతో సతమతమయ్యే మానవుడు కళారాధన చేయలేడు. అది సాధ్యమూకాదు. కడుపునిండితేతప్ప ఆ కళా హృదయంలో ప్రవహించే నైవ్య బిసురుల వింత సొగసులు వెలికిరావు

పరపతిగల పెద్దలు పట్టుబడితేనే కళారంగానికొక కళ, కాంతి.

అయితే పోటీలకు వచ్చే సంస్థలు కూడా తమ ప్రతిష్ఠను నిలబెట్టుకోవటం చాలా అవసరం ప్రతి సంస్థ కూడా ఒకవేళ తాము నిర్వహించే పోటీలలో పేరిచ్చినసంస్థ ప్రదర్శనం ఇవ్వకపోతే తమ ప్రేక్షకులకు కలిగే అసంతృప్తి, తాము పేరిచ్చి వెళ్ళకపోవటంవల్ల ఇంకొక పరిషత్తులో కూడా కలుగుతుందనే విషయాన్ని గుర్తిస్తే ఇలా మాని వేయటాలు జరుగవేమో

పోటీలు జరిపే సంస్థలు మాత్రం సక్రమంగా ఉన్నాయా ప్రశ్న రావచ్చు ఏ సంస్థా లోపం కతీతంగా ఉండదు ఆ లోపాలు తమకు తెలియకపోతే, ఇతరులు చెప్పినప్పుడు "మహా చెప్పావులేవోయ్" అని కోప్పడక యథార్థ్యాన్ని ఆలోచించి వీలైతే దిద్దుకోవాలి ఈ సంస్థల్లోవున్న పెద్ద పొరపాటు పోటీలు జరగటంకోసం పోటీలకు తయారు కావటం ఒక నాటకంలో నలుగురు ప్రముఖులు, ముగ్గురు అర్జునులు మాదిరిగా ఇలా ఒకే వూళ్ళో రెండు మూడు పోటీలు జరిపే సంస్థ లుండటం చూస్తే కళా కల్పతరువుకు కాస్త కాస్తగా చదలంటుతున్నాయా అనే బాధ కలుగుతుంది పెద్దలంతా 'సంఘే శక్తి కలౌయుగే' లని వూరికే ఆర్భాటం చేస్తున్నారో మరి?

సాధారణంగా పరిషత్తులు చేసే మరొక పొరపాటు వసతిలేనిచోట పోటీలు నడపటం ఆంధ్రులకు నాటక కళమీద వున్నమొగ్గు, శ్రద్ధ, ఆ నాటకానికి పునాది అయిన రంగస్థలం మీద లేకపోవటం కొంత విచారంగానే వుంది తీర్చిదిద్దిన రంగస్థలంవుంటే పోటీలు సక్రమంగా జరపటానికి వీలుగా వుంటుంది అంతెందుకు, 10 సంవత్సరాలుగా తిరుపతిలో పోటీలు నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వరా నాట్య కళాపరిషత్‌కు కూడా ఈనాటివరకు సరైన రంగాలంకరణ సామగ్రిలేదు—ఉత్సాహం కలిగించే రంగస్థలం లేకపోతే మనం చేసే కళాపోషక యత్నాలు శోషించుతున్నాయి, తరతరాల కళాభిరుచి తరిగిపోయి కొద్ది సంవత్సరాలలో కళా చైతన్యమే జీర్ణించిపోయే ప్రమాదంవుంది! కనుక పరిషత్తులు తగిన రంగస్థలం విషయంలో శ్రద్ధ వహిస్తే మంచిది బహుమతి నిర్ణేతలు కూర్చున్నంతమేరా భద్రంగావుంటే చాలనుకుంటే ఇక జనంతో పనే వుండదు తగిన చోటు లేకపోతే, క్రిక్కిరిసిన జనం దగ్గరగా బహుమతి నిర్ణేతలకు స్థానాలు ఏర్పాటుచేస్తే, వీళ్లు ఆ రంగంమీద వాళ్ళు పాడుతున్నారో ఆడుతున్నారో చూచే దెలా, బహుమతులు నిర్ణయించే దెలా! ఈ ఇబ్బందులను గమనించి, బహుమతి నిర్ణేతలకు, పత్రికల వారికి వేర్వేరు స్థానాలు కేటాయించకపోతే, సవ్యమైన బహుమతి నిర్ణయం కూడా లోకం దృష్టిలో అపహాస్యంపాలయ్యే అవకాశం వుంది

ప్రతి ఏడు పోటీ అనంతరం వచ్చిన వివిధాభిప్రాయాలను ముందుంచుకొని పరిషత్తులు ఆవేశరహితంగా ఆత్మ విమర్శన చేసుకుంటే చాలా సత్ఫలితాలు కలుగుతాయి పెద్ద మనసు చెప్పేటంతటి వాళ్లు అనుకుంటే చేయదగిందేం లేదు మరి!

—నాగరాజ్ ●



'నవరాత్రి'లో సావిత్రి, గుమ్మడి

సినిమా

పరమానందయ్య శిష్యుల కథ

శివభక్తి తత్పరుడు, పరమ భక్తాగ్రేసరుడు అయిన నందివర్ధన మహారాజు భక్తి పారవశ్యంచేత కాబోలు, సృష్టిలోని ప్రతి వస్తువులో శివలింగాన్ని చూడగలగటం, ఆ దృశ్యాన్ని మనం చూడగలగటం— ఒక్కసారి అనుభవజ్ఞులైన దర్శకులు శ్రీ సి. పుల్లయ్యగారిని గుర్తుకు తెస్తాయి.

నందివర్ధనమహారాజు త్రాగుబోతేకావచ్చు, కాని పరమ భక్తాగ్రేసరుడు తాగినమైకంలో కూడా పరమ శివుని ధ్యానిస్తాడు. అదే వూపులో 'రాజనర్తకి'ని పూజిస్తాడు. సి పుల్లయ్యగారి సృష్టి యిది.

'పరమానందయ్య శిష్యుల కథ' పేరున వెలువడిన శ్రీ దేవీ ప్రొడక్షన్స్ వారి ఈ చిత్రంలో పరమానందయ్యగారు, వారి ఏడుగురు శిష్యులూ మధ్య మధ్యలో కనిపించి మనకు మామూలు స్థాయి వినోదాన్నిప్పిస్తారు.

మూడున్నర గంటల యీ చిత్రంలో దర్శకులు తమ మూడున్నర దశాబ్దాల ప్రతిభను, అనుభవాన్ని చొప్పించి తీశారు. కాలాన్నిబట్టి, సమకాలీన చిత్రాలస్థాయిని బట్టి కురు వృద్ధులైన దర్శకులు ఎలా మార్పు చెందింది వివరించేది చిత్రం

చిత్రం మొత్తంలో ప్రతి ఒక్కరి దృష్టిని ఆకట్టుకొనేవి రెండు ముఖ్యాంశాలు

మొదటిది సంగీతం. చిత్రంలో ప్రతి అడుగునా సంగీత దర్శకుడు కనిపిస్తాడు. ఉన్నంతలో పాటలు ముచ్చటగా ఉన్నాయి

ఆ తరువాత సెట్టింగ్స్. సినిమా చూసినంతసేపూ ఆ భారాన్ని దూరం చేయగలిగింది సెట్టింగ్స్. ప్రతి సెట్టింగ్ ఒక కన్నుల విందు!

—వా



'కన్నెమనసులు'లో రామ్మోహన్, సుకన్య

లారెన్స్ ఆఫ్ అరేబియా

టర్కీపై అరబ్బుల తొలి తిరుగుబాటులో ఎముకలు కొరికే చలికి అలవాటు పడ్డ ఒక బ్రిటిష్ మిలిటరీ అధికారి, నిప్పులు చెరిగే ఎండల్లో అరబ్బులతో కలిసి పనిచేసి వారిలో సంఘీభావాన్ని నెలకొల్పి, సుప్రతిష్ఠమైన యుద్ధ నిపుణులుగా రూపొందించటంలో అతను ఎదుర్కొన్న సమస్యలు, క్లిష్ట పరిస్థితులను 'లారెన్స్ ఆఫ్ అరేబియా'లో చక్కగా చూపారు చరిత్రలోని కొన్ని విషయాలను ప్రస్ఫుటింపచేసే ఈ చిత్రంలో లారెన్స్‌గా పీటర్ వో టూల్ పరిచయం చేయబడ్డాడు పీటర్ వో టూల్ కేంబ్రిడ్జిపట్టభద్రుడు లారెన్స్‌గా పీటర్ వోటూల్ ఈ చిత్రంలో ప్రదర్శించిన నటన అత్యంత ప్రతిభావంతంగా ఉంది. ప్రిన్స్ ఫీసల్‌గా ఎలెక్ గైనెస్, అరబ్ షరీక్‌గా ఆంటోనీ క్విన్, జనరల్ ఎలెన్‌బిగా జాన్ హాకిన్స్ నటన ప్రశంసనీయంగా ఉంది మిగతా పాత్రలలో జోస్ ఫెరర్, ఆంటోనీ క్వేల్, క్లాడ్ రెయిన్స్, ఆర్థర్ కెన్నడీ, ఒమర్ షరీఫ్‌లు చక్కగా నటించారు

దాదాపు మూడు గంటలపైగా ప్రదర్శింపబడిన ఈ చిత్రం సూపర్ పానావిషన్‌లో పంచ రంగుల్లో నిర్మింపబడింది. భయంకరమైన ఎడారిదృశ్యాలు,ఒంటెలపై స్వారీలు, విస్మయాన్ని కలిగించేయుద్ధాలు, రైళ్లను మందుపెట్టి పేల్చటం మొదలైన దృశ్యాలు అతి సహజంగా చిత్రీకరించారు అక్కడక్కడ సున్నితమైన హాస్యం ఉన్నా యింత పెద్ద చిత్రంలో ఒక్క స్త్రీ పాత్ర కూడా లేకపోవటం విశేషం

ఏడు ఆస్కార్‌లను, బహుముఖ ప్రశంసలను అందుకున్న ఈ చిత్రానికి నిర్మాత శామ్ స్పీగెల్, దర్శకుడు డెవిడ్‌లీన్ ఈ చిత్రం ప్రస్తుతం మద్రాసులోని 'సఫైర్'లో ప్రదర్శింపబడుతూ ఉంది

— మాధవ్

దక్షిణభారత ఫిలిం జర్నలిస్టుల సంఘం అభినందన సమావేశం

భారత ప్రభుత్వంచే ప్రద్మశ్రీ బిరుదు నందుకున్న దక్షిణాది నటీ నటులు శ్రీమతి భానుమతి రామకృష్ణ, శ్రీ శివాజీగణేశన్‌లను అభినందించడానికి దక్షిణభారత ఫిలిం జర్నలిస్టుల సంఘంవారు యిటీవల మద్రాసులోని న్యూఉడ్‌లాండ్సులో అభినందన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి పలువురు పత్రికా రచయితలు హాజరయారు.

ప్రారంభంలో శ్రీ సుబ్రహ్మణ్యం తమ స్వాగతోపన్యాసంలో ముఖ్యఅతిధులకు, ఆహూతులకు స్వాగతం చెప్తూ, పద్మశ్రీలను ఆహ్వానించి యింతకుముందే ఎన్నో సంఘాలు సమావేశమై అభినందించాయని, దక్షిణ భారత ఫిలిం జర్నలిస్టుల సంఘం అభినందన సమావేశాన్ని కొంత ఆలస్యంగా ఏర్పాటు చేసినా త్వరలో పద్మశ్రీ లిద్దరూ భారత రాష్ట్రపతినుంచి బిరుదులను గ్రహించడానికి ఢిల్లీ వెళ్ళనున్నారు కనుక దీని ప్రాముఖ్యత దీనికున్నదని అన్నారు. తర్వాత సంఘం అధ్యక్షులు శ్రీ కరీం పద్మశ్రీల కళాసేవను, నటనా చాతుర్యాన్ని గురించి చెప్పారు. కొందరు పత్రికా రచయితలు పద్మశ్రీల ప్రతిభను, వారు భవిష్యత్తులో యింకా కృషిచేసి కాలానుగుణంగా తమ నటనలో వైవిధ్యాన్ని చూపించి యింకా పెద్ద బిరుదులను పొందాలని ఆకాంక్షిస్తూ ప్రసంగించారు. తర్వాత పద్మశ్రీ శివాజీ గణేశన్ మాట్లాడుతూ, పత్రికా రచయితలకూ నటీ నటులకూ ఉన్న సంబంధం విడదీయ లేనిదనీ, నిర్మొహమాటంగా లోపాలను సూచించినప్పుడే నటీ నటుల పురోభివృద్ధికి అవకాశం ఉంటుందనీ, కాలానుగుణంగా నటీ నటులు తమ నటనను మార్పు చేసుకుంటూ ఉండాలని చెప్పి, తమ నాహ్వానించిన సంఘంవారికి, సమావేశానికి, హాజరైన పత్రికా రచయితలకు కృతజ్ఞతలు తెలిపారు పద్మశ్రీ భానుమతి రామకృష్ణ తమ ప్రసంగంలో, కొందరు పత్రికా రచయితలు అంతకుముందు చేసిన ప్రసంగాల్లో సూచించిన విధంగా అవకాశంవస్తే తప్పక కృషిచేసి మంచి నటనను ప్రదర్శించి యింకా పెద్ద పెద్ద బిరుదులు సంపాదించడానికి ప్రయత్నిస్తామని అన్నారు. తమ నాహ్వానించిన సంఘంవారికి, ఆహూతులకు కృతజ్ఞతలను తెలిపారు. అనంతరం శ్రీ షణ్ముగం వందన సమర్పణ చేశారు. జనగణమనతో సమావేశం జయప్రదంగా ముగిసింది

-మాధవ్



'నవరాత్రి'లో నాగేశ్వరరావు

చంద్రకళ, రమ కూచిపూడి నృత్యాలు

ఈమధ్య మైలాపూర్‌లోను, టి నగర్‌లోను చంద్రకళ, యడవిల్లి రమ కూచిపూడి నృత్య ప్రదర్శనలు జరిగాయి. వీరిరువురికి గురువు శ్రీ వెంపటి చినసత్యం.

ఒకవైపు తను స్కూలుకు పోయి చదువుతూ, మరోవైపు కూచిపూడి ఆర్ట్ అకాడమీలో నృత్యం అభ్యసించి అనేకచోట్ల కూచిపూడి నృత్య ప్రదర్శనాలివ్వడం, చక్కటి హావ, భావ ప్రదర్శన చూపి ప్రజల మన్నన లందుకొన్న చిరంజీవి చంద్రకళ ప్రశంసనీయురాలు ఈనాటి కూచిపూడి నర్తకీమణులలో ఒకరిగా గౌరవింపబడటం గొప్ప విషయం.

యడవిల్లి రమ నృత్యశిక్షణ పొందీ మదరాసు నగరంలోనే గాక ఆంధ్ర, ఒరిస్సా, బెంగాల్ మొదలగు యితర రాష్ట్రాలలో కూడా నృత్య ప్రదర్శనలిచ్చి కూచిపూడి నృత్యసంస్కృతిని చాటిన యీనాటి ప్రముఖ నర్తకీమణులలో ఒకరు.

'అగ్గిబరాటా'

విరల్ ప్రొడక్షన్స్‌వారు 'అగ్గిబరాటా' చిత్రాన్ని పూర్తి చేశారు. ఈ చిత్రాన్ని త్వరలో విడుదల చేయబోతున్నారు.



ఇటీవలనే మద్రాసులో జరిగిన ఆంధ్ర బాలానందసంఘం వినోద ప్రదర్శనాల్లో పాల్గొన్న బాలబాలికలు

అవీ, ఇవీ...

చరిత్రకారుని సహాయంతో చిత్రనిర్మాణం

ఓరియంటల్ పిక్చర్స్ కార్పొరేషన్ వారు విడుదల చేసిన 'దేవదాసి' చిత్రం నాంకే తికవర్గంలో ఆ రోజుల్లో గొప్ప చరిత్ర కారుడుగా పేరుపొందిన ఫాదర్ హెరాస్ పేరు చూసి ప్రేక్షకులు ఆశ్చర్యపో యారు. ఆయన ఆ చిత్రంలో చరిత్రకు సంబంధించిన విషయాలలో ప్రత్యేక సలహాదారుగా ప్రముఖ పాత్రను నిర్వహిం చారు.

ఫాదర్ హెరాస్ బొంబాయిలోని సెయింట్ జేవియర్ కళాశాలలో హిస్టరి ప్రొఫెసర్‌గా ముప్ఫయి సంవత్సరాలు పని చేశారు. ఆయన ఇండియాలో ఉన్నంత కాలం ఏకాగ్రతతో చరిత్రకి సంబంధిం చిన విషయాలపై పరిశోధనలు సలిపి అనేక గ్రంథాలు రచించారు.

'దేవదాసి' చిత్రానికి దర్శకత్వం వహిం చిన నావల్ డి గాంధి కూడా సెయింట్ జేవియర్ కాలేజినుంచే పట్టభద్రుడయ్యాడు 'దేవదాసి' నిర్మాతలు ఆ చిత్రాన్ని విదే శాల్లో ప్రదర్శించాలనే ఉద్దేశ్యంతో ఉండటంవల్ల, చరిత్రకి ఆ చిత్రంలో ఎక్కువ ప్రాముఖ్యత ఉండటంవల్ల, శ్రీ గాంధి, ఫాదర్ హెరాస్ సలహా తీసుకోడానికి ఆయనవద్దకి వెళ్లాడు. శ్రీ గాంధి చదువుకునే రోజుల్లో ఫాదర్ హెరాస్‌కి ప్రియ శిష్యుడు. ఫాదర్ హెరాస్ విజయ నగర సామ్రాజ్య వైభవాన్ని ప్రతి బింబించే హంపీ శిథిలాలను చిత్రీకరిస్తే చారిత్రాత్మకమైన ప్రాముఖ్యతతోబాటు



'నవరాత్రి'లో నాగేశ్వరరావు.

చక్కని దృశ్యాలను చిత్రీకరించినట్లు కూడా అవుతుందని, తద్వారా విదేశీయులని విశేషంగా ఆకర్షించగలదని సలహా ఇచ్చారు.

ఆయన సలహాను ఓరియంటల్ పిక్చర్స్ కార్పొరేషన్‌వారు ఆమోదించారు. వినూత్న మైన పోకడతో సాంఘికంగా రూపొందింప బడిన నాకథకు, శ్రీ గాంధి, ఫాదర్ హెరాస్ సహాయ సహకారాలతో చరిత్రాత్మకమైన వాతావరణం ఏర్పరచటంకోసం అక్కడక్కడ తగినట్లు మార్పు చేశారు. హంపీ వెళ్లి అక్కడి శిథిలాలను చక్కగా చిత్రీకరిం చారు. విజయనగరం సామ్రాజ్య కాలం నాటి శిథిలాలను చిత్రీకరించటం చిత్ర విజయాని కెంతో తోడ్పడింది.

ఓ సుప్రసిద్ధ చరిత్రకారుని సహాయ సహకారాలతో విదేశాల్లో ప్రదర్శింపబడ టానికి రూపొందింపబడిన ఈ చిత్రంలో భారతదేశంలో మొట్ట మొదటిసారిగా దక్షిణ భారతానికి చెందిన విజయ నగర సామ్రాజ్య చరిత్ర వెండి తెర కెక్కింది.

—వి. ఎస్. సుక్తాంకర్.



'విజయశంఖం'లో రాజశ్రీ

6—3—66 నాడు కరీంనగర్ అభ్యు దయ కళాసమితివారు శ్రీ అక్కినేని నాగే శ్వరరావుకి సన్మానం చేశారు. జిల్లా కలె క్టరు శ్రీ సి. బి. రావు అధ్యక్షత వహించిన ఈ సభ ముగిసిన తర్వాత 'ఇదేమిటి' అనే నాటకం ప్రదర్శించారు ఓ. వి.

పుస్తకాలు

సమగ్ర ఆంధ్ర సాహిత్యం

(తొమ్మిదవ సంపుటం. ఆరవీటి రాజులయుగం. శ్రీ ఆరుద్ర రచన. క్రౌను సైజు 264 పుటలు. వెల రూ. 5 లు ప్రకాశకులు ఎం. శేషాచలం అండ్‌కో, మద్రాసు, మచిలీపట్టణము, సికిందరాబాదు.)

నూతన రీతులలో జనసామాన్యం మనస్సులను ఆకర్షించి, వాఙ్మయపరనంలో ఉత్సాహం కలిగేటట్లు రచింపబడుతున్న సంపుటాలలో ఇది తొమ్మిదవది తక్కిన సంపుటాలలోవలెనే ఇందులో కూడా ఆరుద్రగారి సిద్ధహస్తం కానవస్తున్నది సాహిత్య చరిత్రను 'గురించి తెలియనివారికి ఇది మిక్కిలిగా ఉపయోగిస్తుంది కళ్లికోట యుద్ధానంతరం 16 వ శతాబ్ది చివరివరకూ వుండిన సాహిత్యంయొక్క చరిత్ర యిందులో సంగ్రహించబడి వున్నది. ఆయా కవుల ప్రధాన గ్రంథాలలోని కథాంశములూ, బాగోగులూ, తళుకుబెళుకులూపొందికగా చూపబడిఉన్నవి.

ఈ పుస్తకంలో ఇరవై ప్రకరణాలున్నాయి. మొదటి ప్రకరణంలో ఆరవీటి రాజుల పరిపాలనను గురించీ, అప్పటి సారస్వతాన్ని గురించీ సంగ్రహంగా ఉన్నది తర్వాతి ప్రకరణంలో ఎనభైమందికిపైగా కవులను గురించీ, వారి రచనలను గురించీ కొన్ని యెడల విపులంగానూ, కొన్ని యెడల సంగ్రహంగానూ వివరణాలు ఉన్నవి

ఈ సంపుటంలోవున్న కవులలో చాలామందిని గురించి కొందరు వాఙ్మయాభిమానులకే తెలియడం కష్టం. కొందరిపేర్లు తెలిసినా, చాలామందికి వారి పుస్తకాలను గురించిన విశేషాలు తెలియవంటే అతిశయోక్తి కాదు. అట్టి విశేషాలు ఇందులో ఎన్నోకానవస్తాయి.

పచ్చకప్పురపు తిరువేంగళరాజును గురించి వ్రాసేటప్పుడు అతని చొక్కనాథ చరిత్రను గురించి చక్కగా వివరించబడినది దోనూరి—కోనేరునాథుని బాలభాగవతాన్ని గురించి వ్రాస్తూ ఉన్నప్పుడు, అతడు పోతరాజుగారిని ఏ విధంగా అనుసరించినదీ సప్రమాణంగా చూపబడినది సిద్ధిరాజు తిమ్మరాజు పరమయోగి విలాసంలో పన్నిద్దరాళ్వారులతో కలిపి పదిహేనుమంది పరమయోగులను గురించి చెప్పడం ఎంతో ఉపయోగంగా ఉన్నది జక్కరాజు వెంకటకవి—, అయ్యలరాజు కవులు వ్రాసిన శాస్త్ర గ్రంథాలను గురించిన చర్చ శాలివిస్తరంగా, సముచితంగా సాగింది పెదపాటి జగ్గన్న కూర్చిన ప్రబంధ రత్నాకరంలో మరుగుపడియున్న అజ్ఞాత కవులను గురించి యిచ్చిన వివరాలు ఎంతో ఉపయోగమైనవి ఈవిధంగానే ఒక అజ్ఞాత గ్రంథ సంధాత కూర్చిన సంకలనం గురించి వ్రాసిన విషయాలు కూడా ఎంతో ఉపయోగిస్తాయి

117 వ పుటలో పేరు తెలియని ఒక కవి రచించిన చక్కని పద్యం ఒకటి

"ఈకలు నల్లనైనవని
యెంచి విశాలశాఖ యు
త్సేకముతోడ నెక్కి విక
సించి ఫలంబులు నేవు మేయుచున్
గోకిల రీతి మందు నను
కొన్నను సంటవికాక, పాపపుం
గాకమ! నీకు సమ్మధుర
గానము గల్గునె యెన్ని పల్కినన్ గె"

అనేది కానవస్తున్న సంస్కృతంలో వున్న

'కాకః కృష్ణః పికః కృష్ణః
కోభేదః పికకాకయోః
వసంతకాలే సంప్రాప్తే
కాకః కాకః పికః పికః

అనే శ్లోకమున్నూ

'కర్ణారుం తుద మంతరేణ రణితం
గా హన్య కాక స్వయం
మాకండం మకరంద శాలిన మిహ
త్వాం మన్మహే కోకిలమ్.'

అనే శ్లోక భాగమూ సంయ పద్యానికి ఆధారములయి యుండవచ్చును.

మట్ల అనంతరాజును గురించి వ్రాసిన పదకుండో ప్రకరణంలో అతని కీర్తి ప్రతిష్ఠలను వెల్లడించే చరిత్రాంశాలు వివరించబడివున్నవి. అతని కాకుత్‌స్థ విజయ కావ్య విమర్శ చాలా హుందాగా నడచినది కవి చౌడప్ప, తరిగొప్పుల మల్లన, బమ్మెర కవులు మున్నగువారినిగూర్చి కూడా చక్కని పరిశీలన జరిగింది. బిజ్జల తిమ్మరాజు వ్రాసిన అనర్ఘ రాఘవ ప్రబంధాన్ని గురించి వ్రాస్తూ, సంస్కృతంలోని అనర్ఘ రాఘవ నాటకమును రచించిన మురారి విని అనుసరించే "మురారేస్తృతీయః పంథాః" అనే నానుడి పుట్టిరేదని (పుట 197) ఇందులో చెప్పబడినది. కాని, ఆ నానుడి మీమాంసకుడైన మురారి మిశ్రునిబట్టి ఏర్పడినదేకాని మురారి కవిని బట్టి ఏర్పడినదికాదు. మీమాంసాశాస్త్రంలో భాట్టుని దొక మార్గం. ప్రాభాకరమార్గం యింకొకటి. మురారి మిశ్రుడిది పై రెంటికీ భిన్నమైన మూడవమార్గం దాన్ని అనుసరించే సంయ నానుడి వచ్చిందని శాస్త్రవేత్తల అభిప్రాయం. ఒకవేళ మురారి కవినిబట్టి యీమాట ఏర్పడినదన్న భ్రాంతి కలిగినా, తక్కిన రెండు మార్గాలూ ఏవో అనర్ఘ రాఘవంలోని మూడవ పద్ధతి యేదో వివరించాలి. దాన్ని ఎవ్వరూ వివరించినట్లు కానరాలేదు.


ఇతర కవులను గురించి వ్రాసిన 20 వ ప్రకరణంలో నలభై యిద్దరు కవులను గురించి చక్కని విషయాలు సంగ్రహంగా ఉన్నవి. ఇంతమంది కవుల సమాచారాన్ని సాధ్యమయినంత అధికంగా సమకూర్చిన రచయిత పరిశ్రమ మిక్కిలి కొనియాడదగినది.

ఈ సంపుటానికి శ్రీ నేలటూరివారి మూడు పుటల పీఠిక ఉన్నది అందులో మొత్తం రచనా పద్ధతిలోనూ, యుగ విభాగంలోనూ, విశేషించి యీ సంపుటంలోనూ ఎట్టి లోపాలున్నదీ చెప్పబడినవి 'ఆరుద్రగారివంటి ఉత్తమశ్రేణికి చెందిన కవి చరిత్రకారులు ఆదర్శప్రాయమైన గ్రంథాలనే తయారుచేస్తే బాగా ఉంటుం'దని సలహా ఈయబడివున్నది పుస్తకానికివుండే పీఠికలో పుస్తకంలోని బాగులను కొన్నింటినైనా చూపితే బాగాఉండేది. లేకుంటే పీఠిక చదివినతర్వాత పాఠకునికి పుస్తకాన్ని చదివి, అందలి విషయాన్ని గ్రహించవలెననే ఉత్సాహం సన్నగిల్లిపోతుంది.

—ఆంగీరస



ఇంటెగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (మద్రాసు) లో జరిగిన ఉగాది ఉత్సవాలలో మద్రాసు గవర్నరు శ్రీ పి. చంద్రారెడ్డి ప్రసంగించినప్పుడు తీసిన చిత్రం. (కూర్చుని ఉన్నవారు) శ్రీ డి. పి. నరసరాజు, శ్రీ ఐ. హైదరీ, జనరల్ మేనేజరు ఐ, సి. ఎఫ్, పద్మశ్రీ భానుమతీ రామకృష్ణ



అమ్మచేత చీవాట్లు తిని ఏడుస్తూ మెట్లు దిగుతున్న ఈర (ఊహాజీవులు)

ఊ హా జీ వు లు

రష్యన్ మూలం శ్రీ ఎస్ నోసొవ్ అను వాదం శ్రీ పుప్పల లక్ష్మణరావు చిత్రాలు శ్రీ ఇ సెమ్యొనొవ్ 16 పేజీలు వెల నలభై పైసలు ప్రచురణ ప్రగతి ప్రచురణాలయం, మాస్కో

పిల్లలలో వూహా శక్తిని పెంపొందించేందుకు 'ఊహాజీవులు' బాగా ఉపకరిస్తుంది వూహించి ఏదైనా వినోదార్థం చెప్పడంవేరు, అసత్యాలను స్వార్థానికి చెప్పటంవేరు వూహావల్ల ఎవరికీ ఎలాంటి నష్టమూ లేకపోగా వినోదాన్ని కలిగిస్తుంది కానీ అసత్యాలాడటంవల్ల మరొకరికి కష్టనష్టాలు సంభవించే ప్రమాదం ఉంది స్వార్థంకోసం అసత్యాలాడటం, దానివల్ల మరొకరు బాధపడటం జరుగుతుంది ఇందులో మిషూత్క, స్టాసిక్‌లు వూహాలతో గంధర్వ కథలల్లి వినోదించేవారు కానీ ఇగోర్ అసత్యాలాడి తన చెల్లెకి చీవాట్లు తెప్పించి తాను లాభం పొందాలని చూసేవాడు అలా అబద్ధాలను కథగా అల్లి చెప్పటంవల్ల తనకి జామ్ దక్కిందని గర్వంగా చెప్పుకుంటాడు మిషూత్క స్టాసిక్‌లతో అది విని వాళ్లిద్దరూ ఇగోర్‌ని ఈసడించుకొని తమవద్దనుంచి వెళ్లగొట్టి, ఇంటివద్ద ఏడుస్తున్న ఈరకు తాము కొనుక్కున్న ఐస్‌క్రీంలో భాగం పెడతారు కథ చక్కగా నీతి బోధకంగా ఉంది ముఖచిత్రం, లోపల రంగుల చిత్రాలు ఆకర్షణీయంగా ఉండి పఠనాసక్తిని పెంపొందించే రీతిలో ఉన్నాయి

క వి త

శ్రీ ఏ విజయభాస్కరరెడ్డి సంపాదకత్వాన వెలువడిన సాహిత్య మాసపత్రిక 'కవిత'

పాఠకుల అభిరుచులు విభిన్న రీతులలో ఉంటాయి అందర్నీ ఆకట్టుకునేందుకు విభిన్న విషయాలపై రూపొందించిన రచనలను పత్రికద్వారా అందజేస్తేనే జనాదరణ లభిస్తుంది అదే ఉద్దేశ్యంతో కవితలో పద్య గేయ రచనలతోబాటు చక్కని కథలను, ప్రముఖుల వ్యాసాలను, చలనచిత్రరంగానికి సంబంధించిన విశేషాలను, కార్టూన్‌లను, అక్కడక్కడ జోక్స్‌తో రూపొందించారు కవిత ప్రారంభ సంచికైనా చూడచక్కగా అందమైన రంగుల ముఖచిత్రంతో చక్కనిముద్రణ, గెటప్‌లతో ఆకర్షణీయంగా ఉంది కొత్త రచయితలకు ప్రోత్సాహమివ్వటం కవిత ముఖ్యోద్దేశం అని సంపాదకీయంలో పేర్కొన్నారు రచనా వ్యాసంగాన్ని పెంపొందింపజేసుకోవాలనే వర్ధమాన రచయితలకు ప్రోత్సాహం కవితనుంచి లభించటం హర్షించదగ్గ విషయం విలువైన రచనలను పాఠకుల కందజేయటానికి 'గ్రంథభాగం' అన్న శీర్షికను కవితలో ప్రవేశపెట్టటం ఎంతో ఉపయోగాన్ని సూచిస్తుంది

112 పేజీలుగల ఈ సాహిత్య మాసపత్రిక వెల 60 పైసలు సంవత్సర చందా 7 రూపాయలు కాపీలకు కవిత, సాహిత్య మాసపత్రిక, బ్రాడీపేట గుంటూరు—2

ఎ దు రి లు

కథల సంపుటి రచన గోవిందరాజు శ్రీనివాస మూర్తి 120 పేజీలు వెల రెండున్నర రూపాయలు ప్రతులకు నవోదయ పబ్లిషర్స్, ఏలూరు రోడ్, విజయవాడ

ఏడు చక్కని కథలుగల పుస్తకం ఎదురిల్లు కథలన్నిటిలో రచయిత వాస్తవికతను ప్రతిబింబింపజేయ ప్రయత్నించారు కానీ కొన్ని సందర్భాలలో చెప్పదలచుకున్న విషయాన్ని సూటిగా చెప్పలేకపోయారు వారాలుచేసుకుని చదువుకుని, ఎలాగో చివరికి డిప్టీ అయి, రిటయిరైన ముకుందరావు తన కెవ్వరూ పిల్లనిచ్చేవారు లేక పెళ్లి చేసుకోకపోవటం, జీవిత భాగస్వామిని లేనిదే ఆత్మకథకు ఆకర్షణ లేదని అసత్యాలను రాసుకోడం కొంత అసహజంగానే కన్పిస్తాయి మొదటి కథ 'పక్కింటిగారి'లో రెండవకథ 'సుందరం మాస్టారు' చదువుతున్నంతసేపూ సాఫీగా నడుస్తుంది ఉద్యోగం దొరకని సుందరరావు ఆర్నెల్లకుపైగా యిద్దరు విద్యార్థుల రూంలో ఉండి ఒకనాడు చెప్పా చెయ్యకుండా వంద రూపాయలతో ఉడాయించడం, తర్వాత కొన్ని సంవత్సరాలకు కాకతాళీయంగా స్టేషన్‌లో కనపడి అడ్రస్ తీసుకుని, కొన్నిరోజులకు వంద రూపాయల డ్రాఫ్ట్‌ని ఉత్తరంతో జతపరచి పంపటం పాఠకుల్ని ఆశ్చర్యపరచక మానదు 'ఇద్దరుమిత్రులు', 'ఎదురు చూచిన ఘడియ', కథల్లో రచయిత తన మనస్సులోఉన్న విషయాన్ని సూటిగా పాఠకులకు, చెప్పడానికి వెనుకాడినట్లు కన్పిస్తుంది ఒక నిరుద్యోగి దినచర్యను చక్కగా, విసుగు పుట్టించకుండా రచయిత 'రవుండ్‌రాబిన్' లో చిత్రీకరించారు. ఇక ఆఖరికథ 'ఎదురిల్లు' ఇందులో చిన్ననాటి సహపాఠి, స్నేహితుడుఅయిన రంగయ్య బీదస్థితిలోఉండి, నౌకరు ఉద్యోగం చేస్తున్నాడని బాగా చదువుకుని మంచి ఉచ్ఛస్థితిలోవున్న సుబ్బారావు అసహ్యించుకొంటాడు రంగయ్య చిన్నప్పుడు తన భర్త ప్రాణాన్ని కాపాడాడనే అభిమానంతో అతన్ని ఆదరిస్తుంది సుబ్బారావు భార్య శ్యామల కానీ తిన్నయింటివాసాలు లెక్కపెట్టినట్లుగా రంగయ్య అలారం టైంపీస్ దొంగిలించడం, శ్యామల అడిగినప్పుడు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పటం కొంత వాస్తవదూరంగా కన్పించకమానదు

మొత్తంమీద కథలన్నీ విడవకుండా చదివించే రీతిలో రూపొందింపబడ్డాయి పరిస్థితుల వర్ణన, పాత్రలచేత పలికించిన సంభాషణలు తదనుగుణంగా, చక్కగా ఉన్నాయి కన్నదాన్ని చక్కని కథగా మలిచే శక్తి, వివిధ కోణాల్లోనించి జీవితాన్ని పరిశీలించే యుక్తి రచయితలో ఉన్నాయి కాబట్టి ముందు ముందు పాఠకులు మంచి రచనలను అందుకుంటారని ఆశించవచ్చు శ్రీ బాపు చిత్రించిన అందమైన ముఖచిత్రం, ఆకర్షణీయమైన ముద్రణ 'ఎదురిల్లు' కు మరింత శోభను తెచ్చాయి —మాధవ్

నీ లి తె ర లు

పద్దెనిమిదేళ్ల వసుంధరతో, తండ్రి ధర్మారావు, పదిహేనేళ్ల నాటి విషయం చెబుతాడు శీను—స్త్రీని రక్షించటం—కాలేజీలో వాళ్లు చదువు పూర్తిచేసి పెళ్లి చేసుకోవటం—పాప పుట్టటం—వసుంధర అని నామకరణం చేయటం—ఆ వసుంధరే ప్రస్తుతంలో కథ వింటున్న పద్దెనిమిదేళ్ళ వసుంధర కావటం—కాలం అవరోధంవల్ల—వింతగా వుంటుంది ఈ తప్పు తేలికగా తొలగించుకోవచ్చు

భాషా దోషాలు తక్కువకాదు కొన్ని పదాల స్వరూపం అర్థం తెలుసుననే వీల్లేదు వాక్యాలకు—కొన్నింటికి—తలా తోకా కనిపించలేదు (పేగ) 'సూటిగా తన కళ్లలోకి చొరబడి ఉక్కిరి బిక్కిరవుతూ' 'నా ముద్దు కురిపించేదు' 'మీరే నాకు పాద సేవకులు మీమీద ఎనలేని గూళ్ళు కట్టుకొన్నాను'—ఇలాంటివి చాలా ఉన్నాయి

కథాశిల్పంలోగానీ, రచనా నైపుణ్యంలోగానీ, భాషా ప్రయోగంలోకానీ జాగ్రత్తలేదు ప్రయత్నంవుంది 'దాగుడుమూతలు' లో ఒక చిన్న మెరుపుంది 'దూరపు కొండలు' లో కాస్తంత కథానికా శిల్పం వుంది

భాషను అభివృద్ధి చేసుకొంటే, వాక్య నిర్మాణం అలవర్చుకొంటే కథల్లో అనవసర విషయాలు చెప్పటం విడిచిపెట్టితే, శిల్పం గ్రహిస్తే, పాత్రల స్వభావాలు నిశితంగా ఆలోచించి వ్రాస్తే ఏనాటికయినా రచయిత విషాదాంత కథలు బాగా వ్రాయవచ్చుననే వూహ మాత్రమే కలిగిస్తుంది ఈ కథల సంపుటి

—రవి

Edited Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press; 6&7Thambu chetty Street, Madras-1. Phones ; Editorial, 21747. Other depts , 29766. Chief Editor. S. Sambhu Prasad.

